మొజాయిక్ / ఆదివారం వార్త
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

రాజమహేంద్రవరం

fb.com/vaartha Digital

మీ నమ్మకమే మా తరగని సంపద
KAPIL GROUP
కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

8-11-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 277 పేజీలు: 8 వెల: 6.50





శుక్రవారం వందేమాతరంగీతం 150వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక స్టాంపును విడుదల చేసిన ప్రధాని మోడీ

## భరతమాత ఆరాధన మంత్రం 'వందేమాతరం'

**150వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక స్టాంపును విడుదల చేసిన ప్రధాని మోడీ**

**న్యూఢిల్లీ, నవంబరు 7:** వందేమాతరం గేయం మన చిరకాలస్వప్నం లాంటిదని, ఒక ధృఢ సంకల్పానికి బీజం వేసిందని, ఒక నిత్యపఠనమే పరమావధిగా ఉన్న మంత్రమని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. భరత మాత ఆరాధన సాధన అని అన్నారు. వందేమాతరం 150 ఏళ్ల స్మారకోత్సవాలు నిర్వహించుకుంటున్నామని ఇవి దేశప్రజలకు ఎంతో ప్రేరణనిస్తాయని మోడీ అన్నారు. వందే >>2

# రాష్ట్రంలో 3 మెగా సిటీలు




### క్లస్టర్‌వారీ విధానంలో పారిశ్రామికాభివృద్ధి
### 15 ఇండస్ట్రియల్ జోన్ల అభివృద్ధికి చర్యలు
### పెట్టుబడుల సదస్సుకు ముందే వివిధ పరిశ్రమలకు శంకుస్థాపనలు
### 12వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశంలో సిఎం చంద్రబాబు
### రూ.1,01,899 కోట్ల పెట్టుబడులు, 85,870 ఉద్యోగాలకు ఎస్ఐపిబిలో ఆమోదం

**విజయవాడ, నవంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి:** పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చిన పరిశ్రమల నుంచి ప్రతిపాదనలు తీసుకోవడంతో పాటు అవి కార్యరూపం దాల్చేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. పరిశ్రమల కోసం అవసరమైన భూములు, విద్యుత్ లభ్యత కూడా ఉండేలా చూడాలని సిఎం సూచించారు. శుక్రవారం సచివాలయంలో సిఎం చంద్రబాబు అధ్యక్షతన 12వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 26 పరిశ్రమలకు సంబంధించిన ప్రతిపాదనల్ని ఎస్ఐపిబి ఆమోదించింది. వీటి ద్వారా రూ.1,01,899 కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రానున్నాయి. ఈ ప్రాజెక్టుల ద్వారా మొత్తంగా 85,570 ఉద్యోగాలు దక్కనున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గడచిన 16 నెలల్లో జరిగిన 12 ఎస్ఐపిబి సమావేశాల ద్వారా మొత్తంగా రూ.8,08,899 కోట్ల పెట్టుబడులు, 7,05,870 ఉద్యోగాలు రానున్నాయి. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ రంగాల్లో పెట్టుబడులు వచ్చేలా చూడటం అధికారుల బాధ్యత. పెట్టుబడిదారుల నుంచి ప్రతిపాదనలు తీసుకుని సమయం వృధా కాకుండా తక్షణం ఆమోదం తెలియచేయాలి. ప్రభుత్వం నుంచి ఆమోదం పొందిన పరిశ్రమలు, ప్రాజెక్టులు గ్రౌండ్ అయ్యేలా చూసే బాధ్యతను అధికారులు తీసుకోవాలి. పెట్టుబడులు పెట్టే పరిశ్రమల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండాచూడాలి. క్షేత్రస్థాయిలో ఆయా పరిశ్రమల ఏర్పాటుకు కావాల్సిన అనుమతులను త్వరిత గతిన వచ్చేలా శ్రద్ధ పెట్టాలి. గతపాలకులు భూమి కేటాయించినా ఇప్పటికీ ప్రారంభంకాని ప్రాజెక్టులు ఎన్ని ఉన్నాయో సమీక్షించాలి. ఏ ప్రాజెక్టులైనా నిర్మాణ పురోగతి లేకపోతే అనుమతులు >>2

## వి.కావేరి ట్రావెల్స్ యజమాని అరెస్టు

### బస్సు దగ్ధం కేసులో ఎ2 ముద్దాయిగా వినోద్ కుమార్

**కర్నూలు, నవంబరు 7, ప్రభాతవార్త :** ట్రావెల్స్ బస్సు దగ్ధం కేసులో వేమూరి కావేరి ట్రావెల్స్ యజమాని వేమూరి వినోద్ కుమార్‌ను శుక్రవారం కర్నూలు పోలీసులు అరెస్టుచేశారు. 2025 అక్టోబర్ 24వ తేదీ తెల్లవారుజామున 3 గంటల సమయంలో కర్నూలుజిల్లా ఉలిందకొండ పీఎస్ పరిధిలోని కల్లూరు >>2

## ప్రజలకు స్వచ్ఛమైన మంచినీటి సరఫరా

### సాస్కి నిధుల సాయంతో పల్లెపండుగ-2: డి.సిఎం పవన్



శుక్రవారం పల్లె పండగ 2.0, జల్ జీవన్ మిషన్, స్వమిత్వ పథకాలపై సమీక్షిస్తున్న డి.సిఎం పవన్ కల్యాణ్

**విజయవాడ,నవంబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:**ప్రజలకు నాణ్యతతో కూడిన స్వచ్ఛమైన మంచి నీటి సరఫరా, గుంతలు లేని రహదారులు అందుబాటులో ఉంచాలన్నదే తన ముందున్న ప్రధాన లక్ష్యమని పవన్ కల్యాణ్ వెల్లడించారు. తన ప్రతి అడుగూ ఆ దిశగానే ఉంటాయని తెలిపారు. జల్ జీవన్ మిషన్, పల్లె పండగ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పక్కాగా పాటించాలని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. పల్లె రోడ్ల సమాచారం ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో త్వరలో సరికొత్త సాంకేతికతను ఆవిష్కరించబోతున్నట్టు తెలిపారు.జియో రూరల్ రోడ్ మేనేజ్మెంట్ సిస్టం ద్వారా గ్రామీణ రోడ్ల పూర్తి సమా చారాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకునే సాంకేతికతను అందుబాటులోకి తీసుకురానున్నట్టు తెలిపారు. సాస్కి నిధుల సాయంతో పల్లె పండగ 2.0ని >>2

## అమరావతికి రూ.7,500 కోట్ల భారీ ఆర్థిక సహకారం

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, నవంబరు 7:**ప్రజారాజధాని అమరావతి అభివృద్ధి పనులు శరవేగంగా జరిగేలా "నేషనల్ బ్యాంక్ ఫర్ ఫైనాన్సింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్మెంట్ సంస్థ (ఎన్ఎబిఎఫ్ఐడి) సంస్థ రూ.7,500 కోట్ల రుణాన్ని ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ(ఏపీ సిఆర్డిఏ)కు మంజూరు చేసింది. ఈ రుణం ద్వారా రాజధాని నగరంలోని ముఖ్యమైన నిర్మాణ పనులు వేగవంతం కానున్నాయి.రుణం మంజూరుకు సంబంధించిన పత్రాలను శుక్రవారం అమరావతిలో నిర్వహించిన కార్యక్రమంలో నేషనల్ బ్యాంక్ ఫర్ ఫైనాన్సింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్మెంట్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ సామ్యూల్ జోసెఫ్, ఎన్ఎబిఎఫ్ఐడి బ్యాంకు అందించే రుణాలు ప్రాజెక్ట్ ఫైనాన్స్ విభాగ వైస్ ప్రెసిడెంట్ కె.దినేష్, ఏపీ సిఆర్డిఏకమిషనర్ కె.కన్నబాబుకు అందజేశారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు,మంత్రి డా.పొంగూరు నారాయణ పాల్గొన్నారు. అమరావతి నిర్మాణానికి లభించిన ఈ యొక్క ఆర్థిక సహకారం ద్వారా రాజధాని నిర్మాణ అభివృద్ధి పనులు వేగంగా జరగనున్నాయి.ప్రజారాజధాని అమరావతిని ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో తీర్చిదిద్దడంలో ఎన్ఎబిఎఫ్ఐడి అందజేసిన ఆర్థిక సహకారం ముఖ్యమైనదిగా పరిగణించబడుతోంది.




ఇక్కడ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి.
376 నాణ్యతా చెక్ పాయింట్లు
ధృవీకరించబడిన కారు వివరాలు*
1 సంవత్సరం వరకు వారంటీ మరియు 3 ఉచిత సేవలు*
*నియమాలు మరియు షరతులు వర్తిస్తాయి. Verified Car History మరియు Warranty కేవలం True Value చే ధృవీకరించబడిన కార్లపై మాత్రమే వర్తిస్తుంది. ఉచిత సేవలు లేబర్ ఛార్జీలపై మాత్రమే వర్తిస్తాయి. గ్లాస్ పై నలుపు ఛాయలు లైటింగ్ ప్రభావం వలన కలిగింది. ఉపయోగించిన చిత్రాలు కేవలం ఉదాహరణ లక్ష్యాలు కోసం మాత్రమే.
సందేహాలు కోసం 1800 102 1800కి కాల్ చేయండి | లేదా www.marutisuzukitruevalue.comని సందర్శించండి.
TRUE VALUE CERTIFIED
Visakhapatnam: Varun Motor - Siripuram: 9966739777, Pendurthi: 7799224440 Gajuwaka: 8886020044, Muralinagar: 9052267733 | Jayabheri Automotives Maddilapalem : 8008333557, Gopalapatnam :7780636899 | Srikakulam: Varun Motor : 8886521999 | Vizianagaram: Jayabheri Automotives : 8886662205 | Rajahmundry: SB Motor(Auto nagar) : 9885173738 | Varun Motors(Hukumpeta) : 8886616717 | Kakinada: SB Motor : 8886661920.

# రాష్ట్రంలో 3 మెగాసిటీలు

>> రద్దు చేయాలి. ఎలక్ట్రానిక్ పార్క్ ఏర్పాటుపై అధికారులు దృష్టి సారించాలి. భవిష్యత్తులో ఎలక్ట్రానిక్ రంగంలో విస్తృతమైన అవ కాశాలు ఉన్నాయి. చిప్, సెమీ కండక్టర్లు, డ్రోన్ వంటి పరిశ్రమలను ప్రోత్సహించాలి. రాష్ట్రంలో సుమారు 15 పారిశ్రామిక జోన్లను ఏర్పాటు చేసుకుని క్లస్టర్ వారీ విధానంతో పారిశ్రామికాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టే పరిశ్రమలకు రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం కూడా ప్రోత్సా హకాలు ఇస్తుంది. ఇలాంటి వాటిని గుర్తించి ప్రమోట్ చేయాలి. కేంద్రం ఇచ్చే ప్రోత్సాహకాలు కొంచెం ఆలస్యమైనా రాష్ట్ర ప్రభుత్వం వైపు ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలు ఇవ్వడం ద్వారా పెట్టుబడులు చేజారకుండా చూడాలి. ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సా హకాలపై సంప్రదింపులు జరుపుదాం. పారిశ్రామిక అవసరాల నిమిత్తం పరిశ్రమలకు విద్యుత్ సరఫరా విషయంలో ఇబ్బందులు లేకుండా చూసేందుకు కేంద్రం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. దీన్ని రాష్ట్ర ప్రభుత్వం సద్వినియోగం చేసుకోవాలి. కేంద్రంతో కలిసి పనిచేసే అంశాన్ని పరిశీలించాలి. ఇక ప్రభుత్వం కూడా పారిశ్రామిక అవసరాలను దృష్టిలో పెట్టుకుని ల్యాండ్ బ్యాంక్ సిద్ధం చేసు కోవాలి. అలాగే ఎవరైనా ప్రైవేట్ ల్యాండ్ ఓనర్లు తమ భూములను పరిశ్రమలకు, కంపెనీలకు ఇవ్వడానికి ముందుకు వస్తే.. అలాంటి వారిని ప్రోత్సహించాలి" అని ముఖ్యమంత్రి అన్నారు.

**మెగా సిటీలు... మాస్టర్ ప్లాన్లు:** రాష్ట్రంలో మూడు మెగా సిటీలు అభివృద్ధి చేయాలి. అనకాపల్లి నుంచి విజయనగరం వరకు విశాఖను మెగా సిటీగా అభివృద్ధి చేయాలి. అలాగే తిరుపతి, అమరావతి నగరాలను కూడా మెగా సిటీలు చేయాలి. ఇప్పటికే అమరావతికి మాస్టర్ ప్లాన్ ఉంది. విశాఖ, తిరుపతి మెగా సిటీలకు కూడా మాస్టర్ ప్లాన్ రూపొందించాలి. ఈ మెగా సిటీలను టూరిజం, ఐటీ సహా వివిధ పరిశ్రమలకు అనుకూలంగా ఉండేలా చూడాలి. ఈ మేరకు టూరిజం, ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖలు సమన్వయం చేసుకుని ఈ మెగా సిటీలు అభివృద్ధి జరిగేలా చూడాలి. అలాగే వీటికి టౌన్ షిప్స్ ఇంటిగ్రేషన్ జరగాలి, నివాసయోగ్యమైన నగరాలుగా తీర్చిదిద్దాలి. గూగుల్ డేటా సెంటర్ వల్ల విశాఖకు మరిన్ని కంపెనీలు, పరిశ్రమలు రానున్నాయి. భవిష్యత్తులో విశాఖకు వచ్చే కంపెనీలకు భూ లభ్యత ఉండేలా చూసుకోవాలి. టూరిజం అభివృద్ధికి ఆతిథ్య రంగాన్ని ప్రోత్సహించాలి. ప్రముఖ బ్రాండ్‌లకు చెందిన హోటళ్లు నిర్మించేలా చూడాలి. రాష్ట్రంలో మూడు ఎకనామిక్ కారిడార్లు ఏర్పాటు అవుతున్నాయి. దీనికి అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు చేసుకోవాల్సి ఉంది. ఈ మేరకు మూడు కారిడార్లకు ముగ్గురు సీనియర్ ఐఏఎస్ అధికారులను నియమిస్తాం. బీచ్ టూరిజాన్ని మరింతగా అభివృద్ధి చేయాలి" అని సీఎం చెప్పారు.

**పెట్టుబడుల సదస్సును ఘనంగా నిర్వహించాలి:** ఈ నెల, 14, 15వ తేదీల్లో విశాఖలో జరగనున్న పెట్టుబడుల సదస్సును ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. ప్రస్తుతం ఎస్ఐపిబి ఆమోదించిన పరిశ్రమల్లో వేగంగా శంకుస్థాపనలు జరిగేలా చూడాలని సీఎం ఆదేశించారు. తనతో పాటు డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ సహా వివిధ శాఖల మంత్రులు ఆయా జిల్లాల్లో పరిశ్రమలకు శంకుస్థాపనలు చేస్తామని తెలిపారు. ఆ దిశగా అధికారులు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇక ఇటీవల తాను జరిపిన విదేశీ పర్యటనల్లో వివిధ కంపెనీలకు చెందిన ప్రతినిధులను భాగస్వామ్య సదస్సుకు ఆహ్వానించానని.. వారు ఎపిలో పెట్టుబడులు పెట్టేందుకు సుముఖంగా ఉన్నారని.. అలాగే భాగస్వామ్య సదస్సుకు వచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారని వివరించారు.

విశాఖలో జరగబోయే పెట్టుబడుల సదస్సుకు భారీ ఎత్తున పెట్టుబడులు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయని ఈ సందర్భంగా అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ సమావేశంలో మంత్రులు నారా లోకేష్, అచ్చెన్నాయుడు, టిజి భరత్, నారాయణ, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, బిసి జనార్దన్ రెడ్డి, వాసం శెట్టి సుభాష్, సీఎస్ విజయానంద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. **12వ ఎస్ఐపిబి సమావేశంలో ఆమోదించిన పెట్టుబడుల వివరాలు:** రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్స్ లిమిటెడ్ రూ.202 కోట్లు, 436 మందికి ఉద్యోగాలు, ఎపిటోమ్ కాంపోనెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.700 కోట్లు, 1,000 మందికి ఉద్యోగాలు, ఎన్‌పిఎస్‌పిఎల్ అడ్వాన్స్ మెటీరియల్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.2,081 కోట్లు, 600 మందికి ఉద్యోగాలు, క్రయాన్ టెక్నాలజీ లిమిటెడ్ రూ.1,154 కోట్లు, 1500 మందికి ఉద్యోగాలు, ఎస్‌సిఐసి వెంచర్స్ ఎల్ఎల్పీ రూ.550కోట్లు, 1130 మందికి ఉద్యోగాలు, ఇండిచిప్ సెమీ కండెక్టర్స్ లిమిటెడ్ రూ.22,976 కోట్లు, 1241 మందికి ఉద్యోగాలు, ఫ్లూయింట్‌గ్రిడ్ లిమిటెడ్ రూ.150 కోట్లు, 2,000 మందికి ఉద్యోగాలు, మథర్సన్ టెక్నాలజీ సర్వీస్ లిమిటెడ్ రూ.110 కోట్లు, 700 మందికి ఉద్యోగాలు, క్వార్క్స్ టెక్నోసాఫ్ట్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.115 కోట్లు, 2000 మందికి ఉద్యోగాలు, కె.రహేజా కార్ప్ రియల్ ఎస్టేట్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.2,172 కోట్లు, 9,681 మందికి ఉద్యోగాలు, విశాఖ రియాల్టీ ప్రైవేట్ లిమిటెడ్ రూ.2,200 కోట్లు, 30వేల మందికి ఉద్యోగాలు, ఐ స్పేస్ సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.119కోట్లు, 2,000 మందికి ఉద్యోగాలు, ఎస్ఏఇఎల్ సోలార్ పీ12 ప్రైవేట్ లిమిటెడ్ రూ.1728 కోట్లు, 860 మందికి ఉద్యోగాలు, నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ లిమిటెడ్ రూ.7972 కోట్లు, 2,700 మందికి ఉద్యోగాలు, మైరా బే వ్యూ రిసార్ట్స్ రూ.157 కోట్లు, 980 మందికి ఉద్యోగాలు, విశ్వనాథ్ స్పోర్ట్స్ అండ్ కన్వెన్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.51 కోట్లు, 750 మందికి ఉద్యోగాలు, సుగ్నా స్పాంజ్ అండ్ పవర్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.1247 కోట్లు, 1,100 మందికి ఉద్యోగాలు, సూపర్ స్మెల్టర్స్ లిమిటెడ్ రూ.8570 కోట్లు, 1000 మందికి ఉద్యోగాలు, వాల్టన్ ల్యాట్స్ ప్రైవేట్‌లిమిటెడ్ రూ.1682 కోట్లు, 415 మందికి ఉద్యోగాలు, ఏఎమ్‌జీ మెటల్స్ అండ్‌మెటీరియల్స్ లిమిటెడ్ రూ.44,000 కోట్లు, 3000మందికి ఉద్యోగాలు, వాసంగ్ ఎంటర్ ప్రైస్ రూ.898 కోట్లు, 17,645 మందికి ఉద్యోగాలు, బిర్లాను లిమిటెడ్ రూ.240 కోట్లు, 588 మందికి ఉద్యోగాలు. సిగాచీ ఇండస్ట్రీస్ లిమిటెడ్ రూ.1,090కోట్లు, 1250 మందికి ఉద్యోగాలు, భారత్ డైనమిక్స్ రూ.489 కోట్లు, 500 మందికి ఉద్యోగాలు, డాజ్కో ప్రైవేట్ లిమిటెడ్ రూ.1234 కోట్లు, 1454 మందికి ఉద్యోగాలు, శ్రీవేదా ఇన్నోవేషన్ పార్క్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.12 కోట్లు, 1500 మందికి ఉద్యోగాలు కల్పించనున్నాయి.


శుక్రవారం సీఎం చంద్రబాబుతో సమావేశమైన మహిళా క్రికెటర్లు మిథాలీ రాజ్, శ్రీచరణి, మంత్రి లోకేష్

# మహిళా క్రికెటర్ శ్రీచరణికి రూ.2.5 కోట్ల ప్రోత్సాహకం


## ఇంటి నిర్మాణం కోసం వెయ్యి చ.గ స్థలం

## గ్రూప్-1 ఉద్యోగం ఇవ్వాలని సిఎం నిర్ణయం

**విజయవాడ,నవంబరు 7, ప్రభాతవార్తప్రతినిధి:** మహిళా క్రికెట్ వరల్డ్ కప్ విజేత, టీమిండియా సభ్యురాలైన తెలుగమ్మాయి శ్రీ చరణికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భారీ నజరానా ప్రకటించారు. శ్రీ చరణికి రూ.2.5 కోట్ల నగదు బహుమతి ఇవ్వాలని సీఎం నిర్ణయించారు. దీంతో పాటు ఇల్లు నిర్మించుకునేందుకు కడపలో 1000 చ.గ. స్థలం కేటాయిస్తున్నట్టు తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వంలో గ్రూప్ 1 అధికారిగా ఉద్యోగం కూడా కల్పిస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. శుక్రవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును, మంత్రి నారా లోకేష్‌ను క్రికెటర్ శ్రీచరణి మర్యాద పూర్వకంగా కలిశారు. ఉమెన్ వరల్డ్‌కప్ గెలుచుకున్న ఆనందక్షణాలను సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌తో శ్రీ చరణి పంచు కున్నారు. తనకు మద్దతుగా నిలిచినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య మంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ శ్రీ చరణిని అభినందించారు. ఉమెన్ వరల్డ్ కప్ గెలుచుకో వడం ద్వారా భారత దేశ మహిళల సత్తాచాటారని, మహిళా క్రీడాకారులకు ఆదర్శంగా నిలిచారని సీఎం అన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు భారత జట్టుకు అందించాలని అభిలషించారు. ఈ సందర్భంగా శ్రీ చరణి మహిళా క్రికెటర్లు సంతకాలు చేసిన టీ షర్ట్ ను ముఖ్యమంత్రికి అందించారు. దానిని ఆప్యాయంగా స్వీకరించిన ముఖ్యమంత్రి శ్రీచరణి బృందం భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఆమెకు వీణ బొమ్మను జ్ఞాపికగా అందజేసారు. శ్రీ చరణితో పాటు ముఖ్యమంత్రిని కలిసిన వారిలో మహిళా క్రికెట్ జట్టుమాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ కూడా ఉన్నారు. అంతకుముందు గన్నవరం ఎయిర్‌పోర్టులో శ్రీ చరణికి ఘనస్వాగతం పలికిన మంత్రులు అనిత, సవిత, సంధ్యారాణి, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కేశినేని చిన్ని, కార్యదర్శి సానా సతీష్, శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు ఆమెతో పాటు సీఎం క్యాంప్ కార్యాలయానికి వచ్చారు. క్యాంపు కార్యాలయంలో మంత్రి నారా లోకేష్ శ్రీచరణికి స్వాగతం పలికారు.

# ప్రజలకు స్వచ్ఛమైన మంచినీటి సరఫరా

>> ప్రారంభించేందుకు సిద్ధంగా ఉండాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. డీసీఎం పవన్ కల్యాణ్ తన క్యాంపు కార్యాలయంలో పల్లె పండగ 2.0, అడవి తల్లి బాట పనుల పురోగతి, జల్ జీవన్ మిషన్, స్వమిత్వ పథకాలపై పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ, గ్రామీణ నీటి పారుదల శాఖ, ఇంజినీరింగ్ విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నిధులు అందుబాటులో ఉన్నా పనుల్లో ఆశించిన స్థాయిలో పురోగతి లేకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. అటవి తల్లిబాట, జల్ జీవన్ మిషన్ పనులు వేగవంతంగా పూర్తి చేసేలా తక్షణం ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ప్రతి పనిని నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేసేలా ఈ ప్రణాళికలు ఉండాలన్నారు. ఈ మేరకు యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సాస్కి నిధులకు అనుమతుల స్టేటస్ గురించి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులను ఉప ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ఈ అంశంపై తక్షణం ఆర్థిక శాఖతో చర్చించాలని పవన్ ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకొని, రహదారులను మెరుగుపరచుకునేలా ఈ టెక్నాలజీ ఉండాలి. ఈ విధంగా జియో రూరల్ రోడ్ మేనేజ్మెంట్ సిస్టంను త్వరితగతిన అభివృద్ధి చేయండి. అధునాతన సాంకేతికత సాయంతో అటువంటి వ్యవస్థకు రూపకల్పన చేయండి. 48 గంటల్లో దీనికి సంబంధించి ఒక స్పష్టమైన యాక్షన్ ప్లాన్ సిద్ధం కావాలి. ఒక వర్కింగ్ గ్రూప్ రూపొందించి ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందులో పొందుపరచాలి. ఈ అంశంలో ఆర్టీజీఎస్, ఇంజినీరింగ్ విభాగం అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్లాలి. అడవి తల్లి బాటను పైలెట్ ప్రాజెక్ట్ గా ఎంచుకుని ఈ వ్యవస్థకు అనుసంధానించండి. తద్వారా ఎప్పటికప్పుడు గిరిజన గ్రామాల్లో జరుగుతున్న పనుల పరోగతిని పరిశీలించే అవకాశం ఉంటుంది. ఏ పని చేసినా ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలి అన్నదే ప్రభుత్వ ఉద్దేశం" అని పవన్ కల్యాణ్ అన్నారు. గిరిజన గ్రామాల్లో చేపట్టిన అడవి తల్లిబాట పనుల్లో ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించడం లేదని పవన్ కల్యాణ్ అన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉంటుందని, పక్కా ప్రణాళికతో అన్నింటినీ అధిగమించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి పీఎం జన్మన్ పథకం కింద వచ్చే నిధులతోపాటు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు, రాష్ట్ర ప్రభుత్వం సాయం మొత్తం కలిపి 1,158 కోట్ల రూపాయలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. మొత్తం 761 గిరిజన గ్రామాలను అనుసంధానిస్తూ 662 రహదారులు నిర్మించాలన్న సంకల్పంతో పనులు ప్రారంభించామని తెలిపారు. అడవి తల్లిబాట పనులను వేగవంతం చేయాలని, ఎక్కడైనా అటవీ శాఖతోగాని, ఇంకా ఏదైనా సమస్యలు ఉంటే వాటిని తక్షణం పరిష్కరించుకునేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయికి వెళ్లి పనుల పురోగతిని పరిశీలించాలన్నారు. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు జిల్లా, మన్యం జిల్లాల కలెక్టర్లు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ ఏదైనా సమస్య ఉంటే దాన్ని తక్షణం పరిష్కరించి పనులు ముందుకు తీసుకువెళ్లేలా చర్యలు తీసుకోవాలని పవన్ సూచించారు. పల్లె పండగ పల్లె పండగ 2.0 కోసం సాస్కీ నిధులు వినియోగించుకోవడంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఆర్థిక శాఖతో సమన్వయం చేసుకుంటూ త్వరితగతిన నిధులు విడుదలయ్యేలా కృషి చేయాలని పవన్ అన్నారు. రూ.2,123 కోట్ల సాస్కీ నిధులతో పల్లెల్లో 4007 కిలోమీటర్ల మేర రహదారులు, గోకులాలు, మ్యాజిక్ డ్రైన్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి, కమిషనర్లు ఈ ప్రక్రియను పర్యవేక్షించాలని అన్నారు. సమీక్షా సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి శ్రీ శశిభూషణ్ కుమార్, కమిషనర్ శ్రీ కృష్ణ తేజ, సర్వే విభాగం కార్యదర్శి శ్రీ కూర్మనాథ్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన చీఫ్ ఇంజినీర్ శ్రీ బాలూ నాయక్, శ్రీమతి గాయత్రి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


శుక్రవారం అమరావతిలో ఎన్‌బిఎఫ్‌ఐడి కార్యక్రమంలో బ్యాంక్ ప్రతినిధులతో సిఎం చంద్రబాబు, మంత్రి నారాయణ

# బనకచర్లపై ఎపి వెనక్కి

## డిపిఆర్ టెండర్లు రద్దు: పోలవరం అథారిటీ సమావేశంలో వెల్లడి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,నవంబర్7:** బనకచర్లపై ఆంధ్రప్రదేశ్ వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు లింక్ ప్రాజెక్టు నిర్మాణానికి డిపిఆర్ కోసం చేపట్టిన టెండర్ల ప్రక్రియను రద్దు చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన పోలవరం అథారిటీ సమావేశంలో ఈ అంశాన్ని వెల్లడించింది. అంతరాష్ట్ర నదీ జలాల ఒప్పందాలకు విరుద్ధంగా ఏపీ ఈ ప్రాజెక్టును చేపడుతోందని తెలంగాణ రాష్ట్రం మొదటి నుంచి వ్యతిరేకిస్తూ వచ్చింది. దీనిపై కేంద్రానికి, సిడబ్ల్యుసికి ఫిర్యాదు చేసింది. న్యాయ పోరాటానికి సిద్ధమైంది. దీంతో ఏపీ ఈ ప్రకటన చేసినట్లు సమాచారం. ఫలితంగా పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు ఇప్పట్లో లేనట్లేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ ప్రాజెక్టుపై ఇరు రాష్ట్రాలకు ఎలాంటి వివాదం లేకుండా మరో ప్రణాళికతో కూడా ఏపీ ముందుకు వచ్చే అవకాశాలు ఉన్నట్లు చెబుతున్నారు.

### వారం - వర్జ్యం

08-11-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరదృతువు, కృష్ణపక్షం
తదియ ఉ.7.33, చవితి తె.4.26
మృగశిర రా.10.06, విశాఖ కార్తె
వర్జ్యం : తె.5.50-7.18
దు.ఉ.6.09-7.43
శుభసమయం : ఉ.10.45-11.15
రాహుకాలం - ఉ.9.00-10.30

### వార్తాఫలం

**మేషం :** ఆప్తులనుండి ధన, వస్తు లాభాలు పొందుతారు. ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. ఆర్థికపరిస్థితి అనుకూలం.

**వృషభం :** కుటుంబ సమస్యలు కొంత వరకు తీరతాయి. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం. ఆర్థికపరిస్థితి అనుకూలంగా వుంటుంది.

**మిథునం:** బంధువులతో వ్యక్తిగత విషయాలపై సంప్రదిస్తారు. పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి.

**కర్కాటకం :** భూ వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. గృహ నిర్మాణ యత్నాలు సాగిస్తారు. కుటుంబసభ్యులతో కలిసి ఆనందంగా గడుపుతారు.

**సింహం:** ఓర్పుతో నేర్పుతో ముందుకు సాగుతాయి. వృత్తి వ్యాపారాలలో లాభాలు పొందుతారు. పెట్టుబడులకు అనుకూలం.

**కన్య :** నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ఆర్థికపరిస్థితి అంతంతమాత్రంగా వుంటుంది.

**తుల :** ఆస్తి విషయాలలో నూతన ఒప్పందాలు కుదుర్చుకుంటారు. వివాదాలకు దూరంగా వుండండి. ఋణబాధల నుండి విముక్తి పొందుతారు.

**వృశ్చికం:** ముఖ్యమైన కార్యక్రమాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. నూతన సంస్థలనుండి ఉద్యోగావకాశాలు కలిసి వస్తాయి.

**ధనుస్సు:** సన్నిహితులకు మాట సహాయం అందిస్తారు. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం. ఆరోగ్యంపట్ల మెలుకువ అవసరం.

**మకరం:** సంఘసేవా సంస్థలకు డబ్బు రూపేణా మీ వంతు సహాయాన్ని అందిస్తారు. భాగస్వామ్య వ్యాపారాలు లాభిస్తాయి. వాహనసౌకర్యం కలదు.

**కుంభం:** భూమి, ఇళ్ల కొనుగోలు యత్నాలు సాగిస్తారు. భాగస్వామ్య వ్యాపారాలు లాభిస్తాయి. ఆర్థిక పరమైన లావాదేవీలు అనుకూలంగా ఉంటాయి.

**మీనం :** నూతన కార్యక్రమాలను ప్రారంభించాలో నిర్ణయించుకోవడం కష్టతరమవుతుంది. వివాదాలకు దూరంగా వుండండి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఆరాధన మంత్రం 'వందేమాతరం'

>> మాతరం స్మారక స్టాంపు, నాణెం విడుదలచేసామని, ప్రతి గీతానికి ఒక మూలభావం, సందేశం ఉంటుందని అన్నారు. మన వందేమాతరం మూలభావం భారత్, తల్లి భారతి అని అన్నారు. ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్‌స్టేడియంలో వందేమాతరం 150వ సంస్మరణ దినోత్సవంలో పాల్గొని మాట్లాడిన మోడీ స్వాతంత్ర్య ఉద్యమంలో కోట్లాదిమంది భారతీయుల్లో స్ఫూర్తినింపిందని గుర్తుచేసారు. 150 ఏళ్ల పూర్తయిన సందర్భంగా ఏడాది పొడవునా కార్యక్రమాలునిర్వహించాలని కేంద్రం నిర్ణయించింది. వందేమాతరం గీతం 1875 నవంబరు ఏడోతేదీ బంకింగ్ చంద్ర ఛటర్జీ రచించారు. ఈ గీతం తొలిసారిగా ఛటర్జీ రాసిన ఆనంద్‌మఠ్ నవలలో ప్రచురించారు. అప్పటినుంచి జాతీయ గీతంగా ఆలాపనలోకి వచ్చింది. **వందేమాతరం చరణాలు తొలగించేసారు!** వందేమాతరం జాతీయ గీతానికి 150 యేళ్లు నిండాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సం స్మరణ ఉత్సవంలో ప్రధాని మోడీ పాల్గొన్నారు. ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో మోడీ మాట్లాడుతూ వందే మాతరం గీతంలోని కొన్ని ముఖ్యమైన చరణాలను 1937లో తొలగించినట్లు ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీని టార్గెట్ చేస్తూమోడీ ఆ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. విభజనకు చెందిన కొన్ని చరణాలను ఆ గేయంనుంచి తొలగించారని, ఇప్పటికీ లాంటి విభజన మైండ్‌సెట్ దేశానికి సవాల్‌గా మారిందని ప్రధాని మోడీ అన్నారు. ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో వందేమాతరం 150ఏళ్లకుచెందిన సంస్మరణ స్టాంపు, నాణాన్ని ప్రధాని రిలీజ్ చేశారు.

# ఎపిలో మైక్రోసాఫ్ట్ భారీ క్వాంటమ్ కంప్యూటర్

## రూ.1,772 కోట్ల పెట్టుబడి ప్రతిపాదన

## విట్‌వర్సిటీలో క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి

**విజయవాడ,నవంబరు 7,పభాతవార్త ప్రతినిధి:** ఏపీలో మైక్రోసాఫ్ట్ భారీ క్వాంటమ్ కంప్యూటర్ అందుబాటులోకి రానున్నది. ఈ కంప్యూటింగ్ వ్యవస్థ ఏర్పాటుకు ఐటీ దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్...రాష్ట్రంలో రూ.1,772.08 కోట్ల విలువైన పెట్టుబడులు పెట్టేందుకు ప్రతిపాదించింది. ఇందులో భాగంగా అమరావతి క్వాంటమ్ వ్యాలీలో 1,200 క్యూబిక్ సామర్థ్యమున్న (50 లాజికల్ క్యూబిక్స్) భారీ క్వాంటమ్ కంప్యూటర్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు ఆ సంస్థ ప్రతినిధులతో అధికారులు జరిపిన సంప్రదింపులు ఫలవంతం కానున్నాయి. మైక్రోసాఫ్ట్ కోసం క్వాంటమ్ వ్యాలీలో 4వేల చదరపు అడుగుల .విస్తీర్ణంలో భవనాన్ని నిర్మించాల్సి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. అమరావతిలో 133 క్యూబిక్ సామర్థ్యంతో ఐబీఎం సంస్థ క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటుకు ఇప్పటికే ప్రభుత్వంతో ఒప్పందాన్ని కుదుర్చుకుంది. క్వాంటమ్ వ్యాలీలో పెట్టుబడులు పెట్టేందుకు మరిన్న సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. జపాన్‌కు చెందిన పుజిసు 64 క్యూబిక్ క్వాంటమ్ కంప్యూటర్‌ను ఏర్పాటు చేయడంతో పాటు కేంద్ర ప్రభుత్వం....రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఇనీషియేటివ్ కింద అందించే నిధులకు మరో 50 శాతం వెచ్చించి ఫ్యాబ్రికేషన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదించింది. క్వాంటమ్ వ్యాలీలో పరిశోధనలు నిర్వహించే సంస్థలకు దశల వారీగా 90 లక్షల చదరపు అడుగుల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం నిర్మించనున్న ఐకానిక్ టవర్ వల్ల 40 వేల చదరపు అడుగులు అందుబాటులోకి వస్తాయి. టవర్ నమూనాను ఎల్‌అండ్‌టీ సంస్థ రూపొందించింది. రాష్ట్రాన్ని క్వాంటమ్ కంప్యూటింగ్, డీప్ టెక్నాలజీ, ఇన్నోవేషన్ కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇప్పటికే 50 ఎకరాలను "క్వాంటమ్ వ్యాలీ" కోసం సీఆర్డీఏ కేటాయించింది. ఈ క్వాంటమ్ వ్యాలీలో దేశీయ, అంతర్జాతీయ యూనివర్సిటీలు, స్టార్టప్‌లు, పరిశోధనా సంస్థలు, ఇండస్ట్రీలు అందరికీ అత్యాధునిక కంప్యూటింగ్ సేవలను అందించనుంది. దీనిని పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా అమరావతి క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ (ఏక్యూసీసీ) అనే ప్రభుత్వ సంస్థను ఏర్పాటు చేశారు. ఇప్పటికే బోర్డు నిర్ణయాల ప్రకారం వివిధ కంపెనీల నుంచి ఆసక్తి వ్యక్తీకరణ పత్రాలు (ఇవోఐ) ఆహ్వానించారు. ఇక అమరావతిలోని విట్ యూనివర్సిటీలో కూడా క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. బెంగళూరుకు చెందిన క్యూపై ఏఐ సంస్థ అభివృద్ధి చేసిన చిన్న క్వాంటమ్ కంప్యూటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. దాని కోసం అయ్యే సుమారు రూ.6 కోట్ల ఖర్చును విట్ స్వయంగా భరిస్తుంది. ఈ ప్రాజెక్టుకు అద్దె లేదా వినియోగ ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని ప్రభుత్వం పేర్కొంది. రాష్ట్రాన్ని డీప్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి భవిష్యత్ రంగాల్లో ఆవిష్కరణల కేంద్రంగా నిలబెట్టడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. ఈ క్రమంలో అమరావతి క్వాంటమ్ వ్యాలీ ప్రాజెక్టు కీలక మలుపు కానుంది. క్వాంటమ్ వ్యాలీ ద్వారా సైంటిఫిక్ రీసెర్చ్‌కు కొత్త అవకాశాలు, స్టార్టప్‌లకు ఆధునిక టెక్నాలజీ యాక్సెస్, పరిశ్రమలకు పోటీ శక్తికి పెంపొందించడంతో పాటు, ప్రపంచ టెక్నాలజీ మ్యాప్‌లో అమరావతి ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది.

# వి.కావేరి ట్రావెల్స్ యజమాని అరెస్టు

>> మండలం చెట్ల మల్లాపురం గ్రామం వద్ద 44వ జాతీయ రహదారిపై చోటుచేసుకున్న వి.కావేరిట్రావెల్స్ బస్సు ప్రమాదంలో 19మంది మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై బస్సు డ్రైవర్ మరియు యజమాని మీద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు, విచారణలో భాగంగా మొదటినిందితుడు మిరియాల లక్ష్మయ్యను అక్టోబర్ 28న అరెస్ట్ చేశారు. విచారణాధికారి పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య నేతృత్వంలో దర్యాప్తు కొన సాగగా, ఈ కేసులో రెండవ ముద్దాయి అయిన వి కావేరి ట్రావెల్స్ బస్సు యజమాని వేమూరి వినోద్ కుమార్‌ను శుక్రవారం ఉదయం 7.30 గం.లకు పోలీసులు అరెస్ట్‌చేశారు. దర్యాప్తు కొనసాగుతన్నదని, మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించనున్నట్లు కర్నూలు పోలీసులు పేర్కొన్నారు.



శుక్రవారం వెలుగొండ ప్రాజెక్టు పనులను పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

# వెలుగొండ ఆయకట్టుకు 2026 కల్లా నీరు

## యుద్ధ ప్రాతిపదికన ప్రాజెక్టు పనులు

## నిపుణులతో కలిసి పనులు పరిశీలించిన మంత్రి నిమ్మల

**పెద్దదోర్నాల, ప్రభాతవార్త:** వెలిగొండ ప్రాజెక్టు పనులు వచ్చే సంవత్సరానికి పూర్తి చేసి ఆయకట్టు రైతాంగానికి పూర్తి స్థాయిలో నీరు అందిస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. ఇటీవల మొంథా తుఫాన్ కారణంగా దెబ్బతిన్న వెలిగొండ ఫీడర్ కెనాల్‌ను ఇరిగేషన్ నిపుణుల బృందంతో, మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబుతో కలిసి శుక్రవారం ఆయన వెలుగొండ ప్రాజెక్టు పరిశీలించారు. మొంథా తుఫాన్ వర్షాలకు వెలుగొండ ఫీడర్ కెనాల్ 850 మీటర్ వద్ద, వంద అడుగుల పొడవున 30 అడుగుల లోతులో పడిన గండిని చూశారు. జంట సొరంగాలలోకి 9కి.మీ చొచ్చుకు వచ్చిన నీటిని తొలగించే పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో కూడా వచ్చే వరదలను దృష్టిలో పెట్టుకుని ఫీడర్ కెనాల్ సీసీ వాల్ లైనింగ్ నిర్మాణంలో డిజైన్స్ అప్రూవల్ చేయమని సూచించారు. ఈ సందర్భంగా వెలిగొండ క్యాంప్ ఆఫీసర్‌లో ప్రాజెక్టు పెండింగ్ పనులపై అధికారులు, ఏజెన్సీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 30 ఏళ్ల కిందట తన భూమి పూజ చేసిన ఈ ప్రాజెక్టు ఇప్పటికీ పూర్తవ్వకపోవడంపై తీవ్ర ఆవేదన చెందినట్లు రామానాయుడు చెప్పారు.


**నివాస్ హౌసింగ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్**
(పూర్వపు) ఇండోస్టార్ హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌గా తెలిసినది, NHFPLగా ఇటుపై రిఫర్ చేయబడును)
నమోదిత కార్యాలయం : యూనిట్ నెం.305, 3వ అంతస్తు, వింగ్ 2/E, కార్పొరేట్ ఎవెన్యూ, అంధేరీ ఘట్‌కోపర్ లింక్ రోడ్, చాకల, అంధేరీ (ఈస్ట్), ముంబై-400093
ఇ-మెయిల్: -connect@niwashfc.com CIN నంబర్: U65990MH2016PTC271587 సంప్రదించు నం.: కాగిత కిషోర్-9966111777
NIWAS HOUSING FINANCE

**[అనుబంధం-IV-A] స్థిరాస్తుల యొక్క అమ్మకానికి విక్రయ ప్రకటన [8(6) నిబంధనకు ఏర్పాటు చూడండి]**

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ చట్టం 2002 సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002 యొక్క నిబంధన 8(6)కు ఏర్పాటుతో చదువబడే దాని క్రింద స్థిరాస్తుల యొక్క అమ్మకానికి ఇ-వేలం విక్రయ ప్రకటన. సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ చట్టం 2002 క్రింద NHFPL అధీకృత అధికారిచే రుణగ్రహీత(లు) నుండి రుణబకాయి మొత్తం వసూలు కొరకు ఇక్కడ క్రింద పేర్కొనబడిన సెక్యూర్డ్ ఆస్తిని స్వాధీనంలోకి తీసుకొనుట విషయమై సాధారణ ప్రజానీకానికి మరియు ప్రత్యేకంగా రుణగ్రహీత(లు)కు ఇందుమూలముగా ప్రకటన జారీచేయడమైనది. దిగువ సంతకందారునిచే క్రింద ఇక్కడ వివరింపబడిన విధంగా స్థిరాస్తి కొనుగోలు నిమిత్తం మా సేల్స్ & మార్కెటింగ్ మరియు ఇ-వేలం సర్వీస్ భాగస్వామి Credresolution ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అనగా Credauction.com యొక్క వెబ్ పోర్టల్ పైన ఆన్లైన్ దాఖలుకు ఆఫర్లు కోరబడుతున్నవి.
సెక్యూర్డ్ ఆస్తులు తిరిగి పొందడానికి సమయ లభ్యతకు సంబంధించి చట్టం యొక్క 13 సెక్షన్ యొక్క ఉప-సెక్షన్ (8) యొక్క ఏర్పాటు విషయం రుణగ్రహీత దృష్టికి తీసుకురావడమైనది. 'ఏది ఎక్కడ ఉన్నదీ అక్కడ అలా', ప్రాతిపదికన ఏది ఎలా ఉన్నదీ అలా ప్రతిపాదికన అక్కడ ఉన్నది అలా' ప్రాతిపదికన, సహాయంపై ఆధారపడకుండా ప్రాతిపదికన సదరు ఆస్తి భౌతికంగా స్వాధీనం చేసుకోబడింది. దాని వివరాలు ఇక్కడ క్రింద పేర్కొనబడిన విధంగా.

| రుణగ్రహీత(లు) వివరాలు | డిమాండ్ నోటీసు 13(2) యొక్క మొత్తం మరియు తేదీ | రిజర్వ్ ధర బయానా బిడ్ పెంపు మొత్తం | ఇ-వేలం తేదీ & సమయం |
|---|---|---|---|
| LNKKNLAP-04190009985 బ్రాంచి : కాకినాడ రుణగ్రహీత- శ్రీనివాసు ఎం. సహ-రుణగ్రహీత(లు): సూర్య అపర్ణ సుందరి మాదుగుల | 26/04/2022 రూ.7,72,418/- (రూపాయలు ఏడు లక్షల డెభై రెండు వేల నాలుగు వందల పద్దెనిమిది మాత్రమే) 27/01/2022 నాటికి తిరిగి చెల్లింపు వేరకు ఆపై తదుపరి వడ్డీ మరియు వార్జీలతోసహా | రూ.6,45,000/- రూ.64,500/- రూ.10,000/- | 26.11.2025 సమయం: ఉ.10.30 నుండి మ.12.30 గం.కు 5 నిమిషాల యొక్క అపరిమిత పొడిగింపుతో |

**ఆస్తి కలిగి ఉన్నది:** ఇ.నం.1-34, ఎస్.నం.85/6, గొరింట గ్రామం మరియు గ్రామ పంచాయతీ, పెద్దాపురం మండలం, తూర్పుగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్, ఇండియా 533433, నాలుగు సరిహద్దులు: **ఉత్తరం:** 33 అ' మెయిన్ రోడ్, **దక్షిణం:** 33 అ' ఐక్కాల రాములు యొక్క ఖాళీ స్థలం, **తూర్పు:** 66 అ' మలిరెడ్డి సూకరాజు యొక్క గోడ, **పడమర:** 66 అ' పచ్చిపాల అన్నవరం యొక్క ఇల్లు.

**ఇ-వేలం యొక్క నియమాలు మరియు నిబంధనలు :**
1. విక్రయం యొక్క సవివరమైన నియమాలు మరియు నిబంధనలకు దయచేసి www.niwashfc.com పై ఏర్పాటు చేయబడిన లింక్‌కు రిఫర్ చేయండి మరియు మా సేల్స్ & మార్కెటింగ్ మరియు ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్, Credauction.com యొక్క వెబ్‌సైట్‌కు.
2. మా పోర్టల్స్ https://www.niwashfc.com/Auction-Notices లింక్ క్రింద అవస్నీ ప్రచురింపబడినవి.
3. కాబోరు బిడ్డర్లు ఇ-వేలానికి సంబంధించి ఏ విచారణకైనా, ఆస్తి యొక్క సమాచారం & తనిఖీకి, సపోర్ట్, విధానం మరియు ఆన్‌లైన్ శిక్షణకు మా సేల్స్ & మార్కెటింగ్ విభాగం మరియు ఇ-వేలం సర్వీస్ భాగస్వామి యొక్క క్లైంట్ సర్వీస్ డెలివరీ (CSD) విభాగాన్ని సంప్రదించవచ్చును.
**Credresolution ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ టెలి. నం.: +91 9137100020 & 9819167197 మరియు ఇ-మెయిల్ ID: balram@credsolv.com లేదా amit@credsolv.com NHFPL యొక్క అధీకృత అధికారి కాగిత కిషోర్- 9966111777 ద్వారా.**
* గమనిక :- NHFPL విక్రయ ప్రకటనను రుణగ్రహీత(లు) అందరికీ స్పీడ్/రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా జారీ చేస్తున్నారని దయచేసి గమనించ కోరుతున్నాము. ఎవరైనా పార్టీలకు అవి అందని పక్షంలో ఈ విక్రయ ప్రకటన యొక్క ప్రచురణ సర్వీస్ యొక్క పద్ధతికి ప్రత్యామ్నాయంగా పరిగణించబడుతుందని ఇందుమూలముగా ప్రకటించడమైనది.

ప్రదేశం : తూర్పుగోదావరి, ఆంధ్రప్రదేశ్
తేదీ : 08.11.2025
సం/ అధీకృత అధికారి
నివాస్ హౌసింగ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ తరపున

# అమరావతి వెంకటపాళెంలో శ్రీవారి ఆలయం విస్తరణ


తిరుమలలో డయల్ యువర్ ఇఒ కార్యక్రమం

**- ఆలయ ప్రాకారం, కల్యాణోత్సవమండపం, రాజగోపురం పనులు**
**- డిసెంబర్ 30నుండి పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలు - టిటిడి ఇఒ ఎకెసింఘాల్**

**తిరుమల,నవంబర్ 7ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి వెంకటపాళెంలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం విస్తరణ పనులు చేపడుతున్నట్లు టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్ వెల్లడించారు. ఆలయంలో ఆలయ ప్రాకారం, కల్యాణోత్సవమండపం, రాజగోపురం తదితర అభివృద్ధి పనులు ఈనెల 27వతేదీ నుండి ప్రారంభవుతాయన్నారు. భక్తుల సూచనల మేరకు శ్రీవారి దర్శనాలకు సంబంధించి శ్రీవాణి,ఇతర దర్శన టోకెన్లు జారీచేసే విధానంపై పరిశీలించి నివేదిక సమర్పించేందుకు టిటిడి ధర్మకర్తలమండలి ఒక కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. డిసెంబర్ 30వతేదీ నుండి 2026 జనవరి 8వతేదీ వరకు పది రోజులు వైకుంఠద్వార దర్శనాలు కల్పిస్తున్నామని, టిక్కెట్లు, టోకెన్ల జారీ విధానం త్వరలోనే ప్రకటిస్తామన్నారు. శుక్రవారం తిరుమల అన్నమయ్యభవనంలో జరిగిన "డయల్ యువర్ ఇఒ"కార్యక్రమం అనంతరం మీడియాతో భక్తులు సూచనలు, సలహాలు, ఇంకా చేపట్టే పలు అంశాలపై వివరించారు. ప్రతినెలా ఆన్‌లైన్‌లో విడుదల చేసే ఆర్జితసేవలు, ప్రత్యేక ప్రవేశ దర్శనాలు, దివ్యాంగులు,వృద్ధుల దర్శనాల టిక్కెట్లు బుక్‌చేసుకోవడంలో ఇబ్బందులను అధిగమించి ఒక స్పష్టమైన విధానం అమలుచేయనున్నామని ఇఒ సింఘాల్ తెలిపారు. ఇక అంగప్రదక్షణకు సంబంధించి ఆన్‌లైన్ లక్కీడిప్‌లో జారీచేసే టోకెన్లను ఇకనుండి ముందువచ్చిన వారికి ముందన్నట్లు ఆన్‌లైన్‌లో ఫిబ్రవరి నెలకోటా కేటాయించేలా చర్యలు తీసుకున్నామన్నారు. భక్తుల సౌకర్యార్థం తిరుమలలో ఏటిసి(ఆళ్వార్ ట్యాంక్ విశ్రాంతి భవనం)నుండి గోగర్భమ్ డ్యామ్ కూడలి వరకు శాశ్వత షెల్టర్లు, క్యూలైన్లు, స్టీల్ ఫుట్‌వేర్‌బ్రిడ్జిలు, మరుగుదోడ్లు నిర్మించేందుకు నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాల్లో 750 కోట్ల రూపాయలతో శ్రీవాణి ట్రస్ట్ నిధులతో ఐదువేల భజనమందిరాలు నిర్మాణం చేపడతామన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న టిటిడి ఆలయాల్లో భక్తుల రద్దీకి తగ్గట్లు అన్నప్రసాదాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఇఒ చెప్పారు. ఇక ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనాలకు సంబంధించి దళారులను నమ్మి మోసపోవద్దని, భక్తులు ఆన్‌లైన ద్వారానే దర్శన టిక్కెట్లు పొందాలని ఇఒ విజ్ఞప్తి చేశారు. పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో టోకెన్ల జారీవిధివిధానాలు త్వరలోనే తెలియజేస్తామని ఆయన వివరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నిర్ణయం తీసుకుని పాదర్శకంగా టోకెన్ల కేటాయించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఇఒ వీరబ్రహ్మం, సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, విఎస్ఒలు ఎస్టీవి రామ్‌కుమార్, సురేంద్ర, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఎస్వీబిసి సిఇఒ ఫణికుమార్‌నాయుడు ,పిఆర్ఒ నీలిమ పాల్గొన్నారు.



## భారతదేశ ప్రేమ, ఐక్యతకు ప్రతీక 'వందేమాతరం'

**తిరుపతి,నవంబర్ 7ప్రభాతవార్తప్రతినిధి:** 1875లో రచించిన వందేమాతరం గేయం భారతదేశ ప్రేమ, ఐక్యతకు, భక్తి భావానికి చిరస్మరణీయ ప్రతీకగా నిలిచిందని పలువురు వక్తలు కొనియాడారు. భారతీయ సంప్రదాయం,చేనేతను ప్రోత్సహించాలనే సంకల్పంతో కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, ఆచార్యులు, హ్యాండ్లూమ్ చీరలు ధరించారు. చేనేత వస్త్రాలను ధరించాలనే సామూహిక ప్రతిజ్ఞ చేశారు. వందేమాతరం 150వ వార్షికోత్సవాన్ని ఘనంగా శుక్రవారం పద్మావతి మహిళ వర్సిటీ ఇందిరాప్రియదర్శిని ఆడిటోరియంలో పండుగవాతావరణంలా నిర్వహించారు. పద్మావతి వర్సిటీ ఉపకులపతి ఆచార్య వెన్నం ఉమ, రిజిస్ట్రార్ ఆచార్య రజని, వివిధ విభాగాల డీన్లు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## వందేమాతరం స్ఫూర్తిని భావి తరాలకు అందించే బాధ్యత మనదే: డిసిఎం పవన్



**విజయవాడ,నవంబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** మన దేశ స్వాతంత్ర్య పోరాటంలో కశ్మీరు నుంచి కన్యాకుమారి వరకూ రణ నినాదంలా నిలిచింది వందేమాతరం అని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు.శ్రీ బంకిమ్ చంద్ర ఛటర్జీ గారు రాసిన ఈ గేయం యావత్ దేశాన్ని ఉద్యమ స్ఫూర్తితో నడిపించింది. స్వతంత్ర సమరయోధులకు మనో బలాన్ని ఇచ్చింది. బ్రిటిషర్లను వందేమాతరం అనే మాటే భయపెట్టింది. భారతీయుల నోట మంత్రంలా మారిన వందేమాతరాన్ని పలికితే జైళ్ల పాల్జేశారు. ఈ రోజుకీ వందేమాతరం ఆలపించినా, విన్నా నరనరాన దేశభక్తి నిండుతుంది. ఒళ్ళు పులకరిస్తుంది. శ్రీ బంకిమ్ చంద్ర ఛటర్జీ గారు మన జాతికి అందించిన ఆ గేయంలో ఉన్న శక్తి అది. పోరాట స్ఫూర్తిని నింపిన వందేమాతరం గురించి భావి తరాలకు ఘనంగా తెలియచేయాలి. ఈ గేయం శుక్రవారం నాటికి 150 ఏళ్ళు పూర్తి చేసుకొంటుంది. దేశవ్యాప్తంగా నిర్దేశిత సమయంలో ప్రజలందరూ వందేమాతరం ఆలపించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

# తిరుమల సమాచారం

## కపిలేశ్వర సన్నిధిలో ముగిసిన చండీహోమం



**తిరుమల,నవంబర్ 7ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి కపిలేశ్వర ఆలయంలో ప్రముఖ శైవాలయంలో కార్తీకమాస పూజల్లో భాగంగా శుక్రవారం చండీహోమం ముగిసింది.గతనెల 30వతేదీనుండి శుక్రవారం వరకు ఈ హోమాలు జరిగాయి. శుక్రవారం ఉదయం శాస్త్రోక్తంగా యాగశాలలో చండీయాగం సమాప్తి, మహాపూర్ణాహుతి, కలశ ఉద్వాసన, మహాభిషేకం, అమ్మవారి మూలవర్లకు కలాశాభిషేకం, అలంకరణ, నివేదన హారతి చేపట్టారు. సాయంత్రం కలశస్థాపన పూజ, జపం, హోమం, నివేదన జరిపించారు. 500 రూపాయలు చెల్లించి గృహస్థభక్తులు ఈ హోమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ డిప్యూటీ ఇఒ నాగరత్న, ఆలయ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, అర్చకులు పాల్గొన్నారు.

## అనూహ్యంగా పెరిగిన వారాంతపు రద్దీ



**తిరుమల,నవంబర్ 7ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలదివ్యక్షేత్రం భక్తులతో జనసంద్రంగా మారింది. వారాంతం సెలవులు,రెండవ శనివారం, ఆదివారం రావడంతోబాటు కార్తీకమాసంతో తిరుమలలో లక్షలాదిమంది భక్తులు ఉన్నారు. ఏకంగా వీరంతా ఆ దేవదేవుని దర్శనానికి సర్వదర్శనం క్యూలైన్లలో నారాయణగిరి ఉద్యానవనాల షెడ్ల వద్దనుండి నిరీక్షిస్తున్నారు. శనివారం మరింతమంది భక్తులు తమిళనాడు, కర్నాటక నుండి తరలివచ్చారు.. ఆలయానికి ఎదురుగా అఖిలాండం వద్ద కొబ్బరికాయకొట్టి ఏడుకొండలస్వామీ గోవిందా గోవింద నామస్మరణతో పునీతులవుతున్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు తిరుమలకు కాలినడకన భారీగా భక్తులు చేరుకున్నట్లు టిటిడి సమాచారం. దీంతోబాటు తిరుమలలో యాత్రికుల వసతి సముదాయం వెంకటాద్రినిలయం అందుబాటులోకి రావడంతో నాలుగువేలమంది సామాన్యభక్తులకు వసతి కల్పించేందుకు సులభమైంది. సామాన్యభక్తులు తిరుమలలో స్వామివారి దర్శనానికి 16గంటలుపాటు నిరీక్షించాల్సిన అవసరం ఉంది. భక్తుల రద్దీని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ శ్రీవారి సేవకులతో నిరంతరాయంగా అన్నప్రసాదాలు,తాగునీరు,కాఫీ, పాలు అందించేలా టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, సివిఎస్ఒ మురళీకృష్ణ,,విఎస్ఒలు ఎస్టీవిరామ్‌కుమార్, సురేంద్ర, డిప్యూటీ ఇఒలు రాజేంద్ర,సోమాన్నారాయణ పర్యవేక్షిస్తున్నారు. సాయంత్రంవరకు 41వేలమంది భక్తులు మహాలఘులో గోవిందుని దర్శనం చేసుకున్నారు.

## భారతీయ జాతి గౌరవానికి ప్రతీకగా నిలిచిన గీతం వందేమాతరం : వైఎస్ జగన్



**విజయవాడ.నవంబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** భారతీయ జాతి గౌరవానికి ప్రతీకగా నిలిచిన "వందేమాతరం గీతం 150 ఏళ్ల పూర్తిచేసుకుంది. ఈ సందర్భంగా వైసిపి అధ్యక్షుడు వైఎస్ జగన్ తన సోషల్ మీడియా వేదిక ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు."వందేమాతరం 150 సంవత్సరాల స్ఫూర్తికి నా వందనం. భరత జాతి నఖశిఖ పర్యంతం, నరనరాల్లో ఉప్పొంగిన ఉద్యమ గీతమే వందేమాతరమని, సామాన్యులను సమరయోధులుగా మలచి, స్వాతంత్ర్య స్ఫూర్తికి సంకల్ప బలాన్ని అందించిన సాత్విక సాయుధ శరమే వందేమాతరమన్నారు.బంకిం చంద్ర ఛటర్జీ గారు రచించిన ఈ పవిత్ర గీతం మన స్వాతంత్ర్య సమరయోధులలో రగిలించిన ఐక్యతా భావనే మనందరికీ ఆదర్శం. ఆ స్ఫూర్తితో మన భావితరాల కోసం, వారి అభివృద్ధి కోసం కలిసి పనిచేద్దాంఅని వైఎస్ జగన్ పిలుపునిచ్చారు.

## 11,12,13 తేదీల్లో టిడిపి మండల, క్లస్టర్,యూనిట్, విలేజ్, బూత్ కమిటీల ప్రమాణస్వీకారం : రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు 'పల్లా'

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, నవంబర్ 7:** టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లోని మండలం, క్లస్టర్, యూనిట్, విలేజ్, బూత్ కమిటీల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఈనెల 11,12,13 తేదీల్లో ఆయా నియోజకవర్గ పార్టీ కార్యాలయాల్లో జరుపుకోవాలని రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు.

కార్యకర్తల ఆమోదంతో పార్టీ అధిష్ఠానం ఖరారు చేసిన తుది జాబితాను పంపిచటం జరిగిందన్నారు. అందరికీ సమాచారం అందించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని 'పల్లా' పేర్కొన్నారు.

## 30 యేళ్లు దాటిన మహిళలు స్క్రీనింగ్ పరీక్షలు చేసుకోవాలి

### ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్

**విజయవాడ.నవంబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వం ఇంటింటికీ వచ్చి చేసే ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్ లను చేసుకునేందుకు మహిళలు ముందుకు రావాలని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ జి.వీరపాండియన్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని మహిళలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో శుక్రవారంనాడు కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశాతో కలిసి మహిళలకు ప్రత్యేక క్యాన్సర్ పరీక్షకు ఆహ్వానం పేరుతో రూపొందించిన ఇన్విటేషన్ కార్డును ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...నాలుగో విడత ఎన్సీడీ(నాన్ కమ్యునకబుల్ డిసీజెస్) స్క్రీనింగ్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సెప్టెంబర్ 17న ప్రారంభించారని, ప్రత్యేకించి ఇది క్యాన్సర్ స్క్రీనింగ్ ఉద్దేశించినదని తెలిపారు. శుక్రవారం నుండి క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమాన్ని విజయవాడ నుంచి ప్రారంభిస్తున్నమన్నారు. మూడవ విడత ఎన్సీడీ స్క్రీనింగ్ లో ఎదురైన అనుభవాలు, సవాళ్లను పరిశీలించిన అనంతరం 4వ విడతలో ప్రత్యేకించి క్యాన్సర్ స్క్రీనింగ్ పై దృష్టిపెట్టాలని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారన్నారు. 4వ విడత ఎన్సీడీ స్క్రీనింగ్ పై అవగాహన కల్పించేందుకు పెద్దఎత్తున ప్రచారాన్ని చేపట్టామని, ఇందుకోసం ఇన్ఫర్మేషన్ ఎడ్యుకేషన్ మరియు కమ్యూనికేషన్(ఐఇసి) కార్యక్రమం కింద పోస్టర్లు, కరపత్రాల్ని ప్రచురించి జిల్లాలకు

## హైకోర్టు ఆదేశాల మేరకే క్రీడా కోటా ఎంబిబిఎస్ అభ్యర్థుల తుది జాబితా

**- బెంగాల్ ఐపిఎస్ అధికారి కుమార్తెకు సీటు కేటాయింపుపై శాప్ స్పష్టత**

**విజయవాడ,నవంబరు 7,ప్రభాత వార్తప్రతినిధి:** ఏపీ హైకోర్టు మార్గదర్శకాలను అనుసరించి క్రీడా కోటా ఎంబీబీఎస్(నీట్) అభ్యర్థుల తుది జాబితాను రూపొందించి సంబంధిత విశ్వవిద్యాలయానికి సమర్పిస్తామని శాప్ తెలిపింది. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఓ ఐపీఎస్ అధికారి కుమార్తెకు నిబంధనలకు విరుద్ధంగా ఏపీ క్రీడా కోటాలో ఎంబీబీఎస్ సీటు కేటాయించినట్లు కొన్ని ప్రసార మాధ్యమాల్లో తప్పుడు వార్తలు వచ్చాయని పేర్కొంది. గురువారం ఓ ప్రకటనలో వాటిని ఖండించింది. కేటాయింపులో శాప్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రమేయం ఉందని వచ్చిన ఆరోపణలు అవాస్తవమని స్పష్టం చేసింది. 2025-26 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్ ప్రవేశాలకు సంబంధించి క్రీడా కోటా కింద అభ్యర్థుల ప్రాధాన్య క్రమ జాబితా(టెంటేటివ్ ప్రయారిటీ లిస్టు)ను గత నెల 9న ప్రకటించాం. దీనిపై అభ్యంతరాల స్వీకరణకు ఏడు రోజులు గడువిచ్చాం. తన కుమార్తె పద్మావతికి ఏపీ క్రీడా కోటా కింద సీటు మంజూరు చేయాలని ఐపీఎస్ అధికారి వీఎస్ఆర్ అనంతనాగ్...శాప్‌నకు అర్జీ పెట్టారు. ఈ మేరకు ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. ఆమెకు సీటు కేటాయించాలని ఏపీ హైకోర్టు బుధవారం ఉత్తర్వులిచ్చింది'.

## స్టేట్ బార్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కారమ్స్,చెస్ పోటీలు

### కార్యక్రమాన్ని ప్రారంభించనున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్

### బహుమతులను పంపిణీ చేయనున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య

**విజయవాడ,నవంబరు 7,ప్రభాతవార్త** తొలి సారిగా ఏపీ స్టేట్ బార్ ఫెడరేషన్ అధ్వర్యంలో ఫెడరేషన్ అధ్యక్షులు,బెజవాడ బార్ అధ్యక్షులైన ఎకె భాషా (అబ్దుల్ ఖుద్దూస్ భాషా),గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు,బార్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వై.శివ సూర్యనారాయణ తదితరుల నేతృత్వంలో నేడు,రేపు కారమ్స్,ఛెస్ పోటీలను బెజవాడ బార్‌లో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ ప్రారంభించనుండగా, గెలుపొందిన విజేతలకు బహుమతులను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య పంపిణీ చేయనున్నారు. తొలి సారిగా అత్యంత ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర స్థాయిలో జరుగనున్న ఈ పోటీలు బెజవాడ బార్ అసోసియేషన్‌లో జరగనుండటం విశేషం. ఈ కార్యక్రమంలో బార్ ఫెడరేషన్ ఉపాధ్యక్షులైన,నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు పి.అయ్యప్పరెడ్డి,విశాఖపట్నం బార్ అధ్యక్షులు ఎంకె శ్రీనివాస్,కర్నూలు బార్ అసోసియేషన్ అధ్యక్షులు పి.హరినాథ్‌చౌదరి,ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీలుగా వ్యవహరిస్తున్న ఏలూరు బార్ అధ్యక్షులు కె.సీతారామారావు,ఒంగోలు బార్ అధ్యక్షులు బి.భాస్కరరావులు కూడ ఈ పోటీలకు సహకారం అందించనున్నారు. ఈ పోటీల వలన బెజవాడ బార్ గౌరవం మరింత ఇనుమడించనుందని పలువురు న్యాయవాదులు పేర్కొంటున్నారు. గౌరవ అతిథులుగా కృష్ణాజిల్లా జడ్జి గుట్టల గోపి,విజయవాడ రెండవ అదనపు జిల్లా,సెషన్స్ న్యాయమూర్తి ఎ.సత్యానంద్,ప్రత్యేక ఆహ్వానితులుగా రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు సూరాబత్తుల మల్లేశ్వరరావు,సుంకర రాజేంద్రప్రసాద్,చలసాని అజయ్‌కుమార్,కె.చిదంబరం,విడి సిద్ధార్ధ లా కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ దివాకరబాబు,విజయవాడ పోలీస్ కమీషనర్ ఎస్‌వి రాజశేఖరబాబులు పాల్గొననున్నారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగనున్న ఈ పోటీలు నేడు,రేపు ఉదయం 10 గంటలకు బెజవాడ బార్ అసోసియేషన్ ప్రాంగణంలో జరుగనున్నాయి.రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదుల మధ్య జరిగే అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ పోటీలకు బెజవాడ బార్ వేదిక కానుంది.

## 2023లో నోటిఫికేషన్‌పై ఇంజనీరింగ్ నియామకాలు జరగలేదు

### -'డయల్ యువర్ ఇఒ'కు భక్తులు ఫిర్యాదులు

**తిరుమల,నవంబర్ 7ప్రభాతవార్తప్రతినిధి:** ఇష్టదైవమ్ తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి ఆలయంలోనికి వచ్చిన భక్తులను క్యూలైన్లలో సిబ్బంది తోస్తున్నారని ,దీనివల్ల భక్తులు అసహనం చెందుతున్నారని అనంతపురంకు చెందిన మణికంఠ ఫిర్యాదు చేశారు. ఆన్‌లైన్‌లో దర్శన టిక్కెట్లు బుకింగ్‌పై ఓటిపి రావడానికి ఆలస్యమవుతోందని తెలిపారు. దీనిపై టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్ సమాధనంగా భక్తుల సలహాలు, సూచనల మేరకు ఓటిపి విధానం తీసుకురావడం జరిగిందని, సమస్యను పరిష్కరిస్తామన్నారు. దర్శన క్యూలైన్‌లోభక్తులతో మెలిగే విధానంపై శ్రీవారి సేవకులకు శిక్షణనిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. హైదరాబాద్‌నుండి శంకర్‌గౌడ్ మాట్లాడుతూ మూడునెలల అడ్వాన్స్‌గా టిక్కెట్లు బుక్‌చేసుకునే విధానం ఇబ్బందిగా ఉందని, ప్రతిరోజూ టిక్కెట్లు బుక్‌చేసుకునే విధానం బావుంటుందని తెలిపారు. దీనిపై ఇఒ స్పందిస్తూ భక్తులందరికీ ఇబ్బంది లేకుండా అడ్వాన్స్ బుకింగ్ విధానం తీసుకురావడం జరిగిందన్నారు. కడపనుండి గణేశ్ మాట్లాడుతూ 2023లో ఇంజనీరింగ్‌విభాగంలో ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చారని, కానీ నియామకాలు జరగలేదని తెలిపారు. ఈ విషయంపై స్పందించిన ఇఒ ఈ విషయం తనవరకు వచ్చిందని, 15రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. శుక్రవారం ఉదయం అన్నమయ్యభవనంలో "డయల్ యువర్ ఇఒ"కార్యక్రమం జరిగింది. గంటసమయం నిర్వహించిన ఈ కార్యక్రమానికి దేశం నలుమూలల నుండి 19మంది భక్తులు తమతమ ఫిర్యాదులు,అభిప్రాయాలు, సూచనలు చేశారు. వాటన్నిటికీ టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్ సమాధానాలిచ్చారు. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఇఒ వీరబ్రహ్మం, సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, సిఇ సత్యనారాయణ, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, విఎస్ఒలు ఎస్టీవి రామ్‌కుమార్, సురేంద్ర, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, డిప్యూటీ ఇఒ భాస్కర్(ఆర్1), సోమన్నారాయణ(ఆరోగ్యం), రాజేంద్ర(అన్నదానం),ఉద్యానవనవిభాగం డిడి శ్రీనివాసులు, ఎస్వీబిసి సిఇఒ ఫణికుమార్‌నాయుడు ,క్యాటరింగ్ ప్రత్యేకాధికారి శాస్త్రి, పిఆర్ఒ నీలిమ పాల్గొన్నారు. ఖమ్మంనుండి సాయిచరణ్ మాట్లాడుతూ శ్రీవారి దర్శనం టిక్కెట్లు పొందే సమయంలో డెబిట్,క్రెడిట్ కార్డులు బదులుగా ఆర్‌బిఐ సూచించిన యూపిఐద్వారా చెల్లించే సౌలభ్యం కల్పించాలని కోరారు. ఇందుకు ఇఒ సింఘాల్ సమాధానంగా ఐటివిభాగం అధికారులతో చర్చించి అమలుచేసేలా చూస్తామన్నారు. బెంగుళూరునుండి రమేశ్ మాట్లాడుతూ శ్రీవారి ఆలయంలో కల్యాణోత్సవం నిర్వహించే మండపంలో ఇకచోట మాత్రమే తాగునీరు ఉందని, మరోచోట ఏర్పాటుచేయాలని కోరారు.దీనిపై ఇఒ స్పందిస్తూ సమస్య అర్థమైందని, భక్తుల సౌకర్యాలపై ఇచ్చిన సూచనను పాటించి అమలుచేస్తామన్నారు. అనంతపురం నుండి ఈశ్వర్ మాట్లాడుతూ కొంతమంది ప్రజాప్రతినిధుల పిఆర్ఒలు అధిక ధరలకు దర్శనం టిక్కెట్లు అమ్ముతున్నారని, కట్టడిచేయాలని సూచించారు. ఈ ప్రశ్నకు ఇఒ సింఘాల్‌స్పందిస్తూ ప్రజాప్రతినిధులకు టిటిడి సౌకర్యం కల్పించిందని, కొంతమంది దళారులు డబ్బులు తీసుకుని భక్తులను మోసగిస్తున్నట్లు ఫిర్యాదులు అందాయన్నారు. దళారులను నమ్మవద్దని, శ్రీవాణి ట్రస్ట్‌ద్వారా టిక్కెట్లు పొంది స్వామివారిని దర్శించుకోవాలని ఇఒ కోరారు.


తిరుమలలో డయల్ యువర్ ఇఒలో అధికారులు

## పరకామణి కేసులో సిఐడి పక్కాఆధారాల కోసం వ్యూహం!

**తిరుమల,నవంబర్ 7ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల పరకామణిలో 2023లో జరిగిన చోరీ కేసులో నిందితుడు రవికుమార్ పట్టుబడిన తీరు, ఆ తరువాత పోలీసులు కేసు నమోదు, విచారణ, చివరకు లోక్‌అదాలత్‌లో రాజీచేసుకున్న అంశాల వరకు సిఐడిపక్కా ఆధారాల కోసం వ్యూహాత్మకంగా అడుగులేస్తోంది. ఇప్పటికే నిందితుడు రవికుమార్ కూడబెట్టిన అక్రమ ఆస్తులపై తెలిసిన విషయాలు చెప్పాలని సిఐడి చీఫ్ రవిశంకర్‌అయ్యన్నార్ మీడియా సమావేశంలో విజ్ఞప్తిచేసిన విషయం విదితమే. ఇందుకోసం 9440700921 నంబర్‌కు వాట్సాప్‌ద్వారా,లేక ఏడిజిసిఐడిఅట్‌దిరేట్‌ఆఫ్ ఎపి.జిఒవి.ఇన్"కు మెయిల్‌చేసినా వివరాలు గోప్యంగా ఉంచుతామని భరోసా కల్పించారు. అయినా సిఐడి అధికారులు వారి స్థాయిలో వాళ్ళ వివరాలు ఆరాతీస్తున్నారు. హైకోర్టు ఆదేశాలతో దర్యాప్తుకు రంగంలోకి దిగిన సిఐడి చీఫ్ రవిశంకర్‌అయ్యన్నార్, ఎస్పీలు, డిఎస్పీలు,సిఐల బందం ఐదుటీమ్‌లుగా విడిపోయి తిరుమల,తిరుపతిలో క్షేత్రస్థాయిలో సమాచారం సేకరించే పనిలో నిమగ్నమైంది. ఇప్పటికే తిరుమలలోపరకామణి భవనం, కమాండ్ కంట్రోల్ రూమ్, సిసి టివి దృశ్యాలు, చోరీచేస్తూ నిందితుడు పట్టుబడిన ప్రాంతం మరోసారి పరిశీలించారు. పరకామణిలో కొందరి సిబ్బందిని కూడా సమాచారం కోసం పలకరించినట్లు తెలుస్తోంది. పెద్దజీయర్ మఠంలో గుమస్తాగా ఉండే రవికుమార్ పరకామణివిధులకు ఎలా వెళ్ళాడు?అక్కడ ఎవరి సహాయంతో కీలకమైన హోదాలో విధులు నిర్వహించాడనేది ఇప్పుడు సిఐడి రాబడుతున్న విషయం. అయితే అన్ని కోణాల్లో దర్యాప్తు మొదలుపెట్టామని, డిసెంబర్ 2వతేదీకి హైకోర్టుకు నివేదిక సమర్పిస్తామని డిజి రవిశంకర్‌అయ్యన్నార్ మీడియాకు తెలిపారు. ఈ కేసులో విచారణ, దర్యాప్తుపై ఊహాగానాలు వద్దని, మరింతగా సమాచారం.




# ఉల్లిరైతుల ఖాతాల్లో హెక్టారుకు రూ.50వేలు

## ప్రభుత్వం కీలక నిర్ణయం

**విజయవాడ,నవంబరు 7,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రైతులకు అండగా నిలవాలని నిర్ణయించింది. ఈ మేరకు అధికారికంగా ప్రకటన చేసింది. ఉల్లి రైతులను ఆదుకోవాలని నిర్ణయించినట్లు ఏపీ ప్రభుత్వం వెల్లడించింది. ఇందుకోసం హెక్టారుకు రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం అందించేందుకు సిద్ధమవుతుంది. కర్నూలు, కడప జిల్లాల్లోని 20,913 మంది రైతులకు రూ. 104.57 కోట్ల మేర లబ్ధి చేకూరుతుంది. ఈపంట ఆధారంగా ఈ సహాయం అందుతుందని అధికారులు వెల్లడించారు. ఉల్లి రైతులకు అండగా నిలవాలని.. ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసు కుంది. దీనివల్ల 45 వేల ఎకరాల్లో ఉల్లి పండించిన రైతులకు మేలు జరుగుతుంది. ఇప్పటికే ఉల్లి కొనుగోలులో మార్కెటింగ్ శాఖ, మార్క్‌ఫెడ్ కీలక పాత్ర పోషించాయి. క్వింటాల్ ఉల్లి రూ.1,200 చొప్పున, మొత్తం రూ.18 కోట్లు వెచ్చించి కొనుగోలు చేశాయి. దీనికి సంబంధించి రూ.10 కోట్లు ఇప్పటికే రైతులకు చెల్లించారు. మిగిలిన రూ.8 కోట్లను కూడా త్వరలోనే అందిస్తామని మంత్రి అచ్చన్నాయుడు వెల్లడించారు. వివిధ పరిస్థితుల కారణంగా ఈసారి క్వింటా ఉల్లి రూ.600 కంటే ఎక్కువ ధర పలకలేదు. దీంతో ప్రభుత్వం క్వింటా రూ.1,200 చొప్పున సుమారు లక్షా 39 వేల క్వింటాళ్ల ఉల్లిని కొనుగోలు చేసింది.కర్నూలు మార్కెట్ యార్డుకు వచ్చిన ఉల్లిని దాదాపుగా సేకరించింది. కొంత ఉల్లిని రైతు బజార్లకు, మరికొంత ఉల్లిని వ్యాపారులకు తరలించి విక్రయించింది. అయినప్పటికీ కొంతమంది రైతుల వద్ద ఇంకా ఉల్లి మిగిలి ఉంది. గిట్టుబాటు ధర లేక రైతులు నష్టపోతున్నారని గుర్తించిన ప్రభుత్వం.. ఉల్లి సాగు చేసిన రైతులకు హెక్టారుకు రూ.50వేల చొప్పున అందించాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. దీనికి సంబంధించిన నియమనిబంధనల మేరకు లబ్దిదారులకు సాయం అందనుంది. ఇక.. మొంథా తుఫాను కారణంగా నష్టపోయిన రైతులకు ఆర్థిక సాయం పైన ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తుఫాను కారణంగా దాదాపు రూ 5,245 కోట్ల మేర రాష్ట్రానికి నష్టం వాటిల్లినట్లు కేంద్రానికి నివేదిక పంపారు. తక్షణ సాయం కోరారు. పెద్ద మొత్తంలో పంట నష్టం జరిగినట్లు గుర్తించారు.

## 26 మంది పంచాయతీ కార్యదర్శుల సస్పెన్షన్

**విజయవాడ,నవంబరు 7,ప్రభాత వార్తప్రతినిధి:** స్వర్ణ పంచాయతీల డేటా సేకరణలో తీవ్ర నిరక్ష్యం వహించిన 26మంది పంచాయతీ కార్యదర్శులపై ఆ శాఖ కమిషనర్ సస్పెన్షన్ వేటువేశారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా స్వర్ణ పంచాయతీ పోర్టల్ తీసుకురాగా, కొందరు పంచాయతీ కార్యదర్శుల నిర్వాకంతో ఈప్రక్రియలో తప్పిదాలు జరిగాయి. దాదాపు మూడు వేల పంచాయతీల పరిధిలో వీటిని గుర్తించారు. ఒక్కో పంచాయతీలో ఒకే ఫోన్ నంబర్‌ను వందల అసెసమెంట్‌లకు లింక్ చేసినట్టు అధికారులు గుర్తించారు. దీంతో తీవ్రనిరక్ష్యం వహించిన పంచాయతీ కార్యదర్శులను..

.జిల్లాకు ఒకరి చొప్పున గుర్తించి వారందరిపైనా ప్రభుత్వం వేటు వేసింది.

ధైర్యం అన్నదే అసలయిన సంపద. ధైర్యం కోల్పోయినట్లయితే అన్నీ కోల్పోతాం.

-జేమ్స్ చెర్రీ

# కల్తీకి కాపలాదారులా?


మానవుడికే కాదు పశుపక్ష్యాదుల ఆరోగ్యానికి సంకటంగా మారుతున్న కల్తీని నిరోధించేందుకు పాలకపెద్దలు చేస్తున్న ప్రయత్నాలుఏమాత్రం ఫలించడం లేదు. దేశంలో రానురాను కల్తీ పెరిగిపోతున్నది. తాగేనీటిలో కల్తీ, పప్పులో కల్తీ, ప్రాణాపాయం నుండి కాపాడే మందుల్లో కల్తీ చివరకు పౌష్టికాహారంగా వయసుతో ప్రమేయం లేకుండా పసిపిల్లల నుండి వృద్ధులవరకు సేవించే పాలల్లో కల్తీ, అదీ ఇది అని తేడా లేకుండా అంతా కల్తీమయంగా మారిపోతున్నది. మనిషి మనుగడనే ప్రశ్నార్థకం చేసే సూచనలు కన్పిస్తున్నాయి. ఈ కల్తీ ప్రభావం సామాన్య జనంతోపాటు ముఖ్యంగా ప్రభుత్వ వసతి గృహాలపై తీవ్రంగా చూపుతున్నది. ఇటీవల కలుషిత ఆహారం తినిప్రభుత్వ వసతి గృహాల్లోఉన్న ఎంతో మంది విద్యార్థినీవిద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారు. ఇంత ప్రమాదకరంగా మారుతున్నా, పొగ మంచులా అంతటా విస్తరించినా అడిగేవారు, అడ్డగించేవారు కరవైపోతున్నారు. ఒకరకంగా చెప్పాలంటే అవినీతికి, కల్తీకి అవినాభావ సంబంధం ఉంది. పెరుగుతున్న అవినీతికి రెట్టింపు స్థాయిలో కల్తీ విస్తరిస్తున్నది. దీనిని అరికట్టేందుకు ఎన్నో చట్టాలున్నాయి. ఆ చట్టాలు అమలు చేసి కల్తీ జరగకుండా నిరోధించేందుకు దేశవ్యాప్తంగా లక్షలాది మంది అధికారులు ఉన్నారు. కోట్లాది రూపాయల జీతభత్యాల రూపేణా తీసుకుంటున్నారు. కానీ కల్తీని ఏ మాత్రం నియంత్రించలేకపోతున్నారు. ఈ కల్తీ భారత్‌లోనే కాదు ప్రపంచవ్యాప్తంగా మానవజీవనానికి సవాలుగా మారుతున్నా మనదేశంలో అత్యంత ప్రమాదకరంగా పరిణమిస్తున్నదనే సంకేతాలు వెలువడుతున్నాయి. ఇది మూడోకంటికి తెలియకుండా జరగడం లేదు. బహిరంగ రహస్యమే. అన్నింటికంటే ముఖ్యంగా ఆహార కల్తీ పెరిగిపోతున్నది. కొందరు దళారులు, వ్యాపారులు లాభాల కోసం పప్పుదినుసుల్లో, మసాలాలు వంటి నిత్యావసర సరుకుల్లో కల్తీ చేస్తున్నారు. అనేక హోటళ్లలో కల్తీ ఇష్టారాజ్యాంగా సాగిపోతున్నది. కల్తీ అడ్డుకట్ట ప్రమాణాల చట్టం 2006లో తీసుకువచ్చినా పట్టించుకునేవారే లేరు. ఇది ఎన్నో ప్రమాదాలను హెచ్చరిస్తున్నది. ఇక భారత ఆహార భద్రతా ప్రమాణాల ప్రాధికార సంస్థ ఎఫ్ఎస్ఎస్ఐ అమలు గూర్చి దాదాపు మరిచిపోయారనే చెప్పొచ్చు. మార్కెట్లో విక్రయించే ఆహార పదార్థాల తయారీకి ఎఫ్ఎస్ఎస్ఐ అనుమతి తప్పనిసరి. కానీ వ్యాపార సంస్థలేవీ అనుమతులు తీసుకోవడం లేదు. ఈ చట్టాన్నే కాదు కల్తీని నిరోధించేందుకు ఉద్దేశించిన అనేక చట్టాలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. 1947 నాటి వంటనూనెల నియంత్రణ చట్టం, 1955 నిత్యావసర సరుకుల్లో కల్తీ నియంత్రణ చట్టం, 1992 పాల ఉత్పత్తుల్లో కల్తీ నియంత్రణ చట్టం, అన్నిటికంటే ముఖ్యంగా 1954 నాటి ఆహార కల్తీ నిరోధక చట్టాన్ని పూర్తిగా మరిచిపోయారని చెప్పొచ్చు. ఇక్కడా, అక్కడా అనికాదు. దేశవ్యాప్తంగా కల్తీ విజృంభించిపోతున్నది. కోట్లాది మంది ఈ కల్తీ కారణంగానే రకరకాల రుగ్మతులకు గురవుతున్నారు. కల్తీకాటుకు యేటా ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది రకరకాలవ్యాధుల బారిన పడుతుంటే లక్షల సంఖ్యలో మరణాలు సంభవిస్తున్నాయి. అన్నిటికంటే బాధాకరంగా మరణిస్తున్న వారిలో ముప్పైశాతానికి మించి ఐదేళ్లలోపు వయసున్న బాలబాలికలే. ఇక పాలల్లో కల్తీ అదుపు తప్పిపోతున్నది. డిమాండ్‌కు తగినట్లు ఉత్పత్తి లేకపోవడంతో ఆ వ్యత్యాసాన్ని పూడ్చేందుకు రకరకాల మార్గాల్లో కృత్రిమ పాలను తయారు చేస్తున్నారు. చక్కెర, ఉప్పు, గంజిపొడి, బియ్యం పిండి, యూరియా, గ్లూకోస్, హైడ్రోజన్ పెరాక్సైడ్, కాస్టిక్ సోడా, వంట సోడా, డిటర్జెంట్, మైలమాన్‌పొడి, నూనె, తదితర పదార్థాలతో కల్తీపాలను తయారు చేస్తున్నారు. ఈ కల్తీపాలను తాగితే అజీర్తి సమస్యలతో ప్రారంభమై కడుపు నొప్పితోపాటు మూత్రపిండాలు, కాలేయం, నాడీ వ్యవస్థపై ప్రభావం పడుతుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. రసాయనికాలతో కూడిన పాలను తీసుకుంటే క్యాన్సర్ లాంటి వ్యాధులు సోకే ప్రమాదంఉందని కూడా వైద్యులు చెబుతున్నారు. ఇక పాలల్లో చిక్కదనం కోసం మైలమన్ రసాయనిక పొడిని కలుపుతున్నారు. ఇక క్రిమిసంహారక మందులను పిచికారి చేసిన మేతను పశువులకు వేయడంతో దుష్ప్రభావాలకు కారణాలవుతున్నాయి. మరికొన్ని సందర్భాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి సోకినప్పుడు పాలు పితకకూడదు. కానీ అవేమీ పాటించడం లేదు. ఇలాంటి ఎన్నో కారణాలతో పాలు కల్తీ అయిపోతున్నాయి. ఈ పాలద్వారా తయారు చేసే రకరకాల తీపి పదార్థాలు కూడా కలుషితమైపోతున్నాయి. భారతదేశానికి సంబంధించి ఎన్నో సందర్భాల్లో దేశసర్వోన్నత న్యాయస్థానం కల్పించుకున్న పరిస్థితులు కూడా ఏర్పడ్డాయి. దేశప్రజలకు విక్రయించే పాలల్లో అరవైశాతంపైగా కల్తీయేనన్న వాస్తవాన్ని సాక్షాత్తు జాతీయ ఆహార భద్రత ప్రమాణాల మండలి ఏనాడోవెల్లడించింది. అప్పట్లో దేశంలో వివిధ ప్రాంతాల్లో తనిఖీ నిర్వహిస్తే అధిక శాతం కల్తీ బయటపడింది. ఇలాంటి సందర్భాల్లో సర్వోన్నత న్యాయస్థానం కల్పించుకొని ఇంతపెద్ద సమస్యపైపాలకులు ఏం చేస్తున్నారో చెప్పండంటూ నిలదీసి అడిగింది. ఈ దురాగాతాలను నివారించడంలో విఫలమవుతున్న అధికార గణంపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారంటూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను సుప్రీంకోర్టు ప్రశ్నించిన సందర్భాలున్నాయి. ఇప్పటికైనా పాలకులు కల్తీ విషయంలో ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉంది. కొత్త చట్టాల సంగతి దేవుడెరుగు. ఉన్నచట్టాలను త్రికరణ శుద్ధిగా అమలు చేసేందుకు ప్రయత్నంచేయాలి. ముఖ్యంగా కల్తీని నిరోధించేందుకు కృషిచేయాల్సిన కొందరు అధికారులు కాపలాదారులుగా వ్యవహరించడం దురదృష్టకరం.

చాలా మంది లోభులవడం వల్ల ఎందరో ఆకలితో అలమటిస్తున్నారు. ఇతరులతో పంచుకోవడం ఎలాగో తెలుసుకుంటే సమస్య ఉండదు.



ఐ.జాన్సన్

ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలనే కోరిక, దాన్ని మార్చాలనే ఆకాంక్ష మానవ ప్రగతికి ప్రధాన ప్రేరకాలు.



బెర్ట్రండ్ రస్సెల్

## ప్రజావాక్కు



### భయపెడుతున్న రోడ్డు ప్రమాదాలు!

రాష్ట్రంలోరోడ్డు ప్రమాదాలసంఖ్యభయంగొలిపే స్థాయిలో పెరిగిపోతోంది. ఏవార్తాపత్రికలను తిరగేసినా భయంకరమైన రోడ్డుప్రమాదాల్లో పదుల సంఖ్యలో మృత్యువాతకు గురైనఅభాగ్యుల ఫోటోలు ప్రతిరోజూ పత్రికలలో దర్శనమిస్తాయి. వాహనాలసంఖ్య విపరీతంగా పెరిగిపోయాయి. రోడ్లపరిస్థితి అధ్వానంగా తయారుకావడం,ట్రాఫిక్ నిబంధనలను కనీసంగాకూడా పాటించకపోవడం, మితిమీరిన వేగం,కాలంచెల్లిన వాహనాలు, పరిమితికి మించిన లోడ్ పరుగులు తీసే లారీలు, ట్యాంకర్లు రోడ్డు ప్రమాణాలకు నేపథ్యంగా నిలుస్తున్నాయన్నదివాస్తవం. దీనికితోడు ఇటీవల కాలంలో 'సెల్ రైడింగ్'విపరీతంగా పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తోంది. జనంతో కిక్కిరిసిన నగర రోడ్లు, వాహనాలు దార్లు తీరిన హైవేలలో అష్టకష్టాలు పడుతూ సెల్‌ఫోన్లో మాట్లాడుతూ డ్రైవింగ్‌చేయడం మంచిదికాదు.

- సింగు లక్ష్మీనారాయణ, చింతకుంట,కరీంనగర్ జిల్లా

### ట్రంప్‌కు బెదరని ఓటర్లు

అమెరికన్ ప్రజల మనోభీష్టం అధ్యక్షుడైన డోనాల్డ్ ట్రంప్ మీదఉన్న అయిష్టం ఏదో విధంగా వ్యక్తపరచడమే. అందుకే వచ్చిన అవకాశాన్ని చక్కగా వినియోగించుకున్నారు. న్యూయార్క్ సిటీమేయర్ ఎన్నికల్లో డెమొక్రాటిక్ అభ్యర్థి భారత్ మూలాలు కలిగిన 34 ఏళ్ల మజ్దాని కన్సర్వేటివ్ అభ్యర్థిని చిత్తుగా ఓడించడం, అలాగే 61 సంవత్సరాల డెమొక్రాటిక్ పార్టీకి చెందిన భారత సంతతి మహిళ గజాలా ఫిర్దౌస్ హాష్మీ వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నరుగా, మరో భారతీయ అమెరికన్ అఫ్తాబ్ కర్మసింగ్ పురేవల్ సిన్సినాటి పట్టణ మేయర్‌గా ఎన్నికల దుంధుభి మోగించారు. ఈ విజయాలు ట్రంప్ పరిపాలన మీద రిఫరెండమ్‌గా భావించవచ్చు.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### బకాయి నిధులను విడుదల చేయాలి

రాష్ట్రప్రభుత్వంసకాలంలో ఫీజురియంబర్స్మెంటు, ఉపకార వేతన నిధులను విడుదల చేయకపోవడం వల్ల ప్రైవేట్ కళాశాలలయాజమాన్యం ఆర్థికఇబ్బందులతో కళాశాలలను సక్రమంగా నిర్వహించకపోవడం వల్లవిద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్య అందడం లేదు. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం కాలేజీలను బంద్‌చేయడంతో విద్యార్థులు తమ భవిష్యత్తు గురించి ఆందోళన చెందుతున్నారు.

- బూర్గుపల్లి కృష్ణ యాదవ్, విద్యానగర్, హైదరాబాద్

### స్థానిక ప్రజలకు ఉపాధి కల్పించాలి

తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో పెట్టుబడుల ఆకర్షణకు మరింత సమగ్ర ప్రయత్నం అవసరం. పరిశ్రమలు, వ్యవసాయ ఆధారిత తయారీకేంద్రాలు, ఔషధ ఉత్పత్తి, సమాచార సేవలు, పర్యాటకం వంటి అనేక రంగాలలో అపారమైన అవకాశాలు ఉన్నప్పటికీ, ఇవి పూర్తిస్థాయిలో విని యోగం కావడంలేదు. ఇతరరాష్ట్రాల్లో గుజరాత్ చేపట్టిన వైభవ గుజరాత్", మధ్యప్రదేశ్ నిర్వహిస్తున్న 'పెట్టుబడిదారుల మహాసభ' వంటి కార్యక్రమాలు రాష్ట్ర బ్రాండ్ ప్రతిష్టను పెంచి, దేశ విదేశీ పెట్టుబడులనుఆకర్షించాయి. ఇదేనమూనాలో తెలుగురాష్ట్రాలు కూడా విశాలస్థాయిపెట్టుబడిసభలను ప్రతీసంవత్సరం నిర్వహించాలి. ఇలాంటి సభలు కేవలం అధికారుల ప్రసంగాలు, ప్రదర్శనలు మాత్రమే కావు. పెట్టుబడి ఒప్పందాల్లో కేవలం పరిశ్రమ స్థాపనకే ప్రాధాన్యం ఇవ్వకుండా, స్థానిక ప్రజల సామర్థ్యాన్ని పెంచే విధంగా నిబంధనలు చేర్చాలి.

-డా॥ సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### పునర్జీవం పొందుతున్న ప్రజాకళ

ఆదిలాబాద్ జిల్లాలో ప్రజా కళారూపమైన జడ్కొప్పులాట మళ్లీ ప్రాణం పోసుకుంటుండడం సంతోషకరమైన పరిణామం. ఈ కళ కేవలం వినోదం మాత్రమేకాదు,గ్రామీణ జీవన విధానానికి అద్దం పట్టే ఒక విలువైన సాంస్కృతిక సంపద. పాత కాలంలో ఈ కళారూపం ద్వారా ప్రజలకు విద్య, సామాజిక సందేశాలు, నైతిక బోధనలు అందించేవారు. కానీ నేటి ఆధునిక కాలంలో యువతలో మొబైల్ ఫోన్లు,సినిమాలు,సోషల్ మీడియా వంటి ఆధునిక వినోదాల ప్రభావం పెరిగింది. దీని ఫలితంగా జడ్కొప్పులాటలాంటి సాంప్రదాయ కళలు క్రమంగా మరుగున పడుతున్నాయి. పాతకళాకారులు చెబుతున్నట్టుగా, కొత్త తరం ఈ కళల పట్ల ఆసక్తిచూపకపోవడం ఆందోళన కలిగించే విషయం.

-తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### లెంకలగడ్డ లో ప్రకృతి విలయ తాండవం

ప్రకృతి బీభత్సానికి జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ ఉమ్మడి మండలంలోని లెంకలగడ్డ గోదావరి అటవీ ప్రాంతంలో చెట్లు, మిర్చి,పత్తిపంటలకు భారీనష్టం వాటిల్లింది. మంగళవారం సాయంత్రం లంకలగడ్డ సమీపంలోని గోదావరి వద్ద ఒక్కసారిగా సుడిగాలి బీభత్సం సృష్టించింది. సుమారు 4గంటలపాటు గాలి రావడంతో అటవీ ప్రాంతంలో చెట్లు నేల కొరిగాయి. వందలఎకరాల్లోపత్తి, మిర్చిపంటలకునష్టంవాటిల్లింది.

-కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఆధ్యాత్మిక ముసుగులో నకి'లీలలు'

**పెద్దపెద్ద అధికారులు, రాజకీయనేతలె కాళ్లమీద పడి మొక్కుతుంటే మనమెంత అని సామాన్యులు కూడా క్యూలు కడుతున్నారు. వారికెక్కడలేని ప్రాధాన్యత సంతరించుకుంటున్నది. సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. ఏదిఏమైనా కుల,మత, వర్గ, వైషమ్యాలతో విచ్ఛిన్నకర విపరీత ఆలోచనా విధానాలు, కక్షలు, కార్పణ్యాలు, స్వార్థంతో అతలాకుతలమై అట్టుడికిపోతున్న మానవ హృదయ కుహరాల నుండి తమస్సును తరిమికొట్టి మనస్సును నింపి మనిషి మనిషిగా మనగలగడానికి మార్గోపదేశం చేసే అత్యంత పవిత్రమైన గౌరవప్రదమైన స్వామిజీల వ్యవస్థలోకి ఇలాంటి చీడపురుగులు ప్రవేశించడం అత్యంత విచారకరం, బాధాకరం. ఈ విషయంలో పాలకులు మనస్సు పెట్టాలి. మోసపోయిన బాధితులు ఫిర్యాదు చేసిన తర్వాత పోలీసులు రంగప్రవేశం చేసే కంటే ముందుగానే నిఘా ఏర్పాటు చేసి పటిష్టమైన చర్యలు చేపట్టాలి. ఇలాగే కొనసాగితే మొత్తం ఈ వ్యవస్థ మీదనే నమ్మకాలు సన్నగిల్లుతాయి.**

దామెర్ల సాయిబాబ

సర్వమానవులు నిత్యం జీవన పోరాటంలో ఏదో విధమైన మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటుంటారు. ఎండకు ఎండని, వానకు తడవని మానవుడు ఎలా ఉండడో కోరిక లేని మనిషి లేడనే చెప్పొచ్చు. కోరికలు పెరిగే కొద్దీ మన శ్శాంతి కరవుకాక తప్పదు. వారివారి స్థాయిని బట్టి, అవసరాలను బట్టి, ఈ కోరికలు పెరుగుతుంటాయి. అందుకే అంటారు 'ధనము కలిగిన వానికి ధనము దాచుట రంధి (వ్యధ)ధనము లేకున్ననూ పొట్టరంధి, సంతుకలిగిన వానికి సాదలేకనూ రంధి, సంతులేకున్న చాలా రంధి... అలా రకరకాల సమస్యలతో కోరికలతో మనశ్శాంతి కరవైన పరిస్థితుల్లో ఆధ్యాత్మికం, భక్తి, ముఖ్యంగా స్వామిజీ ఉపన్యాసాలు, ప్రవచనాలతో తమ తమ సమస్యలకు పరిష్కారం దొరికి కొంతైనా ప్రశాంతత లభిస్తుందనే ఆశతో స్వామిజీలను, బాబాలను ఆశ్రయిస్తున్నారు. ఇటీవల కాలంలో ఈ సంస్కృతి రానురాను పెరిగిపోతున్నది. అయితే భారతీయ ఆధ్యాత్మిక వాహినిలో స్వామిజీలు, గురువుల పాత్ర మహోన్నతమైనది. 'నిధి చాలా సుఖమా! రాముని సన్నిధి చాలా సుఖమా అంటూ ప్రశ్నించి రాముడి పదసన్నిధి వైభవాన్ని కీర్తనలుగా పాడి తాను తరించి కోట్లాది ఆధ్యాత్మిక హృదయాల్లో త్యాగయ్య చిరంజీవిగా నిలిచారు. అలాగే వేలాది కీర్తనలతో తిరుమలేశుని సేవలో అన్నమయ్య తరించారు. ఏ భక్తుడి చరిత్రచూసినా మనలను తరింప చేసేందుకు జన్మించిన మానవ మూర్తులుగా వారు సాక్షాత్కరిస్తారు. ఇలాంటి తులసీవనంలో గంజాయి మొక్కలు కూడా మొలకెత్తడం మన గ్రహచారం, దురదృష్టకరం. స్వామిజీల ను ఆశ్రయించి తమ సమస్యల పరిష్కారం కొరకు అన్వేషించే అమాయకులను లక్ష్యంగా చేసుకొని కొందరు స్వార్థపరులు స్వామిజీల అవతారం ఎత్తి ప్రజలను మోసం చేయడమేకాక చేయరాని, చేయకూడని పనులు చేస్తున్నారు. అందరు స్వామిజీలు, బాబాలు అలా చేస్తున్నారని చెప్పడం లేదు. త్రికరణశుద్ధిగా దైవాన్ని నమ్ముతూ, ఆధ్యాత్మిక ప్రసంగాలు చేసే స్వామిజీ లు ఎందరో ఉన్నారు. కానీ ఈ నకిలీ ఆధ్యాత్మిక గురువుల సంఖ్య రానురాను పెరిగిపోతుండడం ఆందోళన కలిగించే విషయం. ఇది కూడా ఒక వ్యాపారంగా మారిపోయింది. పెద్దగా పెట్టు బడి లేకుండా కుబేరులుగా మారడానికి ఇవి దగ్గర దారిగా ఎంచుకుంటున్నారు. దీనికి కావల్సిందల్లా ప్రజానమ్మకం, విశ్వాసం, బలహీనతలే. అవే పెట్టుబడులు. ప్రజల బలహీ నతలను, నాడిని పట్టుకొని విశ్వాసం కలిగిం చగలిగితే కనక వర్షం కురిసినట్లే. దీనికి కనీస అర్హతలంటూ ఏమీలేవు. వయసుతో నిమిత్తం లేదు. రాత్రికి రాత్రేకాషాయ వస్త్రాలు ధరించి, తెల్లవారే సరికి స్వామిజీలుగా, బాబాలు గా అవతారం ఎత్తవచ్చు. చిన్న పరిశ్రమ పెట్టాలన్నా, మరే చిన్నదుకాణం ఏర్పాటు చేసుకోవాలనుకున్నా ఎన్నో లైసెన్సులు, అనుమతులు, మరెందరో అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తుంది. దీనికి అలాంటి ఇబ్బందులు లేవు. అనుమతులు కానీ, లైసెన్సులు కానీ అవసరంలేదు. నాయకులనో, అధికారులనో తమ దారికి మళ్లించుకోగలిగితే ప్రభుత్వపరంగా రాయితీలపై భూములు పొందవచ్చు. అందుకే దేశవ్యాప్తంగాఎక్కడపడితే అక్కడ బాబాలు,స్వామి జీలు వెలుస్తున్నారు. కొన్ని గ్రామాల్లో అయితే కనీసం తమ పేరును కూడా రాసుకోలేనివారు కాషాయ వేషధారణతో ఏవోచెప్పి ప్రజలను నమ్మిస్తున్నారు. దక్షిణతాంబూలాలతో పాటు పాదపూజలు చేయించుకుంటున్నారు. అలాంటి వారు కొందరు చేసే వికృతచేష్టలు అమాయక గ్రామీణుల ప్రాణాల మీదకు తెస్తున్నాయి. తమ మంత్రాలతో రోగాలను నయం చేస్తామంటూ కిందపడేసి తొక్కడం,వాతలు పెట్టడం,ఇష్టాను సారంగా కొట్టడం, ఒక్కటేమి

### ఒక్క మాట

టి వారికి తోచిన ఆటవిక చర్యలన్నీ చేస్తున్నారు. ఇదంతా చిన్న,ఛోటా స్వాముల లీలలు. ఏదైనా సంఘటన జరిగి ఫిర్యాదు అందితే పోలీసులు రంగప్రవేశం చేసి కేసులు పెట్టి అరెస్టు చేయడం,ఆ తర్వాత మరిచిపోవడం సాధారణమైపోయింది. కొందరు స్వామిజీలు ఆ ప్రాంతాన్ని వదిలి మరో ప్రాంతానికి వెళ్లి కొత్త పేరుతో నూతన అవతారం ఎత్తి వ్యాపారాన్ని సాగించుకుంటున్నారు. ఇక బడాస్వాముల సంగతే వేరు.వారి కార్యకలాపాలు, సంపాదన, కూడబెట్టిన కోట్ల రూపాయల ఆస్తులు చూస్తుంటే ఆశ్చర్యం కలగక తప్పదు. వారు సల్పుతున్న రాసలీలు, అమ్మాయిల ఎగుమతులు, గంజాయి, కొకైన్ వంటి మాదక ద్రవ్యాల వ్యాపారంతదితరాలు బయటపడుతుంటే 'ఛీ'వీరా మనస్వాములు? వీరికా ఇంతకాలం మనం పూజలు చేసిం ది అంటూ వారి భక్తులే ఛీదరించుకుంటున్న సంఘటనలు వెలుగు చూస్తున్నాయి. ఎందరో స్వామిజీలు కేసులను ఎదుర్కొంటున్నారు. మరికొందరు జైళ్లల్లో కాలం గడుపుతున్నారు. మొన్న సెప్టెంబరులో పేరుమోసి తనకు తానుగా దైవస్వరూపంగా ప్రకటించుకుంటున్న స్వామిజీని ఆగ్రాలో పోలీసులు అరెస్టు చేశారు. తన ఆధ్వర్యంలో నడుస్తున్న విద్యాసంస్థలో ఉన్న మహిళా విద్యార్థులను లైంగిక వేధిం పులకు గురిచేశారనే ఆరోపణపై ఈ అరెస్టులు జరిగాయి. రాజస్థాన్‌లో మరొక ప్రముఖ గురువు న్యాయవిభాగం విద్యార్థినిని మానభంగం చేశారనే కేసులో అరెస్టు అయ్యా రు. మరొకస్వామిజీ చేసిన నేరాలకు జీవితఖైదు శిక్షను అనుభవిస్తూ జైలులోనే మరణించారు. ఇలా చెప్పుకుంటూ పోతే దైవభక్తి ముసుగులో ఎందరో ఇలాంటి అరాచకాలు, అత్యాచారాలు చేసినట్లు తెలుస్తుంది. అంతకుముందు కూడా ఎందరో స్వామిజీలు ఇలాంటి కార్యక్రమాలు చేసి జైళ్లకు వెళ్లిన సందర్భాలున్నాయి. దేశరాజధాని ఢిల్లీలో పేరొందిన ఒక స్వామిజీని ఆరుగురు యువతులతో రెడ్‌హ్యాండెడ్‌గా పోలీసులు పట్టుకున్నారు. ఈ ముసుగులో ఆయన దాదాపు రెండువందల మంది అందమైన యువతులను విలాసవంత మైన హోటళ్లకు సరఫరా చేసేవారని పోలీసుల దర్యాప్తులో వెల్లడయింది. ఆయన చరిత్రను ఒకసారి పరిశీలిస్తే స్వామిజీ వేషంలో ఎంత సులభంగా మోసంచేసి కోట్లాది రూపాయలు ఆర్జించవచ్చో ఆచరణలో చేసి చూపించారు. ఉత్తరప్రదేశ్ లోని ఒక కుగ్రామం నుంచి కట్టుబట్టలతో ఢిల్లీకి వచ్చిచాలా సంవత్సరాలపాటు ఒక హోటల్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేశారు. ఆ తర్వాత కొంతకాలం మసాజ్ సెంటర్‌లో పనిచేసి అవేమీ అంత లాభదాయకంగా లేకపోవడంతో స్వామిజీ అవతారం ఎత్తారు. అంతే ఆయన స్టార్ తిరిగిపోయింది. పదేళ్ల తిరగకుండానే వందల కోట్లకు అధిపతి అయ్యాడు. ఒకటి,రెండు సార్లు పట్టుబడినా తన పలుకుబడిని, డబ్బును ఉపయోగించి బయటపడ్డాడు. ఇక తమిళనాడులో ఒక స్వామిజీ పదమూడు మానభంగాలు, ఒక హత్యనేరం కింద జైలుపాలయ్యారు. తెలుగురాష్ట్రాలకు సంబంధించి మరొక స్వామిజీ నకిలీ నోట్లు, నీలిచిత్రాలతో పట్టుబడ్డాడు. ఇలా చెప్పుకుంటూపోతే ఎందరినో ఉదహరించ వచ్చు. ఇవన్నీ పోలీసుల దృష్టికి వచ్చిన నకిలీ స్వాముల లీలలు. మూడోకంటికి తెలియకుండా, తెలిసినా బయటపడ కుండా నిరాటంకంగా సాగుతున్న ఈనకిలీ స్వామిజీల అరా చకాలు మరెన్నో ఉండొచ్చు. ఇక అన్నింటికంటే ముఖ్యంగా దురదృష్టకరమైన విషయం ఏమిటంటే కొందరు నాయకులు అధికారులు ముఖ్యంగా పోలీసు అధికారులు ఇలాంటివారికి భక్తులుగా మారి ప్రదక్షిణలు, పాదపూజలు చేయడంతో సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. నమ్మకం, విశ్వా సం, శ్రద్ధాశక్తులు అనేది పూర్తిగా వారి వారి వ్యక్తిగతం. అందులో మరో అభిప్రాయానికి తావులేదు. వారికి ఎలాంటి ఉద్దేశ్యాలు ఉండకపోవచ్చు. కానీ వారి రాకను,వారికి చేసే పూజా కార్యక్రమాలను ముందుగానే మీడియాకు తెలిపి విస్తృతప్రచారం చేసుకుంటున్నారు. కొన్ని ఆశ్రమాల్లో దేవుని ఫోటోల కంటే ఈ అధికారులు, మరికొందరు నాయకులు వారికి చేసేపాదపూజ కార్యక్రమాల ఫోటోలతో ఆశ్రమమంతానింపేస్తున్నారు. సామాన్యుల్లో విశ్వాసం పెంచేందుకు వీటిని ఎంతగానో ఉపయోగించుకుంటున్నారు. పెద్దపెద్ద అధికారులు, రాజకీయ నేతలే కాళ్లమీద పడి మొక్కుతుంటే మనమెంత అని సామాన్యులు కూడా క్యూలు కడుతున్నారు. వారికెక్కడలేని ప్రాధాన్యత సంతరించుకుంటున్నది. సమాజంపై తీవ్రప్రభావం చూపుతున్నది. ఏదిఏమైనా కుల,మత, వర్గ, వైషమ్యాలతో విచ్ఛిన్నకర విపరీత ఆలోచనా విధానాలు, కక్షలు, కార్పణ్యాలు, స్వార్థంతో అతలాకుతలమై అట్టు డికిపోతున్న మానవ హృదయ కుహరాలనుండి తమస్సును తరిమికొట్టి మనస్సును నింపి మనిషి మనిషిగా మనగలగడానికి మార్గో పదేశం చేసే అత్యంత పవిత్రమైన గౌరవప్రదమైన స్వామిజీలవ్యవస్థలోకి ఇలాంటి చీడపురుగులు ప్రవేశించడం అత్యంత విచారకరం, బాధాకరం. ఈ విషయంలో పాలకులు మనస్సు పెట్టాలి. మోసపోయిన బాధితులు ఫిర్యాదు చేసిన తర్వాత పోలీసులు రంగప్రవేశం చేసేకంటే ముందుగానే నిఘాఏర్పాటు చేసి పటిష్టమైన చర్యలు చేపట్టాలి. ఇలాగే కొనసాగితే మొత్తం ఈ వ్యవస్థ మీదనే నమ్మకాలు సన్నగిల్లుతాయి. ●

# భావితరాల సంపూర్ణ వికాసానికి ఉద్యాన వన సేవ!

మెరుగు భాస్కరయ్య

ఈ పంచ అభివృద్ధి ప్రక్రియలో పారిశ్రామికీకరణ, పట్టణీకరణ, యాంత్రీకరణ, పల్లెల నుంచి పట్టణాలకు వలసల ఫలితంగా వాతావరణంలో పెనుమార్పులు సంభవిస్తున్నాయి. ఉష్ణోగ్రతలు పెరగడం, కరవు పరిస్థితులు, అకాల వర్షాల వల్ల వ్యవసాయం కుంటుపడుతోంది. గ్రామాల్లో వ్యవసాయం చేసే వారి సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. వీటికి తోడు నేటి యువతలో పర్యావరణం, ఆహారం, ఆరోగ్యం పట్ల అవగాహనలోపం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ పరిస్థితి నుంచి భావితరాలను కాపాడటానికి పాఠశాల స్థాయి నుంచే పిల్లలను సన్నద్ధం చేయాలి. పర్యావరణం,ఆహారం, ఆరోగ్యానికిగల సంబంధాన్ని పిల్లలకు అర్థమయ్యేలా నేర్పించాలి. పాఠశాలల్లో తోటల పెంపకాన్ని పాఠ్యాంశంగా చేర్చడంవల్ల ఈ బృహత్తరకార్యాన్ని నెరవేర్చవచ్చు. ఈ కార్యక్రమాన్ని నేడు అన్ని ఉన్నతపాఠశాలల్లో అమలు చేయాల్సిన అవసరం ఉంది. విద్యార్థులను క్లాసుల వారీగా లేదా బృందాల వారీగా విభజించాలి. తరగతి గదులకు దూరంగా ఒక చోట గుంతను తీసి పాఠశాల ఆవరణను శుభ్రపరచగా వచ్చిన చెత్త, వ్యర్థ పదార్థాలను పోగుచేసి ఈ గుంతల్లో వేసి కంపోస్టు ఎరువు తయారు చేయాలి. ఈ విధానాన్ని విద్యార్థులకు కూడా వివరించాలి. పాఠశాల ఆవరణలో నీటి ఆధారం ఉన్నచోట నర్సరీని ఏర్పాటు చేయాలి. నర్సరీలో పెంచిన మొక్కలను పాఠశాల ఆవరణలో విద్యార్థులతో నాటించాలి. వీటిలో నీడనిచ్చే చెట్లు, అలంకరణ చెట్లు, కూరగాయ లు, పండ్లు, పూల చెట్లు మొదలైనవి ఉండేలా చూడాలి. వాటి ఉపయోగాలను విద్యార్థులకు



తెలియజెప్పాలి. ఈ మొక్కలకు కంపోస్టు గుంతలో తయారు చేసిన ఎరువును వేయాలి. పాఠశాల ఆవరణలో పెంచుతున్న చెట్లకుఅవసరం మేరకు నీరు పెట్టాలి. చెట్లు పెరిగే వివిధ దశల గురించి కూడా విద్యార్థులకు తెలియజెప్పాలి. మొక్కల పెంపకంలో వివిధ దశలైన నేలతయారీ, విత్తనం, ప్రవర్ధనం, నారు పెంపకం, పూత, కోత మొదలైనవి విద్యార్థులకు వివరించి చెప్పాలి. పర్యావరణ పరిరక్షణ కాలుష్య నివారణ, ఆహారం, ఆరోగ్యంలో మొక్కల పాత్రను విద్యార్థులకు వివరించాలి. విద్యార్థులకు తోటపని చేయడం ద్వారా పనిపైగౌరవం (డిగ్నిటీ ఆఫ్ లేబర్) అలవడుతుంది. పరస్పర సహకారంతో సంఘటితంగా పనిచేయడం విద్యార్థులకు అలవాటవుతుం ది. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరిగి దేనినైనా చేయగలమనే సామర్థ్యం సమకూరుతుంది. సహనం నిశిత పరిశీలన అల వాటవుతుంది. పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధంపై అవగా హన పెరుగుతుంది. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివార ణపై అధ్యయనానికి వీలు కలుగుతుంది. జీవశాస్త్రంలో వివిధ అంశాలను నేరుగా పరిశీలించేందుకు సహజ ప్రయోగశాలలుగా తోటలు ఉపయోగపడతాయి. ఆరోగ్యం,సంతులిత ఆహా రం పట్ల అవగాహన పెరుగుతుంది. విద్యార్థుల్లో మొక్కల పెంపకం, పంటల సాగుపై ఆసక్తి పెరుగుతుంది. పాఠశాల ఆవరణలు పరిశుభ్రంగా ఉండి విద్యాభివృద్ధికి దోహదపడుతుంది. విద్యార్థుల సంపూర్ణ వికాసానికి ఉపయోగకరంగాఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లోని ఉన్నత పాఠశాలలన్నింటిలోనూ ఈ కార్యక్రమాన్ని చేపట్టి, అమలుకు అవసరమైన సాంకేతిక సూచనల కోసం మండల స్థాయిలో వ్యవసాయ, ఉద్యానవన, అటవీ శాఖ అధికారుల సహాయసహకారాలు పొందవచ్చు. ●

# తిరుమల దర్శనాల్లో ఆన్‌లైన్ ఆధిపత్యం

అప్పన్న గొనప

తిరుమలలో సాధారణ భక్తుల కష్టాలు పెరుగుతున్నాయి. కరోనా మహమ్మారి అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అనేక మార్పులు తీసుకువచ్చింది. భక్తుల సౌకర్యం కోసం అని చెప్పుకుంటూ, దాదాపు అన్ని దర్శన టిక్కెట్లు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే అందుబాటులో ఉంచారు. కానీ ఈ నిర్ణయం అనుకోకుండా వేలాది మంది సాధారణ భక్తులకు ఇబ్బందులను తెచ్చిపెడుతోంది. ముఖ్యంగా వయోవృద్ధులు, దివ్యాంగులు, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు,ఆన్‌లైన్ వేదికలను సరిగ్గా వినియోగించలేని వారు ఇప్పుడు పూర్తిగా దర్శన అవకాశాల నుండి దూరమవుతున్నారు. టీటీడీ వెబ్‌సైట్‌లో సర్వర్ సమస్యలు, టిక్కెట్ స్లాట్లు క్షణాల్లో ఖాళీకావడం,మోసపూరిత వెబ్‌సైట్లు పెరుగుతుండడం వంటి అంశాలు ప్రజలలో తీవ్ర ఆవేదన కలిగిస్తున్నాయి. తిరుమలలో ఇప్పటికీ సీనియర్ సిటిజన్లకు, దివ్యాంగులకు ఆఫ్‌లైన్ దర్శనం ప్రారంభం కాలేదు. గతంలో ఈ రెండు వర్గాలకు ప్రత్యేకంగా కౌంటర్లు ఉండేవి. భక్తులు తాము నిర్దేశిత సమయానికి వచ్చి స్వామివారి దర్శనం చేసుకునే సౌలభ్యం ఉండేది. కానీ ప్రస్తుతం ఆ అవకాశమూ లేదు. జిల్లా కేంద్రాలలో ఏర్పాటు చేసిన టీటీడీ ఈ దర్శన్ కౌంటర్లు కూడా నెలలుగా మూతపడ్డాయి. ఇది గ్రామీణ ప్రజలకు పెద్ద దెబ్బగా మారింది. ఎందుకంటే వారు ఆన్‌లైన్ రిజర్వేషన్లకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడం, డెబిట్ లేదా క్రెడిట్ కార్డు లేని పరిస్థితుల్లో తమకు దర్శన టిక్కెట్ పొందడం అసాధ్యమవుతోంది. ఈ దర్శన్ కేంద్రాలు తిరిగి ప్రారంభిస్తే ఈ వర్గాల భక్తులకు కొంత ఉపశమనం కలిగే అవకాశం ఉంది. కానీ ఇప్పటి వరకు వాటిని పునఃప్రారంభించాలన్న ఎటువంటి చర్యలూ కనిపించడం లేదు. టీటీడీ అధికారుల వాదన ప్రకారం ఆన్‌లైన్ విధానం పారదర్శకత కోసం అని చెబుతున్నారు. కానీ వాస్తవంలో, దాని వల్ల సామాన్య ప్రజల చేరికకు అడ్డంకులు ఏర్పడ్డాయి. ప్రతి నెల టిక్కెట్ కోటాలు విడుదలవగానే, కొద్దిసేపులోనే అన్ని స్లాట్లు పూర్తవుతున్నాయి. ఫలితంగా సాధారణ భక్తుడు స్వామివారి దర్శనం కోసం నెలల తరబడి ఎదురు చూడాల్సి వస్తోంది. ఇంటర్నెట్ వసతులు సరైన రీతిలో లేని గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ఈ విధానం పెద్ద భారమవుతోంది. తిరుమల శ్రీవారి సేవ అంటే భక్తి, అనుభూతి, సమర్పణ. కానీ ఇప్పుడు అది ఒక డిజిటల్ పోటీగా మారింది. ప్రతిరోజు



లక్షలాది మంది భక్తులు తిరుమల వెళ్లాలని ఆశపడుతున్నారు. కానీ టిక్కెట్ లేకపోవడం వల్ల చాలా మంది భక్తులు తిరుపతిలోనే ఆగిపోవలసి వస్తోంది. కొందరు ఆలయంలో ఉన్న లడ్డూ ప్రసాదం తీసుకుని తిరిగి వెళ్లిపోతున్నారు. భక్తుల భావాలను, వారి ఆకాంక్షలను గౌరవించడం దేవస్థానం ప్రధాన బాధ్యత. కానీ ఇప్పుడు అది కేవలం సాంకేతిక వ్యవస్థల ఆధారంగా నడుస్తోంది. సీనియర్ సిటిజన్ల విషయానికి వస్తే, వీరికి నడకలో, క్యూలైన్‌లో నిలబడటంలో ఇబ్బందులు ఉంటాయి. గతంలో ప్రత్యేక దర్శన సమయాలు ఇవ్వడం వలన వారు సౌకర్యంగా దర్శనం చేసుకునే వారు. ఇప్పుడు వారిని కూడా ఆన్‌లైన్ పోటీకి దిగమంటున్నారు. ఇది మానవతా విలువలకు విరుద్ధంగా ఉంది. దివ్యాంగులకు కూడా ఇదే పరిస్థితి. వారు ప్రత్యేక ప్రవేశ ద్వారం ద్వారా వెళ్లే అవకాశం లేకపోవడంతో తిరుమల యాత్రకు వెళ్ళడమే ఒక సవాల్‌గా మారింది. ఈ పరిస్థితులు టీటీడీ ప్రతిష్ఠకు అనుకూలం కావు. ఆలయ వ్యవస్థ అంటే కేవలం ఆర్థిక నిర్వహణకాదు, భక్తుల భావోద్వేగాలను కూడా గౌరవించడం అవసరం. గతంలో ఆఫ్‌లైన్ విధానంలో కూడా పారదర్శకతతో వ్యవహరించిన అనేక సందర్భాలు ఉన్నాయి. భక్తులు రాత్రి క్యూలైన్లలో నిలబడి అయినా స్వామిని దర్శించేవారు, అది వారికి భక్తి పరాకాష్టగా అనిపించేది. ప్రస్తుతం డిజిటల్ ఆధారిత టిక్కెట్ విధానం వల్ల మధ్య తరగతి, పేద ప్రజలు వెనుకబడుతున్నారు. ఆన్‌లైన్ ద్వారా టిక్కెట్లు పొందే వారు ప్రధానంగా నగరాల వారే. గ్రామాల్లోని వృద్ధులు, రైతులు, రోజువారీ కూలీలు ఈ వ్యవస్థలో స్థానం లేకుండా పోతున్నారు. ప్రభుత్వాల, దేవస్థానాల ప్రాధాన్యత భక్తులకు సమాన అవకాశాలు కల్పించడంలో ఉండాలి కానీ సాంకేతిక పరిమితులు పెంచడంలో కాదు. టీటీడీ ఈ సమస్యను సీరియస్‌గా తీసుకోవాలి. తిరిగి జిల్లా కేంద్రాలలో ఈదర్శన్ కౌంటర్లను ప్రారంభించడం అత్యవసరం. అలాగే సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు, గ్రామీణ ప్రాంతాల భక్తుల కోసం ప్రత్యేకంగా ఆఫ్‌లైన్ కోటాలను కేటాయించాలి. భక్తుల ప్రవాహం పెరిగిందని చెప్పి అందరికీ ఒకే విధమైన డిజిటల్ విధానాన్ని రుద్దడం న్యాయబద్ధం కాదు. భక్తి అంటే నమ్మకం. ఆ నమ్మకం సాంకేతిక సౌకర్యాలతో కాదు, అనుభూతితో పెంపొందుతుంది. తిరుమల శ్రీవారి దర్శనం ప్రతి ఒక్కరికీ సమానంగా లభించాలనే దైవ ధర్మాన్ని టీటీడీ గుర్తుంచుకోవాలి. ఈ భూమ్మీద ఎంత ఆధునికత వచ్చినా, భక్తుడి కన్నీరు, మనసులోని వినయమే దైవానికి దగ్గర చేస్తాయి. ఆ భక్తిని కంప్యూటర్ స్క్రీన్ ముందు నిలబెట్టకూడదు. అందువల్ల తిరుమలలో సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు, గ్రామీణ ప్రజల కోసం ఆఫ్‌లైన్ దర్శనాలను తిరిగి ప్రారంభించాలి. ఈదర్శన్ కేంద్రాలను పునఃప్రారంభించి ప్రతి జిల్లాలో టిక్కెట్లు సులభంగా అందుబాటులో ఉంచాలి. టీటీడీకి భక్తుల నమ్మకం అంటే దైవం ఇచ్చిన విశ్వాసం. ఆ విశ్వాసం కాపాడటం వారి ప్రధాన కర్తవ్యం కావాలి. ●



# మీరు ప్రశాంతంగా రిటైర్ కాలేరు

**- బీహార్ ఎన్నికల సభలో సిఇసిపై ప్రియాంక గాంధీ హెచ్చరికలు**

**పాట్నా, నవంబరు 7:** ఎఐసిసి ప్రధాన కార్యదర్శి, వయనాడ్ ఎంపి ప్రియాంక గాంధీ నేరుగా కేంద్ర ఎన్నికల సంఘంను లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు. సిఇసి జ్ఞానేష్ కుమార్ పేరు ప్రస్తావిస్తూ, మీరు ప్రశాంతంగా పదవీ విరమణ చేయలేరంటూ హెచ్చరికలు చేశారు. రీగాలో శుక్రవారం ఎన్నికల సభలో ప్రియాంక గాంధీ మాట్లాడుతూ... "జ్ఞానేశ్ కుమార్.. మీరు ప్రశాంతంగా రిటైర్ అవుతారని అనుకుంటున్నారేమో.. అది జరగదు. జ్ఞానేశ్ కుమార్ పేరును మరిచిపోవద్దని ప్రజలకు చెప్పదలచుకున్నా"ను అని అన్నారు. జ్ఞానేశ్ కుమార్‌తో పాటు ఇద్దరు ఇసిలు ఎస్ఎస్ సంధు, వివేక్ జోషి పేర్లను కూడా గుర్తుపెట్టుకోవాలని ప్రియాంకగాంధీ ప్రజలను కోరారు. ఈ సందర్భంగా "చోర్ చోర్" అంటూ ప్రియాంక మద్దతుదారులు నినాదాలు చేయడం కనిపించింది. హర్యానా ఎన్నికల్లో ఓట్ల అవకతవకలకు పాల్పడ్డారని, ప్రజలు తమకు జరిగిన మోసాన్ని మరిచిపోరని ప్రియాంక అన్నారు. ఇందులో ప్రమేయమున్న జ్ఞానేశ్ కుమార్, ఎస్ఎస్ సంధు, వివేక్ జోషిలు ప్రశాంతంగా రిటైర్ అవుతామని అనుకుంటే పొరపడినట్టేనని పేర్కొన్నారు. కాగా, ప్రియాంక గాంధీ వ్యాఖ్యలపై రాజకీయ విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల ప్రక్రియ జరుగుతుండగా ఎన్నికల అధికారులను బెదిరించడంలో ఔచిత్యాన్ని ప్రశ్నిస్తున్నారు. రాజకీయ ప్రసంగాల పరిధి ఏమేరకు ఉండవచ్చనే దానిపై రాజకీయ వర్గాల్లో విస్తృతంగా చర్చ జరుగుతోంది.

# బీహార్‌లో ఎన్డీయే గెలుపు ఖాయం

**- మా ట్రాక్ రికార్డును నమ్మే రికార్డు స్థాయి పోలింగ్, - ఆర్‌జెడి, కాంగ్రెస్ పాలనలో రెడ్ టెర్రర్, - ఎన్‌డిఎ వచ్చాకే నక్సల్ హింసాకాండకు విముక్తి, - ఔరంగాబాద్ ఎన్నికల సభలో ప్రధాని మోడీ**

**పాట్నా, నవంబర్ 7:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల మొదటి దశ పోలింగ్‌లో రికార్డు స్థాయిలో ఓటింగ్ నమోదైందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రస్తావిస్తూ, ఓటు హక్కును వినియోగించుకున్న ప్రతి ఓటరుకు ప్రత్యేకంగా అభినందిస్తున్నానని తెలిపారు. కేంద్రంలో, రాష్ట్రంలోని ఎన్‌డిఎ డబుల్ ఇంజినీర్డ్ ప్రభుత్వంపై ప్రజలలో పెరుగుతున్న విశ్వాసం, నమ్మకానికి నిదర్శనమన్నారు. అలాగే తనకు, ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌కు ఉన్న ట్రాక్ రికార్డు, తమ పట్ల ప్రజలకున్న నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు. జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్‌డిఎ) అఖండ విజయం సాధిస్తుందని మోడీ ధీమా వ్యక్తం చేశారు. ఔరంగాబాద్‌లో శుక్రవారం ఎన్నికల సభలో ప్రధాని మాట్లాడుతూ... "బీహార్ ప్రజలు అన్ని రికార్డులను బద్దలు కొట్టారు. స్వాతంత్రనయం తర్వాత రాష్ట్రంలో ఇది అతిపెద్ద పోలింగ్ శాతం. మొదటి దశలో దాదాపు 65శాతం ఓటింగ్ జరిగింది. బీహార్ యువత, రైతులు, మహిళలు బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఏను ఆశీర్వదించడానికి వస్తున్నారని ఇది చూపిస్తుంది" అని పేర్కొన్నారు. పెద్ద ఎత్తున ఓటర్లు తరలి వచ్చినందుకు భారత ఎన్నికల కమిషన్‌ను ప్రశంసించారు. ఆర్‌జెడి- కాంగ్రెస్ పాలనలో ఈ ప్రాంతంలో జరిగిన రెడ్ టెర్రర్ భయానకతను గుర్తు చేస్తూ, ఔరంగాబాద్ చాలాకాలంగా నక్సల్ హింసాకాండ ఎదురొనకందని, నితీశ్ కుమార్ నేతృత్వంలోని ప్రభుత్వం హయాంలోనే హింసాకాండ నుండి విముక్తి పొందిందని ప్రధాని మోడీ అన్నారు. "మోడీ- నితీశ్ ట్రాక్ రికార్డు ప్రజల ముందుంది. తాము ఏదైతే చెప్పానో అదే చేశా. రామాలయం నిర్మిస్తామన్నాం. అది జరిగిందా లేదా? 370వ అధికరణ కుప్పకూలుతుందని చెప్పాం. అది సాకారమైందా లేదా?" అని మోడీ ప్రశ్నించారు. నితీష్ కుమార్ సీఎంగా ఉన్న మొదటి తొమ్మిదేళ్ల కేంద్రం లోని కాంగ్రెస్- ఆర్‌జెడి ప్రభు త్వం ఆయనను పనిచేయనీయలేదని, 2014లో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత బీహార్ అభివృద్ధి కోసం మూడు రెట్లు అధికంగా నిధులు కేటాయించామని వివరించారు. మహాకూటమి ఎన్నికల మేనిఫెస్టోలో ఆర్‌జెడి ఇచ్చిన హామీలను కాంగ్రెస్ సైతం విశ్వసించడం లేదని అన్నారు. కాంగ్రెస్ బిహార్ అధ్యక్షుడిని ఆర్‌జెడి అవమానించిందని చెప్పారు. గత 35-40 ఏళ్లుగా ఎప్పుడూ గెలవని సీట్లను మాత్రమే కాంగ్రెస్‌కు ఆర్‌జెడి ఇచ్చిందన్నారు. పలుచోట్లు రెండు పార్టీలు



ఒకరిపై మరొకరు పోటీ చేస్తున్నాయని, సొంత సహచరులను నమ్మని వారు ఎవరికైనా ఎలా మేలు చేస్తారని ప్రధాని ప్రశ్నించారు. ఎన్‌డిఏ మేనిఫెస్టోను ప్రజలు విశ్వ సించారని, రాష్ట్రంలో లక్షలాది రిక్రూట్‌మెంట్లు తాము జరపడమే ఇందుకు కారణమని చెప్పారు. ఆర్‌జెడి, కాంగ్రెస్ ట్రాక్ రికార్డు ఏమిటో ప్రజలకు బాగా తెలుసునని, భూములకు ఉద్యోగాలిచ్చారన్నారు.

## టిఎంసి ఎంపికి తప్పని సైబర్ మోసం

### బ్యాంక్ ఖాతానుంచి రూ.50 లక్షలు స్వాహా

**న్యూఢిల్లీ, నవంబరు 7:** దేశంలో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. సొమ్ము కాజేసేందుకు నేరగాళ్లు కొత్త కొత్త దారులను వెతుక్కుంటున్నారు. సామాన్యులతోపాటూ సెలబ్రిటీలు కూడ వీరి ఉచ్చులో పడి రూ.లక్షలు పోగొట్టుకుంటున్నారు. తాజాగా ఓ ఎంపీ సైబర్ మోసానికి బలయ్యారు. ఆయన బ్యాంక్ అకౌంట్ నుంచి నేరగాళ్లు ఏకంగా రూ.50లక్షలు వరకూ కాజేశారు. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, నాలుగుసార్లు లోక్‌సభ ఎంపీ కల్యాణ్ బెనర్జీ సైబర్ మోసానికి బలయ్యారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఎంపీ ఖాతాను సైబర్ నేరగాళ్లు నకిలీ పత్రాలను ఉపయోగించి యాక్సెస్ చేశారు. నకిలీ పాన్, ఆధార్ కార్డులను ఉపయోగించి మోసానికి పాల్పడ్డారు. అకౌంట్ నుంచి ఏకంగా రూ.56లక్షలు కాజేశారు. ఈ సొమ్మును వివిధ ఖాతాలకు తరలించడం, ఏటీఎమ్ ద్వారా విత్‌డ్రా చేయడంతోపాటూ ఆభరణాల కొనుగోళ్లకు ఉపయోగించినట్లు తేలింది.



## భారత్‌నుంచి వచ్చిన ఫోన్‌కాలే ప్రాణాలు కాపాడింది!: షేక్ హసీనా

**ఢాకా, నవంబర్ 7:** బంగ్లాదేశ్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన అల్లర్లలో ముష్కరుల దాడి నుంచి కేవలం 20 నిమిషాల వ్యవధిలో ఆమె తప్పించుకుని సురక్షితంగా భారత్‌కు చేరుకున్నారు. ఆమె అక్కడి నుంచి తప్పించుకోవడానికి భారత్ నుంచి వచ్చిన ఫోన్ కాల్ కారణమని తెలుస్తోంది. ఆమె ప్రాణాలను కాపాడింది భారత్ నుంచి వచ్చిన ఫోన్ కాలేనని తెలియజేస్తూ ఒక పుస్తకం త్వరలో విడుదల కానుంది. ది స్టోరీ ఆఫ్ ఆన్ అన్‌ఫినిష్డ్ రెవెల్యూషన్ అనే పేరుతో రానున్న ఈ పుస్తకంలో పలు ఆసక్తికర విషయాలను పొందుపరిచారు. గత ఏడాది బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా జరిగిన ఘర్షణలు హింసాత్మకంగా మారాయి. ఆ నిరసనల్లో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. పరిస్థితులు తీవ్ర హింసాత్మకంగా మారడంతో అప్పటి ప్రధాని షేక్ హసీనా తన పదవికి రాజీనామా చేసి, దేశం విడిచి భారత్‌కు వచ్చారు. ఆమె అధికారిక భవనం గణభవన్ నుండి బయటకు వచ్చిన సరిగ్గా 20 నిమిషాలకు నిరసనకారులు అక్కడకు చొచ్చుకువచ్చారు. వారు రావడానికి ముందే ఆమె సురక్షితంగా బయటపడ్డారు. పరిస్థితులు అదుపు తప్పుతున్నప్పటికీ, తాను బంగ్లాదేశ్‌ను విడిచి వెళ్లబోనని షేక్ హసీనా కరాఖండీగా చెప్పినట్లు ఆ పుస్తకంలో పేర్కొన్నారు. ఆమెను బంగ్లాదేశ్ విడిచి వెళ్లేందుకు ఒప్పించాలని సోదరి రెహానా, అమెరికాలో ఉంటున్న ఆమె కుమారుడు వాజీద్‌కు బంగ్లా ఆర్మీ చీఫ్, ఎయిర్ ఫోర్స్, నేవీ చీఫ్‌లు సూచించినట్లు సమాచారం. నిరసనకారులు గణభవన్ వైపుకు దూసుకొస్తున్న సమయంలో హసీనా ప్రయాణించే విమానానికి తమ గగనతలంలోకి ప్రవేశించేందుకు భారత ప్రభుత్వం అనుమతి ఇచ్చింది ఆ పుస్తకంలో పేర్కొన్న వివరాల ప్రకారం, 2024 ఆగస్టు 4న మధ్యాహ్నం ఒకటిన్నర గంటలకు భారత్ నుంచి ఫోన్ కాల్ వచ్చిందని, ఆ ఫోన్ చేసింది హసీనాతో బాగా పరిచయమున్న ఒక ఉన్నతాధికారి అని తెలుస్తోంది. ఆ సంభాషణ చాలా క్లుప్తంగా ముగిసింది. ఇప్పటికే చాలా ఆలస్యమైందని, వెంటనే గణభవన్‌ను వీడకపోతే ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని ఆ అధికారి హసీనాను అప్రమత్తం చేశారని, భవిష్యత్తులో పోరాటం చేయడానికి ప్రాణాలతో ఉండటం ముఖ్యమని సూచించారని ఆ పుస్తకంలో పేర్కొన్నారు. ఆ మాటలకు షాక్ తిన్న హసీనా, బంగ్లాదేశ్‌ను వీడాలని నిర్ణయం తీసుకోవడానికి ఆ తర్వాత కూడా అరగంట సమయం తీసుకున్నారని ఆ పుస్తకంలో పేర్కొన్నారు. ఆ సందేశాన్ని పూర్తిగా విశ్వసించిన ఆమె, దేశం విడిచి వెళ్ళే ముందు తన ప్రసంగాన్ని రికార్డు చేయాలని భావించారని వెల్లడించారు. అయితే, ముష్కరులు ఏ క్షణమైనా లోపలకి చొచ్చుకు వచ్చే అవకాశం ఉండటంతో సైన్యాధికారులు ప్రసంగం రికార్డు చేయడానికి అంగీకరించలేదు. అనంతరం సోదరి రెహానా హసీనాను బలవంతంగా కారులో కూర్చోబెట్టారు. మధ్యాహ్నం 2.33 గంటల సమయంలో చాపర్ బంగ్లాదేశ్‌లో టేకాఫ్ అయి అరగంటలో భారత్‌లో దిగిందని, అప్పటి నుంచి ఢిల్లీలో ఆమెకు భారత ప్రభుత్వం ఆశ్రయం కల్పిస్తోందని ఆ పుస్తకం పేర్కొంది. ఆ రోజు భారత్ నుంచి ఫోన్ కాల్ రాకపోతే తన తండ్రి షేక్ ముజిబుర్ రెహమాన్‌లాగే హసీనా కూడా హత్యకు గురయ్యేవారని ఆ పుస్తకంలో ఆందోళన వ్యక్తం చేశారు.

# అహ్మదాబాద్ ప్రమాదంలో పైలట్ ఇన్ కమాండ్‌ను నిందించలేం

**పిటిషన్ విచారణలో సుప్రీం సంచలన వ్యాఖ్యలు**



**న్యూఢిల్లీ, నవంబరు 7:** అహ్మదాబాద్‌లో 260 మంది ప్రాణాలను బలిగొన్న ఎయిర్ ఇండియా విమాన ప్రమాద ఘటనలో పైలట్‌ఇన్‌కమాండ్‌ను నిందించలేమని సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ ఘటనకు సంబంధించి పైలట్ తండ్రి దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం, కేంద్ర ప్రభుత్వం, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ)లకు నోటీసులు జారీ చేసింది. ఎయిర్ ఇండియాకు చెందిన బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానానికి పైలట్‌ఇన్‌కమాండ్‌గా పనిచేసిన సుమీత్ సబర్వాల్ ఈ ప్రమాదంలో మరణించారు. ఆయన తండ్రి పుష్కరాజ్ సబర్వాల్, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ పైలట్స్ (ఎఫ్ఐపీ) ఈ ఘటనపై సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విమాన ప్రమాద దర్యాప్తు బ్యూరో (ఏఏఐబీ) ఈ ఏడాది జులైలో విడుదల చేసిన ప్రాథమిక నివేదికను వారు తమ పిటిషన్‌లో సవాల్ చేశారు. విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే రెండు ఇంజిన్లకు ఇంధన సరఫరా నిలిచిపోయిందని ఏఏఐబీ తన ప్రాథమిక నివేదికలో పేర్కొంది. రెండు ఫ్యూయల్ కంట్రోల్ స్విచ్‌లు ఒకదాని తర్వాత ఒకటి వేగంగా "కటాఫ్" పొజిషన్‌లోకి వెళ్లాయని తెలిపింది. సుమారు 10 సెకన్ల తర్వాత స్విచ్‌లను తిరిగి ఆన్ చేసినప్పటికీ, అప్పటికే ఇంజిన్లు ఆగిపోయి (ఫ్లేమ్డ్ అవుట్) విమానం కుప్పకూలిందని నివేదికలో వివరించింది. ఈ నివేదికతో విభేదిస్తూ పైలట్ తండ్రి, పైలట్ల సంఘం దాఖలు చేసిన పిటిషన్లను విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు, పైలట్‌ను నిందించలేమని వ్యాఖ్యానిస్తూ కేంద్రం, డీజీసీఏల నుంచి వివరణ కోరింది. ఈ కేసులో తదుపరి విచారణ జరగనుంది.

**సుఖోయ్ తయారీ పరిజ్ఞానం మొత్తం బదలీకి రష్యా సుముఖం**

# ఇక భారత్‌లోని హిందూస్థాన్ ఏరోనాటిక్స్‌లోనే జెట్‌ల తయారీ




**మాస్కో, నవంబరు 7:** భారత రక్షణ రంగం మరో కీలక మైలురాయిని చేరుకోబోతోంది. రష్యాకు చెందిన అత్యాధునిక ఐదో తరం స్టెల్త్ ఫైటర్ జెట్ ఎస్‌యు57 (సుఖోయ్57)ను భారీ ఎత్తున ఉత్పత్తి చేసే సామర్థ్యం హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)కు ఉందని రష్యా టెక్నికల్ బృందం నిర్ధారించింది. కేవలం ఉత్పత్తికి అనుమతి ఇవ్వడమే కాకుండా, సోర్స్ కోడ్‌లు సహా పూర్తి టెక్నాలజీని బదిలీ చేయడానికి కూడా రష్యా ముందుకొచ్చింది. ఈ ఒప్పందం ఖరారైతే, ప్రపంచంలోని అత్యంత శక్తిమంతమైన యుద్ధ విమానాల్లో ఒకటైన ఎస్‌యు57 ఇకపై భారత్‌లోనే తయారు కానుంది. సుఖోయ్ డిజైన్ బ్యూరో, ఇతర రక్షణ సంస్థలతో కూడిన రష్యా బృందం సెప్టెంబర్ నెలలో హెచ్ఏఎల్ సౌకర్యాలను సందర్శించింది. ఎస్‌యూ57ఈ యుద్ధ విమానాల దేశీయ ఉత్పత్తికి అవసరమైన మౌలిక సదుపాయాల్లో దాదాపు 50 శాతం ఇప్పటికే హెచ్ఏఎల్ వద్ద ఉన్నాయని ఈ బృందం తన నివేదికలో స్పష్టం చేసింది. హెచ్ఏఎల్ సుమారు 505 స్టెల్త్ జెట్లను తయారుచేయగలదని నివేదికలో పేర్కొన్నది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఢిల్లీ పర్యటనకు కొద్ది రోజుల ముందు ఈ నివేదికను సమర్పించడం ప్రాధాన్యత సంతరించుకుంది. పుతిన్ పర్యటనలోనే ఈ కీలక ఒప్పందంపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని భావిస్తున్నారు. గతంలో సుఖోయ్‌ఎస్‌యు30 ఫైటర్ జెట్లను భారత్‌లో విజయవంతంగా ఉత్పత్తి చేసిన అనుభవం హెచ్ఏఎల్‌కు ఉంది. 2000 సంవత్సరంలో కుదిరిన ఒప్పందం మేరకు ఈ జెట్లను హెచ్ఏఎల్ తయారు చేస్తోంది. ఈ నేపథ్యంలోనే రష్యా బృందం బెంగళూరు, నాసిక్, కోరాపుట్‌లోని హెచ్ఏఎల్ యూనిట్లను సందర్శించి, ఇక్కడి తయారీ సామర్థ్యాలను, సాంకేతిక సంసిద్ధతను అంచనా వేసింది. రష్యా నివేదిక నేపథ్యంలో, పెట్టుబడులు పెట్టాల్సిన కీలక రంగాలను గుర్తిస్తూ హెచ్ఏఎల్ కూడా ఒక అంతర్గత నివేదికను సిద్ధం చేస్తోంది. అత్యాధునిక కాంపోజిట్ మెటీరియల్స్, రాడార్‌ను తప్పించుకునే కోటింగ్స్, డిజిటల్ డిజైన్, నెక్స్ట్ జనరేషన్ ఇంజిన్ టెస్ట్ బెడ్స్ వంటి వాటిపై దృష్టి సారించనుంది.ఎస్‌యు57ని జెట్ల సంయుక్త ఉత్పత్తి భారత వైమానిక దళాన్ని గణనీయంగా బలోపేతం చేస్తుందని రక్షణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. తగ్గుతున్న ఫైటర్ జెట్ల స్క్వాడ్రన్ల సమస్యను అధిగమించడంతో పాటు, ప్రపంచ ఏరోస్పేస్ రంగంలో భారత్ స్థాయిని ఇది మరింత పెంచుతుంది. దేశీయంగా అభివృద్ధి చేస్తున్న ఐదో తరం ఫైటర్ జెట్ ప్రోగ్రామ్‌కు కూడా ఈ ప్రాజెక్ట్ అదనపు బలాన్ని ఇస్తుందని విశ్లేషకులు చెబుతున్నారు.

# వెనిజులాపై కమ్ముకుంటున్న అమెరికా యుద్ధమేఘాలు!

**కారకాస్, నవంబరు 7:** అమెరికా, వెనిజులా మధ్య ఉద్రిక్తతలు మరోసారి భగ్గుమన్నాయి. నిన్న రెండు అమెరికా ఎఫ్52 బాంబర్లు కరేబియన్ సముద్రంలో వెనిజులా తీరం వెంబడి ప్రయాణించాయి. అమెరికా సైనిక విమానాలు ఈ ప్రాంతంలో శక్తి ప్రదర్శన చేయడం ఇది నాలుగోసారి కాగాఈ పరిణామం ఇరు దేశాల మధ్య ఇప్పటికే ఉన్న వైరాన్ని మరింత పెంచింది. విమాన కదలికలను ట్రాక్ చేసే వెబ్‌సైట్ ఫ్లైట్ రాడార్ 24 డేటా ప్రకారం, ఈ రెండు బాంబర్లు వెనిజులా తీరానికి సమాంతరంగా ప్రయాణించాయి. ఆ తర్వాత రాజధాని కరాకస్‌కు ఈశాన్య దిశలో కాసేపు చక్కర్లు కొట్టి, తిరిగి తీరం వెంబడి ప్రయాణిస్తూ ఉత్తర దిశగా సముద్రంలోకి వెళ్లిపోయాయి. అక్టోబర్ మధ్య నుంచి అమెరికా సైనిక విమానాలు వెనిజులా సమీపంలో ప్రయాణించడం ఇది నాలుగోసారి. గతంలో ఒకసారి ఎఫ్52, రెండుసార్లు బి1బిబాంబర్లు ఇలాంటి విన్యాసాలు చేశాయి. ఈ ప్రాంతంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు సైనిక చర్యలు చేపడుతున్నామని వాషింగ్టన్ చెబుతోంది. ఇందులో భాగంగానే యూఎస్ఎస్ గెరాల్డ్ ఆర్. ఫోర్డ్ యుద్ధనౌక బృందాన్ని లాటిన్ అమెరికాకు పంపింది. ప్యూర్టోరికోలో ఎఫ్35 స్టెల్త్ యుద్ధ విమానాలను, కరేబియన్ సముద్రంలో ఆరు నౌకాదళ నౌకలను మోహరించింది. సెప్టెంబర్ నుంచి ఇప్పటివరకు డ్రగ్స్ రవాణా చేస్తున్నాయనే ఆరోపణలతో 17 నౌకలపై దాడులు చేశామని, ఈ దాడుల్లో 67 మంది మరణించారని అమెరికా పేర్కొంది. అయితే, లక్ష్యంగా చేసుకున్న నౌకలు మాదకద్రవ్యాల రవాణాకు ఉపయోగించబడ్డాయని గానీ, అవి దేశానికి ముప్పుగా పరిణమించాయని గానీ అమెరికా ఇప్పటివరకు ఎలాంటి ఆధారాలను విడుదల చేయలేదు. ఈ సైనిక కదలికలు, దాడులతో ప్రాంతీయంగా తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. డ్రగ్స్ నిరోధం అనేది కేవలం ఒక సాకు మాత్రమేనని, అధ్యక్షుడు నికోలస్ మాదూరో ప్రభుత్వాన్ని కూలదోయడానికే వాషింగ్టన్ కుట్ర పన్నుతోందని వెనిజులా తీవ్రంగా ఆరోపిస్తోంది.

# నాన్సీపెలోసీ రిటైర్‌మెంట్‌ప్రకటించి అమెరికాకు ఎంతో మేలుచేసారు: ట్రంప్



**వాషింగ్టన్, నవంబరు 7:** చట్టసభలో స్పీకర్‌గా పనిచేసిన నాన్సీ పెలోసీ తాను ఇక రాజకీయాలనుంచి రిటైర్ అవుతానని ప్రకటించడంతో డొనాల్డ్‌ట్రంప్ ఛలోక్తులు వేస్తూ ఆమెచాలా చెడ్డనేత అని అవినీతిపరు రాలంటూ ఆమె పోవడం వల్ల అమెరికాకు ఎంతోమేలు జరిగిందని వ్యాఖ్యలుచేసారు. నాన్సీ పెలోసీ తాను ఇక రిటైర్ కావాలనుకుంటున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో ట్రంప్ ఆమెపై ఉన్న వ్యతిరేకతను మొత్తం వెళ్లగక్కారు. దేశానికి చెడుజరిగే అంశాలపైనే నాన్సీ ఫోకస్‌పెట్టారని, ఆమె అవినీతి పరురాలని, ఎంతో చెడ్డపనులుచేసే మహిళ అని ఆమె రిటైర్‌కావడం అమెరికాకు ఎంతోమేలు జరిగిందని వ్యంగ్యోక్తులు విసిరారు. దేశప్రతిష్టను ఎంతో దెబ్బతీసారని, ఆమె రిటైర్ అవుతూ దేశానికి ఎంతో మేలుచేసారని వైట్‌హౌస్‌లో మీడియాతోమాట్లాడుతూ వ్యాఖ్యలుచేసారు. అమెరికా ప్రతినిధుల సభకు మళ్లీఎన్నికకావాలని కోరుకోవడంలేదని నాన్సిపెలోసీ ప్రకటించారు. శాన్‌ఫ్రాన్సిస్కోకు 40 ఏళ్లపాటు ప్రాతినిద్యం వహించిన ఆమె గురువారం తాజాగా తన రిటైర్‌మెంట్ నిర్ణయాన్ని ప్రకటించారు. స్పీకర్ కార్యాలయంలో తన చివరి ఏడాది పూర్తి చేసానని ఆమెచెపుతూ తాను శాన్‌ఫ్రాన్సిస్కోను ఎంతోప్రేమించానని, చరిత్ర సృష్టించానని ఆమె పేర్కొన్నారు. ప్రగతిపథంలోనే నడిచామని ఆమె చెప్పారు.

## సంక్షిప్తంగా..

### శబరిమలకు 60 ప్రత్యేక రైళ్లు




**తిరువనంతపురం, నవంబర్ 7:** శబరిమల వెళ్లే భక్తులకు శుభవార్త. భక్తుల రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసింది. తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల మీదుగా శబరిమలకు మొత్తం 60 ప్రత్యేక రైళ్లు నడుపు తున్నట్లు ప్రకటించింది. ఈ రైళ్లు నవంబర్, డిసెంబర్, జనవరిలోని పలు తేదీల్లో సర్వీసు లందించనున్నాయి. చర్లపల్లి, కొల్లం, చర్లపల్లి ప్రత్యేక రైళ్లు పగిడిపల్లి, గుంటూరు, గూడూరు, రేణిగుంట మీదుగా మొత్తం 20 సర్వీసులందించనున్నాయి. నర్సాపూర్ - కొల్లం - నర్సాపూర్ రైళ్లు విజయవాడ, గూడూరు, రేణిగుంట మీదుగా 20 సర్వీసులు అందించనున్నాయి. మచిలీపట్నం - కొల్లం - మచిలీపట్నం రైలు గూడూరు, రేణిగుంట మీదుగా 10 సర్వీసులు అందిస్తాయి. మచిలీపట్నం - కొల్లం - మచిలీపట్నం రైళ్లు గుంటూరు, నంద్యాల, కడప, రేణిగుంట మీదుగా 10 సర్వీసులందిస్తాయి.

### 15 యేళ్లనాటి హత్యకేసులో భర్త అరెస్టు!



**న్యూఢిల్లీ, నవంబరు 7:** దాదాపు 15 ఏళ్ల క్రితం జరిగిన ఓ హత్య కేసు మిస్టరీని ఢిల్లీ పోలీసులు ఎట్టకేలకు ఛేదించారు. భార్యను హత్య చేసి, అది ఆత్మహత్యగా చిత్రీకరించి పరారైన భర్తను గుజరాత్‌లో అరెస్ట్ చేశారు. నిందితుడు నరోత్తమ్ ప్రసాద్‌ను ఢిల్లీకి తరలించి, తదుపరి చట్టపరమైన చర్యలు ప్రారంభించారు. 2010 మే 31న ఢిల్లీలోని జహంగీర్‌పురి ప్రాంతంలోని ఒక ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడకు చేరుకుని ఇంటి తలుపులు పగలగొట్టి చూడగా, 25 ఏళ్ల మహిళ మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో నేలపై పడి ఉంది. సంఘటనా స్థలంలో ఒక సూసైడ్ నోట్ కూడా లభించింది. విచారణ ప్రారంభించిన పోలీసులకు మృతురాలి భర్త నరోత్తమ్ ప్రసాద్‌పై అనుమానం కలిగింది. అప్పటికే అతను పరారీలో ఉండటంతో అనుమానం బలపడింది. దీంతో పోలీసులు అతడిని నిందితుడిగా ప్రకటించి, అతడి ఆచూకీ తెలిపిన వారికి రూ.10,000 రివార్డు కూడా ప్రకటించారు.

### సైనిక్ స్కూల్‌లో ర్యాగింగ్




**గాంధీనగర్, నవంబర్ 7:** ఒక సైనిక్ స్కూల్‌లో జూనియర్లపై సీనియర్లు ర్యాగింగ్‌కు పాల్పడ్డారు. బలవంతంగా శిక్షించడంతో పాటు కర్రతో వారిని కొట్టారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. గుజరాత్‌లోని బాలచాడి సైనిక స్కూల్‌లో ఈ సంఘటన జరిగింది. ఒక సీనియర్ విద్యార్థి టవల్ ఉన్నాడు. జూనియర్ స్టూడెంట్స్‌ను అతడు వేధించాడు. పుష్ అప్‌లు తీయమని బలవంతం చేశాడు. ఆ పొజిషన్‌లో ఉన్నవారిని వరుసగా కర్రతో కొట్టాడు. దీంతో కొందరు జూనియర్లు బాధతో అల్లాడిపోయారు. కాగా, ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయింది.

### యువకుడిపై దాడి, నాలికతో కాళ్లు నాకించిన వైనం



**సూరత్, నవంబరు 7:** గుజరాత్‌లోని సూరత్ నగరంలో మానవత్వం సిగ్గుపడే ఘటన ఒకటి వెలుగులోకి వచ్చింది. ఓ యువకుడిని దారుణంగా కొట్టి, కత్తితో బెదిరించి, బలవంతంగా కాళ్లు నాకించారు. ఈ పైశాచిక చర్యను నిందితుడే స్వయంగా తన ఫోన్‌లో వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం గమనార్హం. ప్రస్తుతం ఈ వీడియోలు వైరల్ కావడంతో ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. మధ్యప్రదేశ్‌కు చెందిన సుధీర్ పాండే అనే యువకుడు ఉపాధి కోసం సూరత్‌కు వచ్చి అమ్రోలి ప్రాంతంలోని ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. అక్కడే ఈ దాడి జరిగింది. దాడికి పాల్పడిన వ్యక్తిని బాధితుడు "భోలా భాయ్" అని పిలుస్తున్నట్లు వీడియోలో వినిపిస్తోంది. నిందితుడు కత్తి చూపించి సుధీర్‌ను బెదిరిస్తూ తీవ్రంగా కొట్టాడు. 'భోలా భాయ్, నన్ను క్షమించు. నేను ఇకపై ఎప్పుడూ సూరత్‌కు తిరిగి రాను' అని బాధితుడు వేడుకుంటున్న దృశ్యాలు వీడియోలో స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# బంగారు, వెండి బల్లుల తాపడాలు మారలేదు : స్పందించిన కంచి ఆలయం



**చెన్నై, నవంబరు 7:** తమిళనాడులో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కాంచీపురంలోని వరదరాజ పెరుమాళ్ ఆలయంలో బల్లుల విగ్రహాలకు ఉన్న తాపడాలను మార్చినట్లు ఫిర్యాదు అందడం తీవ్ర చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా ఆలయ మేనేజ్‌మెంట్ స్పందిస్తూ ఆరోపణలను తోసిపుచ్చింది. ఆ విగ్రహాల్లో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేసింది. 'ఆలయంలోని బంగారు, వెండి బల్లుల విగ్రహాలు సీలింగ్‌కు అలాగే ఉన్నాయి. వాటిని తొలగించడం గానీ, తాపడాలను మార్చడం గానీ చేయలేదు. దీనిపై ఆలయాల ఉద్యమకారుడు తప్పుడు, నిరాధార ఆరోపణలు చేశారు. ఆయనపై న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించాం' అని ఆలయ ఎగ్జిక్యూటివ్ అధికారి శుక్రవారం వెల్లడించారు. కాంచీపురంలోని వరదరాజ పెరుమాళ్ ఆలయంలో ప్రస్తుతం పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయి. ఈ సమయంలో ఆలయంలోని పురాతన బంగారు, వెండి బల్లుల తాపడాలను మార్చేసి వాటి స్థానంలో కొత్త తాపడాలను ఏర్పాటు చేశారని శ్రీరంగానికి చెందిన రంగరాజ నరసింహ ఫిర్యాదు చేశారు. దీంతో విగ్రహాల అక్రమ తరలింపు నిషేధ విభాగం పోలీసులు దీనిపై దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో బుధవారం ఆలయ ఇఒ రాజ్యలక్ష్మిని పోలీసులు 8 గంటలపాటు విచారించారు. ఆలయంలోని ఇతర సిబ్బందిని కూడా ప్రశ్నించారు.

ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తు కొనసాగుతోంది. అవసరమైనప్పుడు విచారణకు రావాలని ఆయల ఇఒ, సిబ్బందిని ఆదేశించినట్లు తెలిసింది. 108 దివ్య క్షేత్రాల్లో ఒకటైన కాంచీపురంలోని ఈ ప్రసిద్ధ వరదరాజస్వామి ఆలయంలో బంగారు, వెండి బల్లులు విశిష్టమైనవి. నిత్యం ఈ ఆలయాన్ని దేశం నలుమూలల ఉంచి వచ్చే భక్తులు దర్శించుకుంటారు. ఇక్కడి బంగారు, వెండి బల్లులను తాకితే దోషనివారణ జరుగుతుందని నమ్మకం.

### అమరావతిలో రూ.212 కోట్లతో

# గవర్నర్ బంగ్లా నిర్మాణం

### టెండర్లు పిలిచిన ఎపిసిఆర్‌డిఏ

రాజంపేట, నవంబరు 7 ప్రభాతవార్త: రాజధాని అమరావతిలో రాష్ట్ర గవర్నర్‌కు బంగ్లా, ఉద్యోగులు అతిథి గృహాలు, ఇతర పనులు చేపట్టేందుకు రూ.212.22 కోట్ల అంచనా వ్యయంతో పెద్ద ఎత్తున నిర్మాణాలు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఎపి సిఆర్‌డిఏ టెండర్లను శుక్రవారం ఆహ్వానించింది. అమరావతి ప్రభుత్వ కాంప్లెక్స్ పరిధిలోనే గవర్నర్ రెసిడెన్స్ కాంప్లెక్స్ నిర్మిస్తారు. అసెంబ్లీ దర్బార్ హాల్, రెండు అతిథి గృహాలు, సిబ్బందికి 68 క్వార్టర్స్ నిర్మిస్తారు.144 మందికి అకామిడేషన్ కల్పించేలా బరాక్స్ నిర్మిస్తారు. రాష్ట్ర ప్రభుత్వ కాంప్లెక్స్ నిర్మాణం పనులు జరుగుతున్న ప్రాంతంలోనే గవర్నర్ రెసిడెన్సి కాంప్లెక్స్ చేపడతారు. బిడ్‌లో పాల్గొనేందుకు ఈనెల 20 చివరి గడువుగా నిర్ణయించారు. ఇదే రోజున టెక్నికల్ బిడ్ కూడా ఓపెన్ చేసి గుత్తేదారును ఖరారు చేస్తారు.

### తహసీల్దార్లు, ఆర్డీవోలు, డీఆర్వోలకు

# టోల్ ఫీజు మినహాయింపు ఇవ్వండి

### - మోర్త్ కార్యదర్శికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ

విజయవాడ, నవంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలోని జాతీయ రహదారుల మీదుగా ప్రయాణించే తహసీల్దార్లు, డిప్యూటీ కలెక్టర్లు (ఆర్డీఓ కేడర్), స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు (డిఆర్వో కేడర్) తదితర అధికారుల వాహనాలకు టోల్ ఫీజుల నుంచి మినహాయింపు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. అధికారిక కార్యక్రమాల కోసం ప్రయాణించే ఆయా అధికారుల సొంత, అద్దె వాహనాలకు వారి వద్ద ఉన్న ప్రభుత్వ గుర్తింపు కార్డు చూసి టోల్‌ఫీజు వసూలు చేయకుండా మినహాయించాలని కోరింది. ఈ మేరకు ఆర్‌అండ్‌బి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ (మోర్త్) కార్యదర్శికి లేఖ రాశారు. ఈ అధికారుల వాహనాలకు టోల్ ఫీజు తీసుకోకుండా చూడాలంటూ ఎపి రెవిన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు ముఖ్యమంత్రికి వినతిపత్రం అందచేశారు. దీంతో ఆర్‌అండ్‌బి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మోర్త్‌కు లేఖ రాశారు. ఆయా అధికారులంతా ఎన్నికలు, జనాభా లెక్కలు, ప్రకృతి విపత్తులు, జాతీయ రహదారులకు భూసేకరణ విధుల కోసం, ప్రభుత్వం నిర్వహించే రాష్ట్ర, ప్రాంతీయ, జిల్లా స్థాయి సమావేశాలకు వివిధ కోర్టుల్లో కేసుల నిమిత్తం హాజరయ్యేందుకు జాతీయ రహదారులపై ప్రయాణిస్తుంటారని, వీరికి టోల్ ఫీజు నుంచి మినహాయించేలా జాతీయ రహదారుల అధికారులకు తగిన ఆదేశాలివ్వాలని లేఖలో కోరారు.

# ఆ గోడ కూల్చేందుకు రూ.32 లక్షలు చెల్లించండి

### - విజయసాయిరెడ్డి కుమార్తెకు హైకోర్టు ఆదేశం

విజయవాడ, నవంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి: భీమిలి బీచ్‌కు సమీపంలో సిఆర్‌జడ్ నిబంధనలను ఉల్లంఘించి నిర్మించిన కాంక్రీట్ గోడలో ఇప్పటికే కొంతభాగాన్ని కూల్చేయగా, మిగిలింది కూడా కూల్చేందుకు రూ.31.97 లక్షలు 2 వారాల్లో జీవీఎంసీకి జమ చేయాలని వైఎస్సార్సీపీ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డిని, అవ్యాన్ రియల్టర్స్ కంపెనీని హైకోర్టు ఆదేశించింది. కాంక్రీట్ గోడ నిర్మించి పర్యావరణానికి నష్టం చేసినందుకు రూ.17.46 కోట్లు చెల్లించాలని కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వశాఖ (ఎంఓఈఎఫ్) నేతృత్వంలోని కమిటీ ఇచ్చిన నివేదికపై అభ్యంతరాలు తెలిపేందుకు 2 వారాల సమయం ఇచ్చింది. ఎంఓఈఎఫ్ తుది నిర్ణయంపై అభ్యంతరం ఉంటే తగిన వేదికలో సవాలు చేసుకునేందుకు నేహారెడ్డికి, ఆమె కంపెనీకి అవకాశం ఇచ్చింది. మరోవైపు షోకాజ్ నోటీసులకు సమాధానంగా రెస్టోబార్ల యజమానులు ఇచ్చిన వివరణను పరిగణనలోకి తీసుకొని 2 వారాల్లో తగిన ఉత్తర్వులు జారీ చేయాలని జివిఎంసి అధికారులను ఆదేశించింది. తదుపరి విచారణను 2 వారాలకు వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందన్ రావుతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చింది.


## టిడిపి కార్యాలయంలో ప్రజావేదిక షెడ్యూల్

గుంటూరు, నవంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి: మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించే 'ప్రజా వేదిక'కు సంబంధించి శనివారం నుండి పాల్గొనే నాయకుల షెడ్యూల్ వివరాలను టిడిపి కేంద్ర కార్యాలయ కార్యదర్శి పర్చూరి అశోక్ బాబు వెల్లడించారు. ఈనెల 8వ తేదీ శనివారం రోజున మంత్రి కొల్లు రవీంద్ర, ఎపిసిఐబి చైర్మన్ గన్ని వీరాంజినేయులు, 10న 'మండలి' చీఫ్ విప్, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, ఎపిఎఫ్‌డిసిఎల్ చైర్మన్ సుజయకృష్ణా రంగారావు, 11న మంత్రి ఎన్ఎండి ఫరూక్, వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్, 12న మంత్రి నిమ్మల రామానాయుడు, ఎపిఐడబ్ల్యూఎబి చైర్మన్ డాక్టర్ శివ ప్రసాద్, 13న మంత్రి కొలుసు పార్థసారథి, ఎపిహెచ్‌బి చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, 15న శనివారం ఎమ్మెల్సీ బిటి నాయుడు, ఎపి కెవిఐబి చైర్మన్ కెకె చౌదరి పాల్గొంటారని తెలిపారు. ఇదిలా ఉండగా, ప్రతి శుక్రవారం ఎమ్మెల్యేలు వారివారి నియోజకవర్గాల్లో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. కావున ఆరోజున కేంద్ర కార్యాలయంలో ఎలాంటి గ్రీవెన్స్ కార్యక్రమం ఉండదన్నారు.



## సూరమాలలో సురక్షిత తాగునీటి ప్రాజెక్టు ప్రారంభం

తొట్టంబేడు, నవంబరు 7 ప్రభాతవార్త: గ్రామీణులకు సురక్షితమైన మంచినీటిని పొందేలా తిరుపతి ఐఐటి ఇంక్యూబేటెడ్ చేయబడిన ప్రాజెక్టును తొట్టంబేడు మండలంలోని మారుమూల గ్రామం రౌతుసూరమాలలో శుక్రవారం ప్రారంభించారు. తిరుపతి ఐఐటి సౌజన్యంతో రూపొందించిన ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఎన్‌జిఐఎన్ డైరెక్టర్ ప్రొఫెసర్ షాహాబుద్దీన్ వివరించారు. ఈ ప్రాజెక్టు ఆధునాతన కెపాసిటవ్ డియోనైజేషన్ (సిడిఐ) ఆధారిత నీటి శుద్ధీకరణ వ్యవస్థను విజయవంతంగా పనిచేస్తుందన్నారు. పర్యావరణ ప్రభావాన్ని తగ్గిస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఇంజనీర్‌తోపాటు బొజ్జల బృందమ్మ, మండల తెలుగుదేశం నాయకుడు రావిళ్ళ మునిరాజా నాయుడు తదిరులు పాల్గొన్నారు.



ట్రోంసోలోని నార్వే సీఫుడ్ కౌన్సిల్ ప్రధాన కార్యాలయంలో ఎంపి పుట్టా మహేష్, భారత ఎంపిల బృందం

# ఎపి ఆక్వా పరిశ్రమతో కలిసి పనిచేయండి

### నార్వే సీఫుడ్ కౌన్సిల్‌కు ఎంపి పుట్టా వినతి

ఏలూరు, నవంబరు 7 ప్రభాతవార్త: నార్వే పర్యటనలో ఉన్న ఏలూరు ఎంపి పుట్టా మహేష్ కుమార్ ట్రోంసోలోని "నార్వే సీఫుడ్ కౌన్సిల్" ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. నార్వేలో ఆక్వా రంగం అభివృద్ధి, సముద్ర ఆధారిత ఉత్పత్తుల వాణిజ్యం లాభదాయకంగా నడిపిస్తున్న తీరును అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. మార్కెట్లలో నార్వేజియన్ సముద్ర ఆహార విలువను పెంచడానికి ఆక్వా పరిశ్రమలతో కలిసి కౌన్సిల్ పనిచేస్తున్న విధానాన్ని ఆసక్తిగా విన్న ఏలూరు ఎంపి, భారతదేశం ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో ఆక్వా రంగం అభివృద్ధికి ఎంతో అవకాశం ఉందని, దీనిపై తన పర్యటనలో దృష్టి పెట్టాలని మంత్రి నారా లోకేష్ చెప్పిన విషయాన్ని నార్వే అధికారులకు తెలియచేసారు. ఆంధ్రప్రదేశ్‌ను సందర్శించవలసిందిగా "నార్వే సీఫుడ్ కౌన్సిల్" సభ్యులను ఎంపి ఆహ్వానించారు. అంతకు ముందు ఆర్కిటిక్ కౌన్సిల్ కార్యాలయాన్ని, నార్వేజియన్ పోలార్ ఇన్స్టిట్యూట్‌ను భారత ఎంపిల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా మత్స్య, మైనింగ్, సముద్ర రవాణా, పెట్రోలియం రంగాలలో సమగ్ర వనరుల నిర్వహణ, వాతావరణ మార్పులపై పరిశోధన, పర్యవేక్షణ జరుగుతున్న తీరును ఆర్కిటిక్ కౌన్సిల్ డైరెక్టర్ మాథ్యూ పార్కర్ భారత బృందానికి వివరించారు. ట్రోంసోలోని ఫిన్‌మార్క్ కౌంటీలోని కారజోహ్కా గ్రామంలో ఉన్న "సామీ పార్లమెంట్"ను సందర్శించారు. నార్వేలోని సామీ వారసత్వం కలిగిన ప్రజలకు ప్రతినిధిగా ఉంటూ, సామీ ప్రజల కోసం సాంస్కృతిక స్వయంప్రతిపత్తి సంస్థగా పనిచేస్తున్న తీరును అక్కడి అధికారులు భారత ప్రతినిధి బృందానికి వివరించారు.

### ఇంధన సామర్థ్య, సంరక్షణ కార్యక్రమాల

# అమలుకు చర్యలు తీసుకోండి

### ఎపి జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.నాగలక్ష్మి



విజయవాడ, నవంబరు 7 ప్రభాత వార్త ప్రతినిధి: రాష్ట్రవ్యాప్తంగా అమలవుతున్న ఇంధన సామర్థ్య, ఇంధన సంరక్షణ కార్యక్రమాలను వేగవంతంగా అమలు అమలు చేసి రాష్ట్ర ఇంధన సామర్థ్య లక్ష్యాలను సాధించాలని ఎపి జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్, స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ (ఎపిఎస్ఇసిఎం) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. శుక్రవారం విజయవాడలోని విద్యుత్ సౌధలో ఎపిఎస్ఇసిఎం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఇఓ మాట్లాడుతూ, ఇంధన సామర్థం రాష్ట్ర ఇంధనరంగ పురోగతిలో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. భవనాలు, పరిశ్రమలు, మునిసిపాలిటీలు, వ్యవసాయం, రవాణా రంగాల్లో ఇంధన సామర్థ్యం, ఇంధన పొదుపుకు సంబంధించి స్పష్టమైన ఫలితాలు సాధించడంపై దృష్టి పెట్టాలని సిఇఓ సూచించారు. అన్ని కార్యక్రమాలు స్టేట్ ఎనర్జీ ఎఫిషియెన్సీ ఏక్షన్ ప్లాన్, ఎనర్జీ కన్సర్వేషన్ ఎఫిషియెన్సీ పాలసీ 2023-28కు అనుగుణంగా అమలు కావాలని, అలాగే ప్రోజెక్టుల పర్యవేక్షణ, ధ్రువీకరణ సమర్థవంతంగా జరగాలని సిఇఓ ఆదేశించారు. అన్ని పట్టణ స్థానిక సంస్థల్లో ఎనర్జీ కన్సర్వేషన్ బిల్డింగ్ కోడ్ (ఇసిబిసి) ఖచ్చితంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్ భవనాల్లో ఇసిబిసి ప్రమాణాలకు అనుగుణంగా నిర్మాణ పద్ధతులు అవలంబించేలా ప్రోత్సహించాలని, సిఇఓ వివరించారు. అలాగే ఇంజనీర్లు, ఆర్కిటెక్టులు, పట్టణ స్థానిక సంస్థల అధికారులకు శిక్షణా కార్యక్రమాలను నిర్వహించాలని పేర్కొన్నారు. పరిశ్రమల క్లస్టర్లతో సమన్వయం సాధించి ఇంధన సామర్థ్య సాంకేతిక పరిజ్ఞానాల వినియోగాన్ని ప్రోత్సహించాలని పెర్ఫర్మ్, అచీవ్, ట్రేడ్ (పాట్) కార్యక్రమం నుంచి కార్బన్ క్రెడిట్ ట్రేడింగ్ వ్యవస్థ వైపు మార్పును సులభతరం చేయాలని ఆదేశించారు. ఇంధన వినియోగ సామర్థ్యాన్ని పెంపొందించడం ద్వారా పరిశ్రమలు ఉత్పాదకతను, పోటీ సామర్థ్యాన్ని మెరుగుపరచుకోవచ్చని సిఇఓ పేర్కొన్నారు. ఎంఎస్ఎంఇ యూనిట్లు ఇంధన సామర్థ్య పరికరాలు, పద్ధతులు ఉపయోగించేందుకు సాంకేతిక, ఆర్థిక సహాయాన్ని కొనసాగించాలని సూచించారు. పరిశ్రమల అసోసియేషన్ల సంఘాలతో కలిసి క్లస్టర్ స్థాయి కార్యక్రమాలను చేపట్టి, ఉత్పాదకతను పెంచి, వ్యయాన్ని తగ్గించి, కార్బన్ ఉద్గారాలను తగ్గించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నూతన విధానాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ప్రజా భాగస్వామ్యంతో రాష్ట్రం మరింత పురోగతి సాధిస్తుందని నాగలక్ష్మి పేర్కొన్నారు.



# రైల్వేలో వందేమాతర గీతం ఆలాపన

గుంతకల్లు రైల్వే, నవంబరు 7 ప్రభాత వార్త: ఆధునిక భారతీయ సాహిత్య సృష్టలలో, భారత జాతీయ పునరుజ్జీవనోద్యమంలో తీవ్ర ప్రభావాన్ని చూపిన వందేమాతర గీతం ఆలాపన రైల్వేలో భక్తిశ్రద్ధలతో ఆడంబరంగా జరిగింది. భారత జాతీయ గీతమైన వందేమాతర గీతం 150 వసంతాల సంస్మరణోత్సవ కార్యక్రమం స్థానిక డిఆర్ఎం కార్యాలయ ఆవరణలో రైల్వే అధికార యంత్రాంగం ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మెటీరియల్ మేనేజర్ రాజేష్ పి.ఖడే, అదనపు డిఆర్ఎం సుధాకర్, ఎపిఓ వి.కల్పన, రైల్వే పాఠశాల ప్రిన్సిపాల్ బి.మధు సూదన్ రావు, రైల్వేలోని అన్ని విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది, రైల్వే ఉన్నత పాఠశాల విద్యార్ధులు తదితరులు పాల్గొన్నారు.

### రైల్వే గుంతకల్లు డివిజన్ పరిధిలో

# డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ క్యాంపు

గుంతకల్లు రైల్వే, నవంబరు 7 ప్రభాతవార్త: రాయలసీమలోని దక్షణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ పరిధిలో పదవీ విరమణ చేసిన రైల్వే పెన్షనర్ల సౌకర్యార్ధం డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ 4.0కు సంబంధించి తమ కార్యాలయంలో ప్రత్యేక క్యాంపును ఏర్పాటు చేసినట్లు అఖిల భారత రైల్వే పెన్షనర్ల సంక్షేమ సమాఖ్య (ఏఐఆర్‌పిడబ్ల్యూఎఫ్) డివిజనల్ కార్యదర్శి షేక్ మస్తాన్ వలీ తెలిపారు. కేంద్ర పెన్షన్లు, పెన్షనర్ల సంక్షేమ శాఖ, రైల్వేబోర్డు, జోనల్ అధికార యంత్రాంగం ఆదేశాల మేరకు పెన్షనర్లు తమ లైఫ్ సర్టిఫికేట్లను ఈ నెలాఖరులోగా నమోదు చేసుకోవలసి ఉంటుందని డివిజనల్ కార్యదర్శి షేక్ మస్తాన్ వలీ తెలిపారు.
పెన్షనర్ల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వారు ఎలాంటి ఇబ్బందులు పడకుండ పెన్షనర్ల సౌకర్యార్ధం గుంతకల్లులోని రైల్వే మజ్దూర్ యూనియన్ డివిజనల్ కార్యాలయంలోని సమాఖ్య కార్యాలయాన్ని ఏర్పాటు చేశామన్నారు. కావున లైఫ్ సర్టిఫికేట్లను నమోదు చేసుకోవాలనుకునే వారు తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో తమ తమ పెన్షన్ పేమెంట్ ఆర్డర్, ఆధార్, బ్యాంకు ఖాతా పాస్ బుక్‌లను, బ్యాంకు ఖాతాతో లింక్ ఉన్న మొబైల్ ఫోన్, పాన్ కార్డు, ఓటర్ ఐడి కార్డులను తీసుకొని తమ కార్యాలయంలో ఏర్పటుచేసిన జీవన్ ప్రమాణ్ కేంద్రంలో డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్‌లను నమోదు చేయించుకోవల సిందిగా ఆయన తెలిపారు.

# రైలు ప్రమాదాలపై మాక్ డ్రిల్



గుంతకల్లు రైల్వే, నవంబరు 7 ప్రభాతవార్త: గుంతకల్లు పట్టణ శివారులోని తిమ్మనచెర్ల రైల్వే స్టేషన్ వద్ద శుక్రవారం రైలు ప్రమాదం జరిగిన అనంతరం తీసుకోవలసిన తక్షణ చర్యలను, క్షతగాత్రులను, ప్రయాణీకులను రక్షించేందుకు తీసుకోవలసిన చర్యలపై రైల్వే, ఎన్‌డిఆర్ఎఫ్ దళం సంయుక్తంగా మెగా మాక్ డ్రిల్ నిర్వహించాయి. అనంతరం డిఆర్ఎం సిఎస్ గుప్తా, ఎన్‌డిఆర్ఎఫ్ ఆర్ఆర్‌సి బెంగళూరు 10వ బెటాలియన్ కమాండర్ అఖిలేష్ కుమార్ చౌబే, హరిశ్చంద్ర పాండే, సీనియర్ డిఎంఇసి అండ్ డబ్ల్యూ పి.ఎస్. మణికుమార్, రైలే భద్రతా అధికారి సూర్యనారయణ మీడియాతో మాట్లాడుతూ... ఈ విన్యాసం రైలు ప్రమాదం జరిగిన సమయంలో చేపట్టవలసిన అత్యవసర పరిస్థితులలో రైల్వే, ఎన్‌డిఆర్ఎఫ్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బృందాల సమన్వయ ప్రతిభను గురించి తెలియజేయడమే ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ప్రజలకు విపత్తు నిర్వహణలో సరైన అవగాహన కల్పించడం ఈకార్యక్రమ ముఖ్య ఉద్ద్యేశమన్నారు. కార్యక్రమంలో రైల్వేకు చెందిన అన్ని విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది, స్కౌట్స్, గైడ్స్ బృందాలు తదితరులు పాలొన్నాయి.


'వందేమాతరం' 150 ఏళ్ల సంబరాల్లో నేతలు కళావెంకట్రావు, పరుచూరి అశోక్‌బాబు, ఎవి రమణ, బ్రహ్మం చౌదరి, దారపనేని తదితరులు

### టిడిపి కేంద్ర కార్యాలయంలో

# 'వందేమాతరం' 150 యేళ్ల సంబరాలు

గుంటూరు, నవంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి: స్వాతంత్ర్య పోరాటానికి బీజం వేసి కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతంగా దేశ ప్రజలను ఒక తాటిపైకి తెచ్చిన గేయం వందేమాతరమని టిడిపి నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం తెలుగుదేశం కేంద్ర కార్యాలయంలో వందేమాతరం 150 ఏళ్ల సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, మాజీ ఎమ్మెల్సీ, టిడిపి కేంద్ర కార్యాలయ కార్యదర్శి పర్చూరి అశోక్ బాబు, టిడిపి జాతీయ అధికార ప్రతినిధి, నాలెడ్జ్ సెంటర్ చైర్మన్ గురజాల మాల్యాద్రి తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు, పింగళి వెంకయ్య, అయ్య దేవర కాళేశ్వరరావు లాంటి స్వాతంత్ర్య ఉద్యోమ నాయుకుల గొప్పతనం గుర్తు చేశారు. కార్యక్రమంలో శ్రీశైలం బోర్డు సభ్యుడు ఏవీ రమణ, కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ బ్రహ్మం చౌదరి, హజ్ యాత్ర కమిటీ ఛైర్మన్ హసన్‌బాషా, పార్టీ రాష్ట్ర మీడియా కో ఆర్డినేటర్ దారపనేని నరేంద్ర బాబు,కార్యకర్తలు, కార్యాలయ సిబ్బంది పాల్గొని వందేమాతరం గేయం ఆలపించారు.

# యువత భవిష్యత్‌ను నాశనం చేయడమే జగన్ లక్ష్యం




గుంటూరు, నవంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి: గత ఐదేళ్లు ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడ గంజాయి, డ్రగ్స్ ఉన్నా వాటి మూలాలు ఎపిలోనే ఉన్నాయని, గత ఐదేళ్లు వైసిపి నాయకులు అధికారాన్ని అడ్డం పెట్టుకొని డ్రగ్స్, గంజాయి వ్యాపారం చేశారని కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మంచౌదరి అన్నారు. శుక్ర వారం టిడిపి కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2019 నుండి 2024 వరకు ఆంధ్రప్రదేశ్ నుండి ప్రపంచవ్యాప్తంగా దొరికిన ప్రతి గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థం వెనుక వైఎస్ఆర్‌సిపి నాయకులు లేదా వారి అధికార దుర్వినియోగం ఉన్నట్టు బయటపడింది. ఇది యాదృచ్ఛికం కాదన్నారు. వైఎస్ఆర్‌సిపి విద్యార్థి నాయకుడు పులగం కొండారెడ్డి లిక్విడ్ డ్రగ్స్‌తో ఇంజినీరింగ్, కాలేజీ విద్యార్థులకు సప్లయ్ చేస్తూ పట్టుబడ్డాడని,. 48 గంటలు గడిచినా పార్టీ నుండి సస్పెండ్ చేయలేదని... అంటే జగన్ డ్రగ్స్‌ను ప్రోత్సహిస్తున్నాడని యువత అంచనా వేస్తోందన్నారు. నిన్న తాడేపల్లి ప్యాలెస్‌లో జగన్ పెట్టిన "స్టూడెంట్స్ మీటింగ్" అది డ్రగ్స్ వింగ్ సమావేశం. హాజరైన వారంతా గంజాయి, డ్రగ్స్ కేసుల్లో ఉన్న రౌడీ షీటర్లు, సప్లయర్లు, డీలర్లు. స్టూడెంట్ వింగ్ అని డప్పు కొట్టుకోవడం యువతను మోసం చేయడమే అన్నారు. ఇక రాష్ట్రానికి జగన్ లాంటి విపత్తు అవసరం లేదన్నారు. ఆంధ్రప్రదేశ్ యువత ఈ రోజు జగన్‌ను జోకర్‌గా చూస్తోందనే విషయాన్ని ఆయన తెలుసుకుంటే చాలని అన్నారు.

### రోడ్డు ప్రమాదంలో

# ఒకరు మృతి

కలిగిరి (నెల్లూరు), నవంబరు 7 ప్రభాత వార్త: కావలి- కలిగిరి రహదారిలో శుక్రవారం పెద్దపాడువద్ద బైక్ ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో కలిగిరిలోని జిర్రావారిపాలెంకు చెందిన మనోజ్ (26) మృతి చెందగా మరో ఇద్దరు గాయాలతో బయట పడ్డారు. ప్రత్యక్ష సాక్షులు, పోలీసులు కథనం మేరకున జిర్రావారి పాలెంకు ముగ్గురు స్నేహితులు తుమ్మల పెంట సముద్ర స్నానానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో రోడ్డుపై ఉన్న ప్రమాద హెచ్చరిక బోర్డును బైక్ ఢీకొని ప్రమాదం సంభవించింది. గాయాలపాలైన కిరణ్‌ది బెంగళూరు. బంధువుల ఇంటికి వచ్చి సరదాగా స్నేహితులతో కలసి సరదాగా సముద్ర స్నానానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో బైక్ ప్రమాదం జరిగిందని మృతుని బంధువులు తెలిపారు.

# 17న పరశురామేశ్వరుని సన్నిధిలో భస్మాభిషేకం



శ్రీకాళహస్తిరూరల్, నవంబరు 7 ప్రభాతవార్త: ఏర్పేడు మండలం గుడిమల్లంలో వెలసిన అనందవల్ల సమేత పరశురామేశ్వరుని సన్నిధిలో కార్తీక నెల 17న నాల్గవ సోమవారం ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు ఆలయ చైర్మన్ బత్తల గిరిబాబునాయుడు, ఆలయ ఇఓ రామ చంద్రారెడ్డి తెలిపారు. ఆ రోజు ఇక్కడ వెలసిన స్వామికి ఉజ్జయిని మహంకాళి స్వామి అలంకారము నిర్వహించుటకు నిర్ణయించినట్లు వివరించారు. అలాగే భస్మాభిషేకం, సహస్ర దీపాలంకరణ సేవ, ఏకదశ రుద్ర పారాయణం, సహస్ర బిల్వ అర్చన, పలు విశేష కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. సహస్ర దీపారాధనలో భక్తులే దీపాలను తమ స్వహస్తాలతో వెలిగించి మొక్కులు తీర్చుకోవచ్చునని తెలిపారు.

**10న భరద్వాజతీర్థంలో లక్ష దీపోత్సవం**

శ్రీకాళహస్తి, నవంబరు 7 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయం సారథ్యంలో భరద్వాజ మహామునిచే తపస్సు చేయటానికి తవ్వించిన భరద్వాజ తీర్థంలో ఈ నెల 10న సోమవారం లక్ష దీపోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయల ఇఓ డి.బాపిరెడ్డి తెలిపారు. శ్రీకాళహస్తి పట్టణంలోని నాలుగు కోనేరుల్లో దీపార్చన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 19 'స్వర్ణమ్మ' నదీ హారతులను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

# తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలం



కోవూరు (నెల్లూరు), నవంబరు 7 ప్రభాతవార్త: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తల బలం కారణంగా గత నాలుగు దశాబ్దాలకు పైగా పటిష్టంగా ఉందని కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అన్నారు. కోవూరు మండలం లేగుంటపాడు సమీపంలోని విపిఆర్ అతిథి గృహంలో శుక్రవారం సాయంత్రం కోవూరు మండలానికి సంబంధించి ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జెండాను మోసిన కార్యకర్తలను మరిచిపోయే ప్రసక్తే లేదన్నారు. కార్యకర్తలు కానీ, ప్రజలు కానీ ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తమ ఇంటి తులుపులు ఎప్పుడూ తెరచే ఉంటాయన్నారు. ఎక్కడైనా తప్పులు జరిగి ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే వాటిని సరిదిద్దుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. పెన్నా ఆయకట్టు చైర్మన్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి, జొన్న వాడ దేవస్థాన చైర్మన్ అశోక్‌రెడ్డి, మండల పరిషత్ అధ్యక్షురాలు పార్వతి, సర్పంచ్‌లు విజయ, మాజీ ఎంపీపీ రమణమ్మ, ఉమా, మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, నాయకులు ఇంతా మల్లారెడ్డి, కాటంరెడ్డి కృష్ణారెడ్డి, నీటి సంఘం అధ్యక్ష కార్యదర్శులు అత్తిపల్లి శివ ప్రసాద్‌రెడ్డి, గాదిరాజు సుధాకర్, బాలరవి, వెంకట్, సుబ్బానాయుడు, చింతలపూడి పెంచలయ్య, పురుషోత్తం, నాగరాజు, సునీల్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఎన్నికల సంఘం బిజెపి చేతిలో కీలుబొమ్మ



విజయవాడ, నవంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి: కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పుడు స్వయం ప్రతిపత్తి సంస్థ కాదని, బిజెపి చేతిలో కీలుబొమ్మగా మారిందని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. విజయవాడలో మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో ఎన్నికల కమీషన్, కేంద్ర ప్రభుత్వ విధానాలపై పలు ఆరోపణలు చేసారు. మోడీ మోసం మీద, ఎన్నికల సంఘం దగాపై రాహుల్ గాంధీ హైడ్రోజన్ బాంబు పేల్చారన్నారు. ఈ దొంగ ఓట్లు లేకుంటే కాంగ్రెస్ భారీ మెజారిటీతో గెలిచేది అని చెప్పారు. ఎన్నికల సంఘం తన బాధ్యతను విస్మరించి బిజెపి పక్షాన పనిచేస్తోందని మండిపడ్డారు. ఓటర్ జాబితా, సిసిటివి ఫుటేజ్, డిజిటల్ డేటా వంటి ఆధారాలు ఇవ్వకుండా ఎన్నికల సంఘం దాచి పెడుతోందని తెలిపారు. బిజెపికి ఎన్నికల సంఘం మరో ఆర్ఎస్ఎస్ వంటి వ్యవస్థ అని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ చేపట్టిన "ఓట్ చోర్ - గద్దీ చోర్" ప్రచారానికి ప్రజలు విశేష స్పందన చూపారని చెప్పారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల నుంచి 17.65 లక్షల మంది ప్రజలు సంతకాలు చేసి ఈ ఉద్యమానికి మద్దతు తెలిపారని వివరించారు. ఈ సంతకాలను ఢిల్లీకి పంపిస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ సీనియర్ నేతలు జెడి శీలం, మస్తాన్ వలి, నరహరిశెట్టి నరసింహారావు ఇదే ప్రకటనలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలపై విమర్శలు చేసారు.

# నేడు కలెక్టరేట్లో జిల్లా సమీక్ష కమిటీ సమావేశం : కలెక్టర్ మహేష్ కుమార్



**అమలాపురం ( కోనసీమ బ్యూరో ), నవంబర్ 07 ( ప్రభాతవార్త ) :** ఈ నెల 8 న శనివారం స్థానిక కలెక్టరేట్ నందు నిర్వ హించనున్న జిల్లా సమీక్ష కమిటీ సమావేశానికి జిల్లా స్థాయి అధికారులు పూర్తి సమాచారం మొంథా తుఫాన్ ప్రభావంతో జరిగిన నష్టం స్పష్టంగా తెలిసేలా శాఖల వారి జరిగిన నష్టాల అంచనాల నివేదికలతో హాజరు కావాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా స్థాయి అధికారులతో జిల్లా సమీక్ష కమిటీ కి సంబంధిం చి ముందస్తు సమీక్ష ను జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడు తూ జిల్లా సమీక్ష కమిటీ సమావేశం ప్రాధాన్యత అంశాలుగా మొ%శీ%థా విపత్తు ప్రభావం ద్వారా జరిగిన నష్టపరిహార అంచనాల నివేదికలు వ్యవసాయ, ఉద్యాన, మత్స్య పశుసంవర్ధక మార్కెటింగ్ శాఖతదితర శాఖలకు సంబంధించి ప్రధానమైన సమీక్ష జరు గుతుందన్నారు. జిల్లా స్థాయి అధికారులు తమ తమ శాఖలకు సంబం ధించిన పూర్తి సమాచారం తో హాజరు కావాలన్నారు కమిటీ సభ్యులు ప్రజాప్రతి నిధులు అడిగిన అంశాలపై సమగ్రమైన వివరణ సూటి గా సమాధానాలు ఇవ్వా లని అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కే మాధవి, జిల్లా వ్యవసాయ అధికారి వి బో సుబాబు , జిల్లా ఆర్థిక గణాంక శాఖ అధికారి మురళీకృష్ణ, మార్కెటింగ్ శాఖ ఏడి కె విశాలాక్షి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వెంకట్రావు తదిత రులు పాల్గొన్నారు.




తూర్పుగోదావరి, కాకినాడ
డా.బి.ఆర్ అంబేడ్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త




# వందేమాతరం గీతానికి నేటికీ 150 ఏళ్లు

## పి.గన్నవరం,అంబాజీపేటలలో వందేమాతరం గీతాలాపన వేడుక



**అంబాజీపేట, నవంబర్ 07 ( ప్రభాతవార్త )** బకించంద్ర చటర్జీ రచించిన వందేమాతరం గీతానికి 150 ఏళ్లు పూర్తయ్యాయని, మరో వెయ్యేళు గడిచినా భారతీయుల్లో వందేమాతరం గీతం స్ఫూర్తి అలాగే నిలిచి ఉంటుందని పి.గన్నవరం సీఐ ఆర్.భీమరాజు అన్నారు. వందేమాతరం గీతాన్ని రచించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పి.గన్న వరం, అంబాజీపేట పోలీస్ స్టేషన్ లలో వందేమాతరం గీతాలావన వేడుకను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ భీమ రాజు మాట్లాడుతూ వందేమాతరం గీతంను బకించంద్ర చటర్జీ1852లో రచించగా 1875లో జాతీయగీతంగా గుర్తింపబడిందని,దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక 1950 జనవరి 24న రాజ్యాంగ సభ వందేమాతరం గీతాన్ని జనగణమనతో సమానంగా జాతీయ గీతంగా గౌరవించిందన్నారు. దేశ స్వాతంత్రం కోసం జరిపిన పోరాటంలో చూపించిన స్ఫూర్తిని, సేవను ప్రతి పోలీస్ అధికారి,సిబ్బంది కొనసాగిం చాలని సిఐ భీమరాజు అన్నారు. అంతకుముందు భారతమాత, మహాత్మగాంధీ చిత్రపటాలకు పూలమా లలు వేసారు. అనంతరం వందేమాతరం గీతాపాలన చేశారు. ఎస్ఐలు బి.శివకృష్ణ, కె.చిరంజీవిల ఆధ్వర్యం లో జరిగిన ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మరో వెయ్యేళ్లయినా వందేమాతరం

# స్ఫూర్తి రగులుతూనే ఉంటుంది : ఎమ్మెల్యే బండారు సత్యానందరావు




**కొత్తపేట, నవంబర్ 07 ( ప్రభాతవార్త )** భారత స్వాతంత్ర్య సమర చరిత్రలో అజరామరమైన నినాదం వందేమాతరం ం అది కేవలం పదం కాదు, దేశభక్తి జ్వాలను రగిలిం చిన ఒక భావజాలం. అదే స్ఫూర్తితో వందే మాతరం గీతం రచించబడి150వ వసంతం గుర్తు చేసుకుంటూ వాడపాలెం పాఠశాలలో ఘనంగా వేడుకలు జరిగాయి. ఈ కార్యక్ర మానికి కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమం ప్రారంభంలో విద్యార్థులు వందేమాతరం గీతాన్ని ఆలపించారు. అనంతరం ఎమ్మెల్యే విద్యార్థులతో కలిసి వందేమాతరం గీతాన్ని ఆలపించి, స్వాతంత్ర్య పోరాటంలో ఆ గీతం పోషించిన కీలక పాత్రను గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ ం "వందేమాతరం గీతం భారతీయుల గుండెల్లో దేశభక్తి స్ఫూర్తిని నింపిన మహోన్నత గీతం. బ్రిటీష్ వాడి గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన నినాదం వందేమాతరం. ఈ గీతం భారత స్వాతంత్ర్య ఉద్యమానికి ఆత్మవిశ్వాసం ఇచ్చిందన్నారు. 1875 నవంబర్ 7న బంకిమ్‌చంద్ర ఛటర్జీ ఈ గీతాన్ని రచించి, దేశానికి ఒక చారిత్రక బహుమతిని అందించారు," అన్నారు. "స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1950 జనవరి 24న రాజ్యాంగ సభ వందేమాతరం గీతాన్ని జనగణమనతో సమానంగా గౌరవిస్తూ జాతీయ గీతంగా గుర్తించింది. ఈ గీతం దేశం కోసం ప్రాణాలు అర్పించిన లక్షలాది మంది స్వాతంత్ర్య సమరయోధులకు స్ఫూర్తి నిలిచింది. మరో వెయ్యేళ్లు గడిచినా వందేమాతరం స్ఫూర్తి భారతీయుల్లో శాశ్వతంగా రగులుతూనే ఉంటుంది," అని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. వందేమాతరం గీతం 150వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా వేడుకలు జరుగుతున్నాయని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు నేతృత్వంలో దేశవ్యాప్తంగా ఈ మహోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల స్కూల్ చైర్మన్ గోవింద్ స్వామి, కంఠం శెట్టి శ్రీనివాస్,ఎం డి ఓ నరేష్ కుమార్,ఎం. ఇ. ఓ హరిచంద్రప్రసాద్, బండారు బులితాతయ్య, పప్పుల కొత్తయ్య మరియు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల్లో దేశభక్తి, జాతీయ స్ఫూర్తి పెంపొందించేందుకు ఈ వేడుకలు ఉపయోగపడతాయని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు.

# విద్యుత్ స్తంభాల మార్పు పనులు

# వేగంగా పూర్తిచేయాలి : ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



**కొత్తపేట, నవంబర్ 07 ( ప్రభాతవార్త ) :** రహదారి విస్తరణ పనుల్లో భాగంగా చేపడుతున్న విద్యుత్ స్తంభాల మార్పు (లైన్ షిఫ్టింగ్) పనులను వేగంగా పూర్తిచేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సూచించారు. వాడపాలెం - కొత్తపేట రోడ్డు విస్తరణలో భాగంగా విద్యుత్ స్తంభాల మార్పు పనులను శుక్రవారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, కొత్తపేట జనసేన ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్ తో కలిసి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం నూతన స్తంభాల ఏర్పాటు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,"రోడ్డు విస్తరణ పనులు వేగంగా జరగాలి. విద్యుత్ శాఖ అధికారులు, కాంట్రాక్టర్లు సమన్వయంతో లైన్ షిఫ్టింగ్ పనులు పూర్తి చేయాలి. ప్రజలకు అసౌకర్యం కలగకుండా పనులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాస్, బూసి భాస్కరావు జయలక్ష్మి,చావేళ్ల జగన్నాధం,బండారు వీరబాబు, యెలిశెట్టి ప్రభాకర్, మీద్దె ఆదినారాయణ, పప్పుల కొత్తయ్య మరియు కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగావందేమాతరం గీతం 150 వసంతాల వేడుక



**పిఠాపురం, నవంబర్ 07 ( ప్రభాతవార్త ) :** వందేమాతరం గీతం వెలువడి 150 వసంతాలు పూర్తయిన సందర్భంగా ఆర్. ఆర్. బిహెచ్. ఆర్. ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ సన్మోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వాతంత్ర సమరయోధుల చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. అలాగే వందేమాతర గీతం వ్రాసిన బం కి0 చంద్ర చటర్జీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. విద్యార్థులతో కలిసి వందేమాతరం పూర్తి గీతాన్ని ఆలపించారు. ఈ వందేమాతరం గీతాలాపన కార్యక్రమానికి డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి. జనసేన పార్టీ ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాసరావు,మాజీ శాసనసభ్యులు పెండెం దొరబాబు, ఎస్వీఎస్ఎన్ వర్మ, బిజెపి ఇన్చార్జ్ గండి కొండలరావు,దాట్ల సూర్యనారాయణ రాజు విచ్చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ,ఎంఈఓ శ్యాంబాబు, టిడిపి,జనసేన పార్టీ నాయకులు, జనసేనవీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# వందేమాతరం గేయం భారతీయుల్లో దేశభక్తిని పెంపొందించింది : ఎంపీడీవో కిషోర్




**శంఖవరం , నవంబర్ 07 ( ప్రభాతవార్త ) :** వందేమాతర గేయం భారతీయుల్లో దేశభక్తిని పెంపొందించిందని శంఖవరం ఎంపీడీవో కిషోర్ పేర్కొన్నారుదేశభక్తి గీతం "వందేమాతరం" రచించి 150 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా శంఖ వరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శు క్రవారం సామూహిక వందేమాతరం గానం ఆలపిం చారు . ఈ సందర్భంగా వందేమాతరం గేయ రచయిత బంకించంద్ర ఛటర్జీ చిత్ర పటానికి పూలమాలలతో అలంకరించారు. వందేమాతరం గేయం భారతీయుల్లో దేశభక్తిని పెంపొందింప చేసిందన్నారు. స్వరాజ్య పోరా టంలో ప్రతి ఒక్కరిలోను స్వతంత్ర స్ఫూర్తిని నింపిందని పరిషత్ అభివృద్ధి అధికారి జి. కిషోర్ పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి పుష్యమి కీర్తి మండల ఎడ్యుకేషన్ అధికారిఎస్వి రమణ ,జూనియర్ అసిస్టెంట్ గురయ్య, టైపిస్ట్ సత్తిబాబు మరియు ఎంజిఎన్ఆర్ఎస్ సిబ్బంది పాల్గొనడం జరిగినది.

# ఉపాధి హామీ పనుల గుర్తింపు గ్రామసభ





**సీతానగరం, నవంబర్ 07 ( ప్రభాతవార్త ) :** మండలంలోని చీపురుపల్లి గ్రామపంచాయతీలో శుక్రవారం టెక్నికల్ అసిస్టెంట్ సింహాద్రి ఆధ్వర్యంలో ఉపాధి హామీ పనుల గుర్తింపు గ్రామసభ నిర్వహించారు. గ్రామ సభలో 31 పంట కాలవలు, 2చెరువులు , 5 ఇంకుడు గుంతలు, 2 ట్రెంచ్ వర్కులు , 1 ఎకరం హార్టికల్చర్ పనులను గుర్తించారు. అదేవిధంగా జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరు ఈకేవైసీ వెరిఫికేషన్ చేయించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, పంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ ఎస్.రాంబాబు, ఉపాధి శ్రామికులు, తదితరులు పాల్గొన్నారు.

# డివైడర్ ను ఢీకొని వ్యక్తి మృతి



**నిడదవోలు, నవంబర్ 07 ( ప్రభాతవార్త )** పట్టణంలో ఓవర్ బ్రిడ్జ్ వద్ద శుక్రవారం ఉదయం త్రిబుల్ రైడ్ చేస్తున్న ద్విచక్ర వాహనం డివైడర్ ను ఢీకొని వ్యక్తి ఘటనా స్థలంలోనే మృతి చెందిన సంఘటనహా చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో చాగల్లు మండలం మార్కొండపాడు కు చెందిన నామన కోట సత్యం అక్కడిక్కడే మృతి చెందగా, అరిగళ్ళ సాయిదుర్గ, నాగిరెడ్డి మంగెస్కేర్ ఇద్దరికీ తీవ్ర గాయాలు అయ్యాయి. తక్షణ సహాయం కోసం స్థానికులు హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం నిమిత్తం రాజమండ్రి తరలించారు. యువకులు ముగ్గురు ఉదయం టైల్స్ పని నిమిత్తం వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఘటనా స్థలానికి చేరుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న నిడదవోలు పోలీసులు.

## జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం



**ఆత్రేయపురం,నవంబర్ 07 ( ప్రభాతవార్త )** క్యాన్సర్ బారిన పడకుండా అందరూ స్కానింగ్ చేయించుకోవాలని స్కానింగ్ తోనే క్యాన్సర్ సాధ్యం అవుతుందని వైద్యాధికారి పి. సౌమ్య అన్నారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రమైన ఆత్రేయపురం లో ఇంటింటికి తిరిగి ప్రజలకు క్యాన్సర్ పై అవగాహన కల్పించారు. గ్రామ వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి పి. సౌమ్య మాట్లాడుతూ క్యాన్సర్ పై అందరికీ ఓరల్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్ పై అవగాహన కల్పించారు.ముందుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు వందేమాతర గీతం 150 సంవత్సరాల పూర్తయిన సందర్భంగా శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు వైద్యాధికారి పి. సౌమ్య, టి. అరుణ్ కుమారి, సబ్ యూనిట్ హెల్త్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు పాల్గొని వందేమాతరం జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ విజయ భాను, పి హెచ్ ఎన్ నాగమణి, ఏఎన్ఎంలు, ఆశలు, ఎం ఎల్ హెచ్ పి లు, హెల్త్ అసిస్టెంట్ మూర్తి, , ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


**E-టెండరు ప్రకటన**

డా.బి.ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, ఆత్రేయపురం మండలం, వాడపల్లి గ్రామం, శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం యొక్క ఈ క్రింది పనుల నిమిత్తం E - టెండరు పిలవబడుచున్నది.

| S.No | Name of the work | Est.Amount | Start date | End date |
|---|---|---|---|---|
| 1 | Providing temporary shed infront of kesakhandana sala | Rs.4.85 lakhs | 06-11-2025 | 20-11-2025 |
| 2 | Improvement works for doors in Alwar mandapam and Extension of Rs.50/ -Q- line flooring area | Rs.3.40 lakhs | 06-11-2025 | 20-11-2025 |

మిగిలిన వివరముల కొరకు https://tender.apeprocurement.gov.inలో చూడవచ్చును.

తేది: 07-11-2025
వాడపల్లి.

శ్రీ నల్లం సూర్య చక్రధర రావు
Deputy Commissioner& Executive Officer


# ప్రతి పౌరునికీ సమ న్యాయం, సమాన హక్కులే న్యాయ సేవాధికార సంస్థ లక్ష్యం

## జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత




**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, నవంబర్ 07 ( ప్రభాతవార్త ) :** జాతీయ న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమం జరి గింది. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయ మూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ ఎస్ఏ) చైర్మన్ గంధం సునీత ప్రధాన అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ - రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ప్రధాన ఉద్దేశ్యం మహిళలు, పిల్లలు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్లు, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల లబ్ధి అందేలా చూడడం అని తెలిపారు. ఆర్టికల్ 39-ఏ ప్రకారం ప్రతి పౌరుడు న్యాయ సహాయం పొందే హక్కు కలిగివున్నాడని, ఆర్టికల్స్ 1, 14, 22 ప్రకారం అందరికీ సమాన హక్కులు, సమ న్యాయం లభించాలని రాజ్యాంగం స్పష్టం చేస్తోందని వివరించారు. ఈ హక్కుల సాధనకై న్యాయ సేవాధికార సంస్థలు ఒక గొడుగు వేదికలు గా ఏర్పాటయ్యాయని ఆమె పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని 1,374 గ్రామాల్లో అవగాహన చర్యలు చేపట్టినట్లు వివరించారు. వృద్ధాశ్రమాలు, వసతి గృహాలు, ప్రభుత్వ పాఠశాలలు మొదలైన చోట్ల పర్యటించి, అందిస్తున్న సౌకర్యాలపై పరిశీలనలు చేసి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి దృష్టికి తీసుకెళ్లి, రాష్ట్ర హైకోర్టుకు నివేదికలు పంపుతున్నట్లు తెలిపారు. "రాజీ మార్గం రాజమార్గం" అనే నినాదంతో న్యాయ సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు.ప్రజలకు సులభంగా, అందుబాటులో న్యాయ సేవలు అందించే క్రమంలో న్యాయ సేవాధికార సంస్థ పాత్ర ప్రశంసనీయమని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఏడీషనల్ ఎస్పీ (లా & ఆర్డర్) ఏ.వి. సుబ్బరాజు, 9వ అదనపు జిల్లా జడ్జి ఎం. మాధురి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఎన్. శ్రీలక్ష్మి, బార్ అసోసియేషన్ ప్రతినిధి పి.వి.ఎస్.కె. శోభనాధి శాస్త్రి, ఇతర న్యాయ మూర్తులు, న్యాయవాదులు, ప్యానల్ అడ్వకేట్లు, లీగల్ ఎయిడ్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# వైసీపీ నేతలు నకిలీ మద్యం డ్రామాలకు

# ప్రజలే తగిన బుద్ధి చెబుతారు : ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



**రావులపాలెం, నవంబర్ 07 ( ప్రభాతవార్త )** జగన్మోహన్ రెడ్డి మాట్లాడే అబద్దాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, వైసిపి నాయకులు తీరు మార్చుకోవాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కోరారు. శుక్రవారం ఆయన రావులపాలెం టిడిపి క్యాంప్ కార్యాలయంలో పార్టీ నేతలు సమావేశం జరిగింది. సత్యానందరావు మాట్లాడుతూ రాష్టంలో తుఫాన్ కారణంగా అన్న దాతలు నష్ట పోతే, రైతుల పరామర్శల పేరుతో జగన్మోహన్ రెడ్డి బల ప్రదర్శన చేస్తున్నారని విమర్శించారు.సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్ రాష్ట్ర పునర్నిర్మాణం కొరకు శ్రమిస్తుంటే, ఆరోపణలు చేసే పనిలో జగన్ నిమగ్నం అయ్యారని విమర్శించారు. నిజాయితీ పాలనకు ప్రజలు అండగా ఉన్నారని, అబద్దాలతో రాజకీయాలు చేసే కాలం ముగిసిందని వివరించారు. తుఫాన్ సమయంలో ప్రజలకు వైసీపీ అండగా నిలవ లేక పోయింది. ఒక్క వాటర్ ప్యాకెట్ కూడా పంపించలేదు. గత ప్రభుత్వ హయాంలో తొమ్మిది సార్లు తుఫాన్ లు వచ్చి రైతులు నష్ట పోతే తగు సహాయం చేయలేకపోయారని అన్నారు. కోటి సంతకాలు, నకిలీ మద్యం డ్రామాలకు తెరదించకపోతే వైసీపీ నేతలు కు ప్రజలు తగిన విధంగా గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గుత్తుల రాంబాబు, కొప్పిశెట్టి ప్రసాద్, పాలింగి రవిచంద్ర, పెచ్చెట్టి చిన్నారావు, పార్టీ శ్రేణులు, నాయకులు పాల్గొన్నారు.

# గుర్తు తెలియని మృతదేహానికి చారిటబుల్ ట్రస్ట్ అంత్యక్రియలు



**అంబాజీపేట, నవంబర్ 07 ( ప్రభాతవార్త ) :** మండలంలోని వాకలగురువు పుష్కరాలు రేవులో తేలియాడుతున్న గుర్తు తెలియని సుమారు 34 నుండి 40 ఏళ్ళ మధ్య ఉన్న మగ శవాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహానికి సంబంధించిన బంధువులు ఎవరూ రాకపోవడంతో అమలాపురం ఏరియా ఆసుపత్రిలో పంచనామా నిర్వహించారు. 72 గంటల అనంతరం బంధువులు ఎవరూ రాకపోవడంతో అనాధ శవంగా భావించి అంబాజీపేట పోలీస్‌లు అంబాజీపేటకు చెందిన నాగా బత్తులు సాహెబ్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ నాగాబత్తుల వెంకట సుబ్బారావుకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన తన సిబ్బంది,పోలీసుల సహకారంతో అమలాపురం మున్సిపల్ కైలాస భూమి లో అంత్యక్రియలు నిర్వ హించి,నివాళులర్పించారు. నాగా బత్తుల సాహెబ్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ సుబ్బారావు సేవలను పలువురు కొనియాడారు.

## వైఎస్సార్సీ నేత ఆత్మహత్య

తణుకు, నవంబరు 7 ప్రభాతవార్త: తణుకు పట్టణానికి చెందిన వైసీపీ నేత వీరమల్లు ఫణీంద్రకుమార్ (45) గురువారం రాత్రి ఆయన నివాసంలో ఉరి వేసుకుని ఆత్మ హత్య చేసుకున్నారు. తణుకు పట్టణ ఎస్ఐ కె.శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తణుకు బొమ్మల వీధిలో నివాసం ఉంటున్న ఫణీంద్రకుమార్ గురువారం ఉదయం తన భార్యతో మాటామాటా పెరిగి మనస్తాపం తో బయటకు వెళ్లిపోయారు. అనంతరం మధ్యాహ్నం తిరిగి ఇంటికి వచ్చిన ఆయన తన బెడ్రూమ్‌లోకి వెళ్లి తలుపు వేసుకున్నారు. అయితే పడుకున్నారని భావించిన కుటుంబ సభ్యులు సాయంత్రం సమయంలో తలుపులు కొట్టినప్పటికీ స్పందన లేకపోవడంతో బెడ్రూం తలుపులు పగలగొట్టారు. ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేళాడుతూ కనిపించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం తెలుసుకున్న మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు హుటాహుటిన ఫణీంద్రకుమార్ నివాసానికి వచ్చి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహానికి తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం బంధువు లకు అప్పగించారు. పట్టణ ఎస్ఐ కె. శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తుపాన్ నష్టంపై 10న కేంద్ర బృందం రాక

గన్నవరం, నవంబరు 7 ప్రభాతవార్త: మొంథా తుపాన్ నష్టాన్ని పరిశీలించేందుకు ఈనెల 10వ తేదీ కేంద్ర బృందం జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ డికె.బాలాజీ తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఉదయం కృష్ణాజిల్లా కంకిపాడు మండలంలో తుపాన్ కారణంగా దెబ్బతిన్న పంటపొలాలను బాలాజీ పరిశీలించి రైతులతో మాట్లా డారు. ఈదురుగాలులకు వరిపైరు నేలవాలి పోవటంతో పంటకు తీరని నష్టం జరిగిందని రైతులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ గన్నవరం యండిఓ కార్యాలయాన్ని సందర్శించి ఇక్కడ తుపాన్ నష్టం వివరాలతో ఫోటో ప్రదర్శన ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.



సహస్ర దీపాలంకరణలో అనుగ్రహిస్తున్న అమ్మవార్లు

## దుర్గమ్మ ఆలయంలో వేదోక్తంగా కార్తీక పూజలు


ఇంద్రకీలాద్రి, నవంబరు 7 ప్రభాతవార్త: దుర్గమ్మవారి ఆలయంలో గురువారం కార్తీకమాస పూజలు వేదోక్తంగా నిర్వహించారు. ఇఒ, చైర్మన్లు కార్యక్రమంలో పాల్గొనగా వేదపండితులు అర్చనలు చేశారు. కార్తీకమాస పూజల్లో భక్తులు పాల్గొనాలని ఇఒ చైర్మన్లు తెలిపారు. సహస్ర దీప కాంతులతో శ్రీ స్వామి అమ్మవార్లు భక్తులను ఊంజల్ సేవలందుకుని అనుగ్రహించారు. పవిత్ర కార్తీకమాసం సందర్భంగా సహస్ర లింగార్చన సేవలో పాల్గొనాలని భక్తులకు ఇఒ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధా కృష్ణలు తెలిపారు. అర్చకస్వాములు వేదమంత్ర పఠనాల తో శ్రీ స్వామివారికి సేవలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. సాయంసంధ్యాకాలంలో శ్రీ స్వామి అమ్మవార్లు ఊంజల్‌పై భక్తుల సేవలందుకుని అనుగ్రహించారు. ఈ సందర్భంగా చతుర్వేద పఠనాలు పండితులు చేశారు.

### సీతానగరంలో కృత్తికా దీపోత్సవం



శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల అనుబంధ ఆలయ మైన శ్రీమద్వీరాంజనేయ సమేత కోదండ రామ స్వామివారి ఆలయంలో గురువారం జరిగిన కృత్తికా దీపోత్సవంలో ఇఒ వికె శీనా నాయక్, చైర్మన్ రాధాకృష్ణలు పాల్గొన్నారు. దుర్గమ్మ ఆలయంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన వి.లక్ష్మినారాయణ, గాయత్రి దంపతులు వారి కుటుంబీకులు మహాంకాళిరావు, రత్నకుమారిపేరిట రు.1,00,116ల విరాళాన్ని శుక్రవారం అందించారు. అలాగే విజయవాడకు చెందిన రత్నయ్య, దంపతులు రు.1,01,116ల విరాళం అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం వారికి ప్రసాదం, శేషవస్త్రం, మెమంటో అందించారు. వేదపండితులు ఆశీర్వచనాలు అందించారు.

### భక్తుల సౌకర్యాల పెంపు



దుర్గమ్మవారి భక్తులకు పలు సౌకర్యాల కల్పన చేయడానికి పాలకమండలి సమావేశం నిర్ణయించింది. శుక్రవారం జరిగిన బోర్డు మీటింగ్‌లో ఇఒ వికె శీనా నాయక్, చైర్మన్ రాధాకృష్ణ, పాలకమండలి సభ్యులు పాల్గొని పలు తీర్మానాలు చేశారు. ఆలయంలో భక్తులకు అందుబాటులో మార్గనిర్దేశం కోసం సూచీ బోర్డుల ఏర్పాటు, వేదపాఠశాలనుండి ఆలయానికి చేరుకోడానికి బస్సు ఏర్పాటు, ఆలయం తెరిచి వుంచినంతసేపు ఉచిత ప్రసాద వితరణ, కుంకుమ ప్రసాదం వితరణ, కొండపైన, క్రింద దేవస్థానం స్టాల్స్ ఏర్పాటు చేసి కొబ్బరికాయలు, పంచెలు, కుంకుమ, చీరలు, పలు పూజా సామాన్లు అందుబాటులో వుంచడం, కేశఖండన శాలలో మహిళలు దుస్తులు మార్చుకోడానికి గదుల ఏర్పాట్లు, అన్నదానం క్యూలైన్లో కూర్చునే సౌకర్యం, ఆలయంలో ప్రయివేటు విక్రయ షాపులు నిషేధం తదితర అంశాలను ప్రస్తావించి అమలు చేయడానికి చర్యలు తీసుకుంటామని ఇఒ శీనా నాయక్, చైర్మన్ రాధాకృష్ణ తెలిపారు.



వందేమాతరం గేయానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా విజయవాడలో జాతీయ గీతాలాపన కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ ఇతర ప్రముఖులు

## వందేమాతరం స్ఫూర్తితో వికసిత్ భారత్ నిర్మాణం

● విద్వాంసులు నుంచి విప్లవకారుల వరకు ఈ గేయం కదిలించింది ● రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

విజయవాడ, నవంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి: దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో కోట్లాది భారతీయుల్లో వందేమాతరం గేయం స్ఫూర్తి నింపిందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, ఎన్టీఆర్ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. విద్వాంసులు నుంచి విప్లవకారుల వరకు ఈ గేయం కదిలించిందన్నారు. వందేమాతరం స్ఫూర్తితో వికసిత్ భారత్ నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. వందే మాతరం గేయానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ, జిల్లా అధికార యంత్రాంగం, కేబీఎన్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం కేబీఎన్ కళాశాలలో ప్రత్యేక వేడుకలు జరిగాయి.

ఇందులో భాగంగా మంత్రి సత్యకుమార్ యాదవ్, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు యలమంచిలి సత్యనారాయణ(సుజనా చౌదరి), రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సమితి ఛైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి, ఏపీ నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఆర్.మల్లికార్జునరావు, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, కేబీఎన్ కళాశాల సెక్రటరీ టి.శ్రీనివాస్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డా. వి.నారాయణరావు, ప్రిన్సిపల్ డా. జి.కృష్ణవేణి తదితరులతో కలిసి భరతమాత చిత్రపటానికి పూలమాలలు అలంకరించారు. అదేవిధంగా వందే మాతరం రచయిత బంకించంద్ర చటర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం దాదాపు మూడువేల మంది విద్యార్థులతో వందేమాతరం గేయాలాపన చేశారు. ప్రధానమంత్రి సందేశాన్ని వర్చువల్‌గా వీక్షించారు.

ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని ఎందరో ప్రాణాలు త్యాగం చేశారని.. ఈ సందర్భంగా ఆ మహనీయులకు నివాళి అర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. వందేమాతరం గేయం స్వాతంత్ర్య ఉద్యమానికి వేదికగా నిలిచిందని, ప్రజల్లో పోరాట స్ఫూర్తిని నింపిందన్నారు. ఈరోజు మనం స్వేచ్ఛా వాయువులు పీల్చుకునేందుకు కారణమైన వందేమాతరం ఔన్నత్యాన్ని యువత తెలుసుకొని, దేశభక్తిని, జాతీయతా భావనను పెంపొందించుకొని ముందడుగు వేయాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఎన్టీ ఆరోగ్య విశ్వవిద్యాలయంలో...

వందేమాతరం గేయాన్ని స్ఫూర్తిగా తీసుకొని ప్రతీ ఒక్కరూ ఐక్యంగా దేశాభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా వి.రాధికారెడ్డి అన్నారు. నగరంలోని డా.ఎన్‌టిఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయంలో శుక్రవారం వందేమాతరం 150 సంవత్సరాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. వందేమాతరం గేయాన్ని డిప్యూటీ రిజిస్ట్రార్లు, జాయింట్ రిజిస్ట్రార్లు, సిబ్బందితో రిజిస్ట్రార్ రాధికా రెడ్డి ఆలపించి వేడుకలను ప్రారంభించారు. వందేమాతరం వేడుకలలో పాల్గొనడం తమకు చాలా ఆనందంగా ఉందని రిజిస్ట్రార్, డా. వి.రాధికా రెడ్డి, డిప్యూటీ రిజిస్ట్రార్లు, జాయింట్ రిజిస్ట్రార్లు తెలిపారు.

## అట్టహాసంగా రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు



అనంతపురం కలెక్టరేట్, నవంబరు 7 ప్రభాతవార్త: అనంతపురం జిల్లాలో 7వ రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవములు ఘనంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం అనంతపురం నగరంలోని ఆర్డీటీ స్టేడియంలో 3 రోజుల పాటు నిర్వహించే 7వ రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవములను ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి సీసీఎల్ఏ చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.జయలక్ష్మి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్, ఉమ్మడి జిల్లాల జాయింట్ కలెక్టర్‌లు శివ్‌నారాయణ్ శర్మ, మౌర్య భరద్వాజ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, అమరావతి ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం వందేమాతరం 150వ స్మారకోత్సవాల సందర్భంగా సీసీఎల్ఏ, స్పెషల్ సిఎస్, ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, తదితరులు వందేమాతరం జాతీయ గీతం ఆలాపన చేశారు. ముందుగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వచ్చిన రెవెన్యూ ఉద్యోగులు మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీసీఎల్ఏ , స్పెషల్ సిఎస్ జి.జయలక్ష్మి మాట్లాడుతూ రెవెన్యూ ఉద్యోగులు ఒక టీమ్‌గా కలిసి పనిచేయాలి.. ఉద్యోగులంతా మంచి ఉత్సాహభరిత వాతావరణంలో క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాల్లో పాల్గొనాలన్నారు. క్రీడలకు సంబంధించి కంటింజెంట్ కెప్టెన్లతో ప్రమాణం చేయించారు. తదనంతరం క్రీడలను సీసీఎల్ఏ, స్పెషల్ సిఎస్ ప్రారంభించారు. మార్చ్ ఫస్ట్‌లో కాకినాడ జిల్లా 1వ బహుమతి, 2వ బహుమతి అనంతపురం జిల్లా, 3వ బహుమతి ఈస్ట్ గోదావరి జిల్లా, 4వ స్థానం నంద్యాల జిల్లా కైవసం చేసుకోగా, వారికి సీసీఎల్ఏ స్పెషల్ సిఎస్ చేతులమీదుగా చిరు సత్కారం చేశారు. అనంతరం సీసీఎల్ఏ కమిషనర్, కలెక్టర్, జెసి, అసిస్టెంట్ కలెక్టర్ క్రికెట్ ఆటలో పాల్గొని బౌలింగ్, బ్యాటింగ్ చేశారు.




## మాటల వాణ్ని కాదు.. పాటల వాణ్ని

● ప్రఖ్యాత సంగీత మాంత్రికుడు ఇళయరాజా

విజయవాడ, నవంబరు 7 ప్రభాతవార్త: తాను మాటల వాణ్ని కాదు.. పాటల వాణ్ని.. మాటలు మాట్లాడటం కంటే నాకు పాటలు పాడటమే సులభం అనీ "నిజజీవితంలో జరిగిన ఘటనలు, పరిణామాలే నా స్వరాలనీ. వాటినే తాను పాటలుగా మార్చాను" అని ప్రఖ్యాత సంగీత మాంత్రికుడు ఇళయరాజా అన్నారు. 8న విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ట్రెండ్ సెట్టర్ ఈవెంట్స్ సంస్థ ఆధ్వర్యంలో మ్యూజికల్ నైట్ సంబంధించి శుక్రవారం మీడియాతో ముచ్చటించారు. తాను స్వరపరిచిన గీతాలను విన్నవారికి తమ జీవితాల్లో జరిగిన ఘటనలను గుర్తుకు చేసుకుంటారని, ఆ పాటతో ఆ సందర్భాలు ఆ జీవిత సంఘటనలు మనసులో ముద్రితమై ఉంటాయన్నారు. ఇప్పుడు పాట రాస్తున్న వారు ఎవరో పాడే వారికి తెలియడం లేదని ఆవేదన వ్యకం చేశారు. గాయనీ గాయకులు ఒకరికొకరు తెలియని పరిస్థితి ఇప్పుడు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మ్యూజికల్ నైట్ నిర్వహిస్తున్న ట్రెండ్ సెట్టర్స్ లైవ్ అధినేత సుధాకర్, పద్మనాభుని రవి, అంబటి శివ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆచార్య రాజూరు రామకృష్ణారెడ్డికి రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ ఫెలోషిప్



అనంతపురం, నవంబరు 7 ప్రభాతవార్త బ్యూరో: రాయల సీమలో ఓ మారుమూల గ్రామం లో జన్మించి వివిధ విశ్వవిద్యాల యాల్లో పనిచేసి పదవీ విరమణ పొందిన ఆచార్య రాజూరు రామ కృష్ణారెడ్డికి అరుదైన గౌరవం దక్కింది. రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ ఫెలోషిప్ ఆచార్య రావూరికి దక్కడం విశేషం. పదవీ విరమణ తర్వాత కొంతమంది ఏ పని చేయకుండా, ఏ యాపకము పెట్టు కోకుండా జీవితం గడుపుతూ ఉంటారు. అయితే ఆచార్య రామకృష్ణారెడ్డి తీరు వేరు.. సైన్స్ రంగంపై ఉన్న అపారమైన ప్రతిభ, కష్టపడే తత్వము, ఏదో చేయాలని తపన ఉండటం వల్ల సైన్స్ పై పుస్తకాలు రాయడం, అంతర్జాతీయ సెమినార్లకు నివేదికలు పంపడం లాంటి చర్యలను చేస్తుంటాడు... అమెరికా లాంటి వివిధ దేశాల్లోనీ గ్రంథాలయాల్లో ఆచార్య రామకృష్ణారెడ్డి రాసిన పుస్తకాలు ఉన్నాయంటే ఆయన కృషి ఏంటో అర్థం చేసుకోవచ్చు. గతంలో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో భౌతికశాస్త్ర ఆచార్యుడిగా పనిచేశారు. ఇటీవల ఆచార్య రాజూరు రామకృష్ణారెడ్డిని రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ ఫెలోగా ప్రకటించింది. ఇందులో సభ్యత్వం పొందినందుకు ఎంతో గర్వంగా ఉందని రామ కృష్ణారెడ్డి తెలిపారు.

ఆచార్య రెడ్డి, సైద్ధాంతిక, భౌతిక, పర్యావరణ శాస్త్రాల్లో పరిశోధన చేశారు. అతిసులభమైన సైద్ధాంతిక పద్దతులను ముఖ్యంగా రసాయన శాస్త్ర సంబంధిత క్వాంటం సిద్ధాం త పరమైన రసాయన బంధనాల్ని, భౌతిక రసాయనక పదార్థ ధర్మాల పైన అధ్యనం చేశారు. దుర్భిక్ష, వెనుకబడిన, కరువు ప్రాంతమైన, అనంతపురం పర్యావరణ క్షేత్రం అంశంగా కూడా పరిశోధన చేశారు. ఈ రంగాలలో ఆచార్యరెడ్డి 244 పరిశోధనా ప్రతుల్ని, గూగుల్ సైటేషన్స్ 6439, ఐ10 ఇండెక్స్125, హెచ్.ఇండెక్స్ 45ను పొందారు. స్టాన్ఫోర్డ్ విశ్వవిద్యాలయం రూపొందిం చిన వరల్డ్ టాప్-2 శాస్త్రవేత్తల పట్టికలో ఆచార్య రెడ్డి పేరును ప్రస్తావించడం జరిగింది. ఈయన పరిశోధనలకు ఇస్రో, యూజీసీ, డిపార్ట్మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ వారు కోట్ల ఆర్థిక సాయం అందించారు. ఈయన పర్యవేక్షణలో 21 మంది డాక్టరేట్లు పొందారు. బెస్ట్ టీచర్, బెస్ట్ సైంటిస్ట్, యూజీసీ ఏమిరేట్స్ ఆచార్యుడుగా, బిఎస్సార్ ఫాకల్టీ ఫెలో, మ్యాన్ ఆఫ్ ది ఇయర్ అవార్డులు కూడా పొందారు. గతంలో ఈయనకు ఎఫ్ఎన్ ఈఎస్ఎ, ఇండియా వారు కూడా ఇచ్చారు. విదేశా ల్లో ఈయన పుస్తకాలు ప్రచురింపబడ్డాయి. పాపులర్ సైన్స్ రచయితగా కూడా ఈయనకు పేరుంది.

## హర్యానా, మధ్యప్రదేశ్, గుజరాత్‌లోనూ ఓట్ల చోరీ

**ఆధారాలతో బయటపెట్టినా ఇసి స్పందించలేదెందుకు?**

**నేడు బీహార్‌లోనూ ఆ దిశగా బిజెపి పన్నాగం**

**కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తీవ్రఆరోపణలు**



న్యూఢిల్లీ, నవంబరు 7: ఓట్ చోరీ అంశంపై లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తన దాడిని తీవ్రతరం చేశారు. దేశంలో ఎక్కడ ఏ ఎన్నిక జరిగినా అధికార బిజెపి 'చువాన్ చోరీ' (ఎన్నికలను దొంగలించడం)లో పాల్గొంటుందని, నరేంద్రమోడీ చువాన్ చోరీ ద్వారానే ప్రధానమంత్రి అయ్యారని రాహుల్‌గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో హోల్‌సేల్‌గా ఓట్ల చోరీ జరిగిందని ఆరోపించారు. ఢిల్లీలో రాహుల్‌గాంధీ మీడియాతో మాట్లాడుతూ ఓట్ల చోరీపై తన దగ్గర చాలా ఆధారాలు ఉన్నాయని తెలిపారు. ఓట్ల చోరీపై ప్రజెంటేషన్లు కొనసాగుతాయని చెప్పారు. ప్రధాని మోడీ 'చువాన్ చోరీ' ద్వారా ప్రధాని అయ్యారని తెలిపారు. బిజెపి ఓట్ల చోరీపై యువతకు స్పష్టంగా తెలియజేస్తామన్నారు. హర్యానాలో జరిగిన ఎన్నికలు... అస్సలు ఎన్నికలే కాదన్నారు. హర్యానాలో జరిగిన ఓట్ల చోరీపై అనేక ఆధారాలు చూపించామన్నారు. బిజెపి నేత కుమారుడు రెండు చోట్ల ఓటు వేశారని ఆరోపించారు. అయితే తాను చేసిన ఆరోపణలకు ఇప్పటి వరకు ఎన్నికల సంఘం స్పందించలేదని తెలిపారు. నకిలీ ఓటు, నకిలీ ఫొటోలతో బిజెపి నాయకులు ఓట్లు వేశారని, దీనిని బిజెపి కూడా సమర్థిస్తోందని విమర్శించారు. తన ప్రజెంటేషన్‌లో చూపిస్తున్న చిన్న ఉదాహరణలనే మీడియా తీసుకుంటోందని, బ్రెజిలియన్ మహిళ ఓటు వేసింది ఎవరని ప్రశ్నించారు. మోడీ, అమిత్ షా, ఇసి కలిసి రాజ్యాంగంపై దాడి చేస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగం ఒక మనిషి... ఒక ఓటు అని చెబుతోంది. కానీ హర్యానాలో మానరతం ఒక మనిషి... బహుళ ఓట్లు అని బిజెపి అంటోందని పేర్కొన్నారు. ఇప్పుడు బీహార్‌లో కూడా అదే ఒరవడిని బిజెపి చేయబోతున్న దన్నారు. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, హర్యానా, గుజరాత్‌లలో జరిగింది కూడా ఇదేనన్నారు. బీహార్‌పై కూడా ఇలాంటి ప్రజెంటేషన్‌తో తిరిగి వస్తానని, అక్కడ కూడా ఓట్ చోరీ జరుగుతుందని అను మానం వ్యక్తంచేశారు.

## సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

మచిలీపట్నంలో మంత్రి కొల్లు రవీంద్ర



గన్నవరం(కృష్ణా), నవంబరు 7 ప్రభాతవార్త: ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. శుక్రవారం మచిలీపట్నంలోని టిడిపి కార్యాలయంలో ఆయన ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజాదర్బార్‌లో 110 అర్జీలు రాగా వాటిలో అత్యధికంగా ఇళ్ళస్థలాలు, పింఛన్‌లకు సంబంధించినవే ఉన్నా యన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూనే సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయటంలో కూటమి ప్రభుత్వం విజయవంతమైందన్నారు. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి స్పష్టం చేసారు. ఈ కార్యక్రమంలో ఏయంసి చైర్మన్ కుంచే దుర్గాప్రసాద్, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, జిల్లాగ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మాజీ యంపిపి కాగిత వెంకటేశ్వరావు, మాజీ జడ్‌పిటీసి లంకే నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

## గత ఐదేళ్లు నువ్వు చేసింది అంతా క్రెడిట్ చోరీనే జగన్

మీడియా సమావేశంలో మంత్రి పార్థసారధి



గుంటూరు, నవంబరు 7 ప్రభాతవార్త ప్రతినిధి: గత ఐదేళ్లు నువ్వు చేసింది అంతా క్రెడిట్ చోరీనే, అంతా దోపిడినే, విధ్వంసమే కదా జగన్ రెడ్డి అంటూ మంత్రి కొలుసు పార్థసారథి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం టిడిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లా డారు. తుపాను సమయంలో చంద్రబాబు ప్రభుత్వం సత్వర స్పందన చూపిందని, నష్ట అంచనా నుంచి కేంద్ర కమిటీని రప్పించడం వరకు పార్టీఅధికార యంత్రాంగాలను సమన్వయం చేసి క్షేత్రస్థాయిలో యంత్రాంగాన్ని నడిపించిన తీరును అందరూ ప్రశంసిస్తున్నారని చెప్పారు. కేంద్ర మాజీ కార్యదర్శి సుభాష్ చంద్ర ఘార్గ్ కూడా చంద్రబాబును "విజన్‌కు మారు పేరు" అంటూ అభినందించారని, రాష్ట్ర ప్రయోజనాల్లో రాజీపడని నాయకుడని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ విధ్వంసాన్ని విజన్‌గా చూస్తే, కూటమి ప్రభుత్వం అభివృద్ధి, ఉద్యోగాలు, పెట్టుబడులతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఎపి అభివృద్ధి, పెట్టుబడుల గురించి చర్చిస్తుంటే పులివెందుల ఎమ్మెల్యే మానసిక స్థితి దెబ్బతిని అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో అభివృద్ధి జరిగిందని, క్రెడిట్‌ను చంద్రబాబు దోచుకుంటున్నారని చెప్పడం అమాయకత్వమా లేక నవ్వాలా అని ప్రశ్నించారు. 151 సీట్ల నుంచి 11కి పడిపోవడానికి మోసాలు, విధ్వంసమే కారణమని, ప్రజలు శిక్షించారని గుర్తుచేశారు.




### విజయవాడలో అలెన్ విద్యా కేంద్రం

విజయవాడ, నవంబరు 7 ప్రభాతవార్త: దేశంలో ప్రతిష్టాత్మకమైన అలెన్ విద్యా సంస్థ బ్రాంచ్ ఎపిలో విజయవాడ, విశాఖలో నెలకొల్పడం అభినందనీయమని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. శుక్రవారం విజయవాడలో జరిగిన ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై సంస్థ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడుతూ విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉండడంతో జాతీయ అంతర్జాతీయ సంస్థలు తమ బ్రాంచ్లను నెలకొల్పుతున్నాయన్నారు. డిసిపి కేజీవి సరితా, అలెన్ ఆంధ్ర, తెలంగాణ సమన్వయకర్త సీతారాం నందూరి, వైస్ ప్రెసిడెంట్ అండ్ జోనల్ హెడ్ మహేష్ యాదవ్, టీఎన్ హెడ్ సంతోష్ సింగ్, తెలంగాణ హెడ్ సౌరభ్ తివారీ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై జిల్లా కలెక్టర్ సీరియస్

హాస్టళ్లలో టాయిలెట్లు నిర్మాణంపై సమీక్ష

ఏలూరు, నవంబరు 7 ప్రభాతవార్త: విధుల పట్ల నిరక్ష్యం, నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయని అధికా రులను ఉపేక్షించేది లేదని, వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటానని ఏలూరు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను హెచ్చరించారు. జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలలో, అంగన్వాడీ కేంద్రాలు, పర్యా టక శాఖకు చెందిన ప్రదేశాలలో టాయిలెట్లు నిర్మాణ పను లపై ఆర్‌డబ్ల్యూఎస్, సంక్షేమ శాఖల అధికారులతో కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ శుక్రవారం ద్వారా కలెక్టర్ సమీక్షిం చారు. సంక్షేమ వసతి గృహాలకు టాయిలెట్లు మంజూరు చేసి 3 నెలల సమయం దాటినా ఇంకా టాయిలెట్లు నిర్మించకపోవడంతో జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కామవరపుకోట, జీలుగుమిల్లి, కైకలూరు, ముదినేపల్లి, పోలవరం, కలిదిండి మండలాల ఆర్ డబ్ల్యూఎస్ ఇంజ నీరింగ్ అధికారుల పనితీరుపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ, 24 గంటలలోగా పనులలో పురోగతి ప్రదర్శించని సంబంధిత అధికారులను సస్పెండ్ చేస్తానని హెచ్చ రించారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు మంజూరు చేసిన టాయిలెట్లు, త్రాగునీటి పనులు వెంటనే పూర్తి చేయాలనీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత సంక్షేమ శాఖల అధికారులు తమ శాఖకు చెందిన వసతి గృహాలకు మంజూరైన పనులు పూర్తిఅయ్యేలా సంబంధిత ఇంజనీరింగ్ శాఖ అధికారులతో ఎప్పటికప్పుడు చర్చించా లన్నారు. పనులు పూర్తి నాణ్యతతో ఉండేలా పర్య వేక్షించాలన్నారు. వసతి గృహాలలో విద్యార్థులకు దోమ తెరలు అందించాలని, సిసి కెమెరాలు ఏర్పాటు చేయాల న్నారు. సిపిఒ వాసుదేవరావు, సంక్షేమ శాఖల అధికా రులు, వసతి గృహాల అధికారులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ పై విజయం స్క్రీనింగ్ తో సాధ్యం : పీహెచ్ వైద్యురాలు గౌతమి



**అంబాజీపేట, నవంబర్ 07 ( ప్రభాతవార్త ) :** ఆరోగ్యకరమైన జీవనశైలి, ముందస్తు పరీక్షల ద్వారా క్యాన్సర్ ను నివారించవచ్చునని,క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి స్క్రీనింగ్ చేపట్టాలని పీహెచ్సీ వైద్యురాలు వి.గౌతమి అన్నారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవంలో భాగంగా వైద్య సిబ్బంది, ఆశాలు, ఏఎన్ఎంలు, కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి స్థానిక నాలుగు రోడ్ల సెంటర్ వరకు క్యాన్సర్ స్క్రీనింగ్ పై అవగాహణ ర్యాలీని సీహెచ్ఓ బి.అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి గౌతమి మాట్లాడుతూ మండలంలో 18 ఏళ్ళు పైబడిన వారందరికీ స్క్రీనింగ్ చేయడమే లక్ష్యమన్నారు. ప్రతీ గ్రామంలోని ఎఎన్ఎంలు, ఆశాలు, వైద్య సిబ్బంది క్యాన్సర్ స్క్రీనింగ్ చేయనున్నా రన్నారు. ఇంటింటికి వస్తున్న స్క్రీనింగ్ బృందానికి ప్రజలు సహకరించాలని కోరారు. ముఖ్యంగా మహిళలు మొహమాటం, బిడియం వదిలి ఆరోగ్య సిబ్బందికి సహకరించాలన్నారు. అనుమానాస్పద లక్షణాలు ఉన్న వారిని మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రివెంటివ్ ఆంకాలజీ యూనిట్ కు పంపించి ఉచితంగా ప్రత్యేక వైద్య సదు పాయం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ దొమ్మేటి వెంకటేశ్వరరావు,వైద్య సిబ్బంది, ఎఎన్ఎంలు ,ఆశాలు, ఎస్ఎన్ఎం జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## వేషాలంటే ఆషామాషీ కాదు..కట్టిపడేసే కనికట్టు కత్తిపోటు వేషాలు

**యు.కొత్తపల్లి, నవంబర్ 07 ( ప్రభాతవార్త)** 'ఎక్కడైనా వేషాలు వేయండిగానీ నా దగ్గర వేషాలు వేయకండి' అనేది నానుడి. అదే నానుడిగా ఎక్కడైనా వేషాలు వేయండి గానీ 'మూలపేటలో వేషాలు వేయకండి' అన్నంతగా ఇక్కడి కళాకారుల ప్రదర్శన ఆకట్టుకుంటాయి. వేషాలు చూస్తే నిజంగానే నిజం అనే విధంగా ప్రదర్శించడం ఇక్కడి కళాకారుల ప్రతిభకు నిదర్శనం. ఈ ఊరి కళాకారులు ప్రదర్శించే వేషా లను తిలకించడానికి మండలం నుంచే కాకుండా పరిసర మండలాల ప్రజలు తండోపతండాలుగా తరలి వస్తారు. ప్రతీ 4 సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే గౌరీదేవి ఉత్సవాలలో భాగంగా నిర్వహించే కత్తిపోటు వేషాలు నిజం అనిపించే ఆ ఊరి కళాకారుల సృష్టి. కొత్తపల్లి మండలం మూలపేట గ్రామానికి చెందిన కళాకారులు నైపుణ్యంతో, చాకచక్యంతో అద్భుతం అనిపించే ప్రదర్శనలు. తిలకించిన వారి ఒళ్ళు గగుర్పొడిచే ఈ ప్రదర్శనను వర్ణించతరం కాదు. ఉదయం నుండి కష్టపడితే సాయంత్రానికి వేషాలు



ప్రదర్శించ గలుగుతారు. ప్రారంభం ప్రదేశం నుంచి ఒక లయబద్ధంగా ఒక వేషాన్ని మించిన మరొక వేషం ప్రదర్శించడం ఇక్కడి కళాకారులకే సాధ్యం అన్నంతగా వీరి కళా సృష్టి ఒక నిదర్శనం. ఒక కళాకారుడి భుజాన్ని మరొకరు కత్తితో నరికినట్లు, ఒకరి కడుపులో మరొకరు గుణపంతో పొడవడం, ఒక కళాకారుడి తలపై బాడితితో నరికినట్లు, పక్కలో బల్లెంతో పొడవడం, పొట్టలో రంపంతో పరపరా కోయడం వంటి వేషాలు అద్భుతమనిపిస్తాయి. మూలపేట కళాకారుల ఈ కత్తిపోటు వేషాలు రాష్ట్రంలోనే ప్రసిద్ధ గాంచాయి.


## వందే మాతరం గీతానికి 150 ఏళ్లు..ఎంపీడీఓ,బి.కె.ఎస్.ఎస్.వెంకట రామన్



**ఆత్రేయపురం, నవంబర్ 07 ( ప్రభాతవార్త ) :** బంకించంద్ర చటర్జీ నూట యాభై ఏళ్ల క్రితం ఇదే రోజున ఈ గేయ రచనకు శ్రీకారం చేశారని ఎంపీడీఓ,బి.కె.ఎస్.ఎస్.వెంకట రామన్ గుర్తుచేశారు. దేశభక్తి గీతం"వందే మాతరం" రచించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం ఆత్రేయపురం మండల పరిషత్ కార్యాలయంలో సామూహిక వందేమాతర గానం ఎంపిడిఓ బి.కె.ఎస్.ఎస్.వెంకట రామన్ వారి అధ్యక్షతన జరిగింది. అనంతరం ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపిడిఓ బి.కె.ఎస్.ఎస్.వెంకట రామన్ మాట్లాడుతూ తొలి బెంగాలి ఐపిఎస్ ఆఫీసర్ బంకించంద్ర చటర్జీ సరిగా నూట యాభై ఏళ్ల క్రితం ఇదే రోజున ఈ గేయ రచనకు శ్రీకారం చేశారన్నారు . "వందే మాతరం" గీతం భారత జాతీయ చైతన్యానికి ప్రతీకగా, స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రజలకు ఉత్సాహాన్నిచ్చిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటి ఎంపీడీవో పి. రామకృష్ణంరాజు, మండల విద్యాశాఖాధికారి, పి.వి.ప్రసాదరావు, ఎపిఓ, సి.హెచ్.విజయ రెడ్డి, ఎపియం, ఆర్.యం.డి.గంగాధర్, ఆత్రేయపురం గ్రామ పంచాయితీ కార్యదర్శి, పి.వి.ఆర్.కె.ప్రసాద్, దర్మేంద్ర, మండల పరిషత్ సిబ్బంది, విద్యాశాఖ సిబ్బంది, ఆశా వర్కర్లు, డ్వాక్రా మహిళలు, ఉపాధి కూలీలు విద్యార్థులు, పాల్గొన్నారు.


## గురుకులంలో వందేమాతరం ఆకారంతో విద్యార్థుల ప్రదర్శన

**ఏలేశ్వరం, నవంబర్ 07 ( ప్రభాతవార్త ) :** వందేమాతరం గేయానికి 150 వసంతాలు పూర్తయిన సందర్భంగా ఏలేశ్వరం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థినిలు సంబరాలు జరుపుకున్నారు.బంకించంద్ర ఛటర్జీ వందేమాతరం గేయము రచించి నేటికి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ శారదాదేవి ఆధ్వర్యంలో సహచర అధ్యాపకులు, విద్యార్థినిలతో కలిసి వందేమాతర గీతాన్ని ఆలపించారు. అనంతరం 150 సంవత్సరాల వందే మాతరం ఆకారంలో విద్యార్థులు ప్రదర్శన చేపట్టారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఉపన్యాసాన్ని విద్యార్థిని



విద్యార్థులు తిలకించారు,ఈ సందర్భంగా విద్యార్థినిలకు దేశభక్తి గీతాల పోటీలను నిర్వహించారు చరిత్ర మూలాలను ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని, దేశంపట్ల సమాజం పట్ల విద్యార్థులు గౌరవ మర్యాదలతో ఎదగాలని ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శారదదేవి విద్యార్థులకు సూచించారు.

## ఘనంగా వీరభద్రస్వామి 13వ వార్షికోత్సవం



**మామిడికుదురు, నవంబర్ 07 ( ప్రభాతవార్త ) :** మండలం లోని అప్పనపల్లి గ్రామంలో వెంచేసియున్న శ్రీ వీరభద్రస్వామి వారి ఆలయంలో 13వ.వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది.దీనిలో భాగంగా స్వామి వారికి పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అర్చకులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో తులా గోపాలకృష్ణ-నాగ సూర్యావతి దంపతులు యేడిద వెంకట నారాయణ,తులా వెంకటమణికోటేశ్వరరావులు కర్తలుగా పాల్గొన్నారు.వార్షికోత్సవంలో భాగంగా గణపతి పూజ,పంచామృతాలతో అభిషేకాలు,సహస్ర బిల్వార్చన తదితర పూజా కార్యక్రమాలను వైభవంగా జరిపించారు. పలువురు భక్త దంపతులు సాయి వీరభద్రస్వామి వారిని దర్శించుకున్నారు.

### ఘనంగా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ దినోత్సవం

**సీతానగరం, నవంబర్ 07 ( ప్రభాతవార్త ) :** మండలంలోని రఘుదేవపురం పిఎంశ్రీ జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ 75వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్యామలదేవి, స్కౌట్ ఉపాధ్యాయుడు బి.శిరీష్, కామరాజు, శేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.



### ఉమాదేవికి వైభవంగా లక్ష కుంకుమార్చన



**మామిడికుదురు, నవంబర్ 07 ( ప్రభాతవార్త)** పవిత్ర కార్తీక మాసం సందర్భంగా పెదపట్నం లంక గ్రామంలో కొలువై ఉన్న శ్రీ ఉమా సత్యలింగేశ్వర స్వామి వారి ఆలయంలో శుక్రవారం లక్ష కుంకుమార్చన వైభవంగా జరిపించారు. దీనిలో భాగంగా గణపతి పూజ, సత్యలింగేశ్వ రునికి పంచామృతాలతో అభిషేకాలు జరిపించారు. అభిషేకం అనంతరం ఉమాదేవికి లక్ష కుంకుమార్చన పూజలను ఆలయ అర్చకులు ఆదిరాజు రఘునాధశర్మ ఆధ్వర్యంలో జరిగాయి. అధిక సంఖ్యలో మహిళలు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

### వందేమాతరం అక్షరాలు గా ఏర్పడి ఆకట్టుకున్న విద్యార్థులు



**మామిడికుదురు, నవంబర్ 07 ( ప్రభాతవార్త)** వందేమాతరం గీతాన్ని రచించి 150 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భాన్ని పురస్కరించు కొని మామిడికుదురు దీప్తి పాఠశాల విద్యార్థులు శుక్రవారం విన్నూత్న రీతిలో శుభాకాంక్షలు తెలిపారు. వందేమాతరం అక్షరాలుగా ఏర్పడడంతో పాటు 150సంఖ్య రూపంలో ఏర్పడి కనువిందు చేశారు. విద్యాసంస్థల అధినేత డివివి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని రూపొందించారు.స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ పి.సునీల్ కుమార్ వందేమాతరం గీత రచయిత బంకించంద్ర చటోపాధ్యాయ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.మండల పరిధిలోని పలుచోట్ల ఈ కార్యక్రమాలు జరిగాయి.

### ర్యాలి శ్రీ ఉమాకమండలేశ్వర స్వామికి ఇత్తడి రుద్రాక్ష మండపం బహుకరణ



**ఆత్రేయపురం, నవంబర్ 07 ( ప్రభాతవార్త ) :** ప్రసిద్ధ శైవ క్షేత్రం ర్యాలి శ్రీ ఉమాకమండలేశ్వర స్వామి కి ర్యాలి గ్రామానికి చెందిన ర్యాలి సుబ్బారావు జ్ఞాపకార్ధం, లక్ష్మి మాణిక్యాంబ, వారి కుమారులు, కోడళ్ళు, అల్లుళ్ళు, కుమార్తెలు, మనుమలు శ్రీ స్వామి వారికి 65 కేజీల ఇత్తడి రుద్రాక్ష మండపం బహుకరించారు.

దాతలకు ఆలయ అర్చకులు, వేద పండితులు వేద ఆశీర్వచనం చేయించగా, ఆలయ కార్యనిర్వాహణాధికారి భాగవతుల వెంకటరమణ మూర్తి, జూనియర్ అసిస్టెంట్లు మేడిద శ్రీను, దత్తు, శ్రీ స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

# వాడపల్లి క్షేత్రానికి అశేష భక్తజనం

## - స్వామివారి ఒక్కరోజు ఆదాయం, రూ.7,03 లక్షలు

**ఆత్రేయపురం , నవంబర్ 07 ( ప్రభాతవార్త ) :** కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయం అశేష భక్తజనంతో శోభిల్లింది. ఏడు వారల నోము చరించే భక్తులతో ఆలయ పరిసరాలన్నీ గోవిందనామ స్మరణతో మార్మోగాయి. ఉదయం స్వామివారి మేలుకొలుపు,శ్రీ లక్ష్మి వెంకటేశ్వర ఐశ్వర్య హోమం, అష్టోత్రశతనామవలి, నిత్యా కల్యాణం, బాలభోగం ,నీరాజన మంత్ర పుష్పం, పవలిం పు సేవ తదితర కార్యక్రమాలు అర్చకులు ఘనంగా



నిర్వహించారు. భక్తులు శ్రీ స్వామివారిని దర్శించుకుని అన్న ప్రసాదాలు స్వీకరించారు. ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం చెందిన కూచిభోట్ల వెంకట ప్రభాకర్ కుమార్, సీతకుమారి, దంపతులు వారి కుటుంబ సభ్యులు నిత్యాన్నదాన పథకానికి రూ. 75,001/- వేలు విరాళంగా అందించారు. వీరికి ఆలయ అర్చకులు, వేద పండితులు, వేద ఆశీర్వచనం అందించగా ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు శ్రీ స్వామివారి చిత్రపటం ప్రసాదాలను అందజేశారు.





## జగ్గంపేటలో బేటి బచావో - బేటి పడావోపై అవగాహన

**జగ్గంపేట, నవంబర్ 07 ( ప్రభాతవార్త ) :** అంతర్జాతీయ బాలల హక్కుల వారోత్సవాల సందర్భంగా బేటి బచావో - బేటి పడావో కార్యక్రమం లో భాగంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గంపేట హై స్కూల్ విద్యార్థులు, విద్యార్థినులు పాల్గొన్నారు. ఐసిడిఎస్ జగ్గం పేట ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్య క్రమంలో విద్యార్థులు మండలం లోని ప్రభుత్వ కార్యాలయాలు ం పోస్ట్ ఆఫీస్, పోలీస్ స్టేషన్, తాసిల్దార్, ఆఫీస్, ఎంపీడీఓ ఆఫీస్, ఫైర్ స్టేషన్, వ్యవసాయ శాఖ, సి హెచ్ సి లను సందర్శించి ప్రభుత్వ సేవలు ప్రజలకు ఎలా చేరుతున్నాయి,



అధికారులు పారదర్శకంగా ఎలా పనిచేస్తున్నారు అనే అంశాలపై అవగాహన పొందారు.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు తమ సోషల్ సబ్జెక్ట్ పాఠ్యాంశాలను వాస్తవికతతో అనుసంధానం చేసుకునే అవకాశాన్ని పొందారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ పూర్ణిమ మరియు ఐసీడిస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బొబ్బర్లంక బ్యారేజి రోడ్డు గోతులను పూడ్చిన ఎస్సీ యూత్ సభ్యులు



**ఆత్రేయపురం, నవంబర్ 07 ( ప్రభాతవార్త ) :** బొబ్బర్లంక, దవళేశ్వరం బ్యారేజ్ గుంతలు పడడంతో బస్సులు, ద్విచక్ర వాహన దారులు, తదితర ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న తరుణంలో ఆత్రేయపురం ఎస్సై ఎస్ రాము ఆధ్వర్యంలో బొబ్బర్లంక ఎస్సీ యూత్ సభ్యులు చల్లపూడి పవన్ నేతృత్వంలో ఎస్సీ యూత్ సభ్యులతో కలసి బ్యారేజ్ రోడ్డు గోతులను సిమెంట్ కంకర్ వేసి గుంతలు పూడ్చారు .ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి గుంతలు పూడ్చిన రెండు జిల్లాల యూత్ సభ్యులను ఎస్సై ఎస్ రాము ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ఘనంగా వందేమాతరం150వ వసంత వేడుక

**నిడదవోలు, నవంబర్ 07 ( ప్రభాతవార్త ) :** నిడదవోలు డొక్కా సీతమ్మ మున్సిపల్ హైస్కూల్ లో "వందేమాతరం" జాతీయ గీతాన్ని రచించి 150 వసంతలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన సామూహిక గీతాలాపన కార్యక్రమ%శీ%లో ప్రధానోపాధ్యాయుడు నేతల భీమారావు, పాల్గొన్నారు.

వందేమాతరం" జాతీయ గీత రచయిత బంకించంద్ర ఛటోపాధ్యాయ్ చిత్ర పటానికి ప్రధానోపాధ్యాయుడు నేతల భీమారావు, యాజమాన్య కమిటీ చైర్మన్ వెంకటపు చందు నివాళులు అర్పించారు. ప్రతి ఒక్కరు వికసిత్ భారత్ లక్ష్యం వైపు అడుగులు వేసే ప్రతి ఒక్కరు కార్యోణుముకులను చేసే దిశగా ముందుకు తీసుకువెళ్ళడం జరుగుతుంది.తప్పనిసరిగా ప్రతి ఒకరు దేశభక్తి తో ఈదేశ స్వరాజ్య స్థాపనకు పునరాకింతం కావాలని అని అన్నారు,ఈ కార్యక్రమంలో సోషల్ టీచర్ హేమ, ఫిజికల్ డైరెక్టర్ చెల్లె చిట్టి తల్లి, లెక్కలు టీచర్ ఏవి అప్పారావు, సంస్కృత పండిత్ ఎస్ ఏసు మణి, పూర్వ విద్యార్థి సూర్య సాయి,తదితరులు పాల్గొన్నారు.

# భారతీయుల్లో స్వాతంత్ర కాంక్షను రగిలించిన గేయం వందేమాతరం : కలెక్టర్ షణ్మోహన్ సగిలి

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, నవంబర్ 07 ( ప్రభాతవార్త ) :** భారతీయుల్లో వందేమాతరం గేయం స్వాతంత్ర కాంక్షలు రగిలించిందని, ఈ గేయం స్ఫూర్తితో ఎందరో మహనీయులు స్వతంత్ర పోరాటంలో పాల్గొన్నారని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ పేర్కొన్నారు. వందే మాతరం గేయం నేటితో 150 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం పిఠాపురం ఆర్ఆర్బీహెచ్ఆర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ప్రజాప్రతినిధులతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్వతంత్ర సమరయోధుల చిత్రపటాలకు పుష్పాంజలి ఘట్టించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి జిల్లా కలెక్టర్ వందేమాతరం గేయాన్ని ఆలపించారు. అనంతరం అంతర్జాతీయ బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా బేటీ బచావో - బేటీ పడావో కార్యక్రమం కింద జిల్లా స్త్రీ, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలలకు



ఒక్కరోజు క్షేత్రస్థాయి అవగాహన కార్యక్రమానికి సంబంధించిన బస్సును జిల్లా కలెక్టర్ షణ్మోహన్.. ప్రజాప్రతినిధులతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ 1875 సంవత్సరం నవంబర్ 7న బెంగాలీకి చెందిన ప్రముఖ కవి బంకించంద్ర ఛటర్జీ ఆనందమఠ్ అనే నవల నుంచి ఈ వందేమాతరం గేయాన్ని రచించడం జరిగిందన్నారు. అనతి కాలంలోనే ఈ గేయం భారతీయుల్లో స్వాతంత్రకాంక్షను రగిలించిందన్నారు. ఈ గేయం స్ఫూర్తితో ఎంతోమంది స్వతంత్ర పోరాటంలో చురుకుగా పాల్గొన్నారన్నారు. నేటి యువత కూడా వందేమాతరం గయాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అదేవిధంగా అంతర్జాతీయ బాలల హక్కుల వారోత్సవాలు-2025 భాగంగా బేటీ బచావో - బేటీ పడావో కార్యక్రమం కింద జిల్లా స్త్రీ, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలలకు ఒక్కరోజు క్షేత్రస్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం కింద విద్యార్థులను ప్రభుత్వ కార్యాలయాలకు తీసుకువెళ్లి పరిపాలన, కెరియర్ గైడెన్స్ కు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి, పిఠాపురం మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీఎస్ఎన్ వర్మ, పెండెం దొరబాబు, కాకినాడ ఆర్డీవో ఎస్ మల్లి బాబు, పాడా ఏపీడీ వసంత మాధవి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408.
RNI No.64863/96,"Editor : *Damerla Sai Baba, *Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps

## మహిళల ఐపిఎల్ మెగావేలంలో..

# భారత్ క్రీడాకారిణులకు బిగ్ ఛాన్స్


హర్మన్‌ప్రీత్ కౌర్


జెమీమా రోడ్రిగ్స్


షఫాలీ వర్మ


స్మృతి మంధాన

**న్యూఢిల్లీ:** మహిళల వన్డే ప్రపంచకప్ 2025 విజయంతో భారత మహిళల క్రికెట్ జట్టుకు మంచి క్రేజ్ ఏర్పడింది. భారత అమ్మాయిల విజయం వెనుక వుమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) పాత్ర కూడా ఉంది. టీమిండియా జట్టులోని పలువురు సభ్యులు డబ్ల్యూపీఎల్ ఫ్రాంచైజీల టీముల్లో ఉన్నారు. ఇప్పటికే మూడు సీజన్లు పూర్తి చేసుకున్న డబ్ల్యూపీఎల్ నాలుగో సీజన్ కోసం సమాయత్తమవుతుంది. గత మూడు సీజన్లలో ముంబై ఇండియన్స్ రెండు సార్లు డబ్ల్యూపిఎల్ టైటిల్ గెలవగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఒకసారి గెలిచింది. ఇక 4వ విడత డబ్ల్యూపీఎల్ 2026కు సంబంధించిన మెగా వేలం ఈ నెల 27న జరగనుంది. ఈ మెగా వేలం రూల్స్ ప్రకారం ప్రతి జట్టు గరిష్టంగా ఐదుగురు ప్లేయర్లను మాత్రమే రిటైన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇందులో గరిష్టంగా ముగ్గురు భారత క్యాప్డ్ ప్లేయర్లు, ఇద్దరు ఫారిన్ ప్లేయర్లు, ఇద్దరు క్యాప్డ్ ప్లేయర్లు తీసుకోవాల్సి ఉంటుంది. ఇక వేలం పర్స్ వాల్యూను రూ.15 కోట్లుగా నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఆయా ఫ్రాంచైజీలు తమ జట్లలోని ప్లేయర్ల రిటైన్, రిలీజ్ జాబితాలను ఖరారు చేశాయి. డిఫెండింగ్ ఛాంపియన్ ముంబై ఇండియన్స్‌తో పాటు, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ జెయింట్స్, యూపీ వారియర్స్, ఢిల్లీ క్యాపిటల్స్ తమకు కలిసొచ్చే ఆటగాళ్లను రిటైన్ చేసుకొని

### ఫ్రాంచైజీల రిటైన్ లిస్ట్‌లో ప్లేస్ సేఫ్

అవసరం లేని ఆటగాళ్లను వేలంలోకి వదిలేసాయి. ముంబై, బెంగుళూరు, ఢిల్లీ ఐదుగురి ఆటగాళ్లను, యూపీ ఒకే ఒక్క ప్లేయర్‌ను అంటిపెట్టుకుంది. ముంబై అట్టిపెట్టుకునే జాబితాలో నాట్ సీవర్ బ్రంట్ (రూ.3.5 కోట్లు), హర్మన్‌ప్రీత్ కౌర్ (రూ.2.5 కోట్లు), కమిలిని, రిలీజ్‌లో అక్షితా మహేశ్వరి, పూజా, ఢిల్లీ రిటైన్‌లో జెమీమా రోడ్రిగ్స్(రూ.2.2 కోట్లు), షఫాలీ వర్మ(రూ.2.2 కోట్లు), నికీ ప్రసాద్, రిలీజ్ లిస్ట్‌లో చరణి, నందిని కశ్యప్, అరుంధతిరెడ్డి, మిన్ను మణి, రాధా యాదవ్, స్నేహ దీప్తి, టిటాస్ సాధు. రాయల్ ఛాలెంజర్స్ రిటైన్‌లో స్మృతి మంధాన(రూ.3.5 కోట్లు), రిచా (రూ.2.75 కోట్లు), రిలీజ్‌లో రాఘవి బిస్త్, మేఘన, శోభనా, సోఫీ డివైన్, రేణుకా, యూపీవారియర్స్ రిలీజ్‌లో క్రాంతి, దీప్తి శర్మ, చమరి అతపత్తు, సోఫీ ఎక్లెస్టోన్, సైమా, గుజరాత్ జెయింట్స్ రిలీజ్ లిస్ట్ దయాళన్ హేమలత, మేఘనా సింగ్.



# ఫిడే వరల్డ్ కప్‌లో.. భారత్ గ్రాండ్ మాస్టర్ల దూకుడు

**న్యూఢిల్లీ:** ఫిడే వరల్డ్ కప్‌లో భారత గ్రాండ్ మాస్టర్లు దూకుడు ప్రదర్శిస్తున్నారు. ఇందులో భాగంగా విదిత్ గుజరాతీ ఎట్టకేలకు రెండో ర్యాపిడ్ గేమ్‌లో అర్జెంటీనా వండర్ కిడ్ ఫాస్టినో ఓరో డిఫెన్స్‌ను ఛేదించగలిగాడు. వి ప్రణవ్, ఎం ప్రాణేష్ కూడా ఈ టోర్నమెంట్‌లో మూడవ రౌండ్‌కు చేరుకుని మొదటి సెట్ ర్యాపిడ్ గేమ్‌లలో తమ ప్రత్యర్థులపై విజయం సాధించారు. రెండు క్లాసికల్ గేమ్‌లలో 12 ఏళ్ల ఓరో ఒత్తిడి తెచ్చినా కానీ విదిత్ రెండవ రాపిడ్ గేమ్‌లో బ్లాక్ పావులతో 52మూవ్‌ల విజయాన్ని సాధించాడు. అలాగే ప్రణవ్ నార్వేకు చెందిన ఆర్యన్ తారిని ఓడించగా, ప్రాణేష్ జర్మనీకి చెందిన దిమిత్రిజ్ కొల్లార్స్‌ను ఓడించి ప్రపంచ ఛాంపియన్ దొమ్మరాజు గుకేష్, ఎరిగాసి అర్జున్, పి హరికృష్ణ, కార్తీక్ వెంకట్రామన్, దీప్తయన్ ఘోష్ వంటి వారితో తదుపరి రౌండ్‌లో చేరాడు. అయితే మరో భారత్ గ్రాండ్ మాస్టర్ నిహాల్ సరిన్ బిలీ స్టామటిస్ కౌర్కొలోస్ ఆర్డిటిస్ (గ్రీస్) చేతిలో ఓడిపోయాడు. ఇక విదిత్ ఇప్పుడు అమెరికాకు చెందిన సామ్ షాంక్లాండ్‌తో తలపడనున్నాడు. అతను రెండవ రౌండ్‌లో గ్రాండ్‌మాస్టర్ వాసిల్ ఇవాన్‌చుక్‌ను ఓడించాడు. ఇతర బోర్డులలో జరిగిన రెండవ క్లాసికల్ గేమ్‌లో ప్రపంచ జూనియర్ ఛాంపియన్ ప్రణవ్, రూక్‌పాన్ ముగింపులో 44 కదలికలలో మొదటి రాపిడ్ గేమ్‌ను గెలుచుకున్నాడు. ఆ తర్వాత అతను రెండవ గేమ్‌లో బ్లాక్‌తో నార్వేజియన్‌ను డ్రాగా ముగించాడు. ప్రాణేష్, కొల్లార్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో, బ్లాక్ గేమ్ ఆడుతున్న భారత ఆటగాడు, రెండవ రాపిడ్ గేమ్‌లో 24వ మూవ్‌లో ఆధిక్యాన్ని సాధించాడు.

## వన్డే సిరీస్‌లో పాకిస్థాన్ చిత్తు

**న్యూఢిల్లీ:** వన్డే సిరీస్‌లో దక్షిణాఫ్రికా పాకిస్థాన్‌ను చిత్తు చిత్తుగా ఓడించింది. ఫైసలాబాద్‌లోని ఇక్బాల్ స్టేడియంలో శుక్రవారం జరిగిన రెండో వన్డేలో పాకిస్తాన్‌పై 8 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికా విజయం సాధించింది. ఈ విజయం దక్షిణాఫ్రికా మూడు మ్యాచ్‌ల వన్డేసిరీస్‌ను 1-1తో సమంచేయడంలో సహాయపడింది. దక్షిణాఫ్రికా 270పరుగుల లక్ష్యంలో భాగంగా లువాన్‌డ్రే ప్రిటోరి యస్ (46) తో కలిసి 81 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యం ఇన్నింగ్స్‌కు వేదికగా నిలిచింది. డి కాక్, టోనీ డి జోర్జి (63 బంతుల్లో 76) ల మధ్య 153 పరుగుల భాగస్వామ్యంతో ఇన్నింగ్స్ నిజంగా సజీవంగా మారింది. డి జోర్జి బౌండరీలతో నిండిన ఇన్నింగ్స్‌తో పాకిస్తాన్‌కు భారీ నష్టాన్ని కలిగించాడు. డి కాక్, స్టాండ్‌ఇన్ కెప్టెన్ మాథ్యూ బ్రీట్జ్కే (17) తో కలిసి, దాదాపు 10 ఓవర్లు మిగిలి ఉండగానే ఛేజింగ్‌ను 40.1 ఓవర్లలో 270/2 వద్ద ముగించాడు. మొదట బ్యాటింగ్ ఎంచుకున్న పాకిస్తాన్, దక్షిణాఫ్రికా పేస్ దాడికి ప్రారంభంలోనే విఫలమైంది. ఎడమచేతి వాటం సీమర్ నాండ్రే బర్గర్ మొదటి 5 ఓవర్లలోనే ఫఖర్ జమాన్, బాబర్ అజామ్, మహ్మద్ రిజ్వాన్ వికెట్లతో సహా 4/46 వికెట్లు తీసుకు న్నాడు. అతని కఠినమైన పేస్, స్వింగ్ పాకిస్తాన్‌ను 22/3 వద్ద కుప్పకూల్చాయి. లెగ్‌స్పిన్నర్ న్కాబా పీటర్ కెరీర్‌లో అత్యుత్తమ గణాంకాలు 3/55 సాధించాడు. ప్రారంభ పతనం ఉన్నప్పటికీ, సైమ్ అయూబ్ (53), సల్మాన్ అలీ ఆఘా (69), మహ్మద్ నవాజ్ (59) ప్రతిఘటించి పాకిస్తాన్‌ను 269/9కి పెంచారు. అయితే, దక్షిణాఫ్రికా ఫామ్‌లో ఉన్న టాప్ ఆర్డర్‌ను అధిగమించలేకపోయారు.

## అనధికారిక మ్యాచ్‌లో..

# భారత్‌కు 34 రన్స్ ఆధిక్యం



**న్యూఢిల్లీ:** దక్షిణాఫ్రికాతో జరుగుతున్న అనధికారిక టెస్ట్ మ్యాచ్‌లో భారత్ 34 పరుగుల ఆధిక్యంలో ఉంది. రెండో అనధికారిక టెస్టు మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 47.3 ఓవర్లలో 221 పరుగులకే ఆలౌట్ అయింది. దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌లో కెప్టెన్ అకెర్‌మన్ విధ్వంసకర శతకంతో ఒంటరి పోరాటం చేశాడు. సహచరులు సహకరించకపోయినా, ఒక్కడే నిలబడి 200 పరుగుల మార్కును దాటించాడు. కేవలం 118 బంతుల్లోనే 17 ఫోర్లు, 5 సిక్సర్ల సాయంతో 134 పరుగులుచేశాడు. అకెర్‌మన్ కాకుండా దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌లో జోర్డన్ హెర్మన్ (26), సుబ్రాయన్ (20) మాత్రమే రెండంకెల స్కోర్లు చేశారు. దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌లో టీమ్ కెప్టెన్ టెంబా బావుమా సహా నలుగురు డకౌట్లయ్యారు. అంతకు ముందు భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 255 పరుగులకు ఆలౌట్ అయింది. ధృవ్ జురెల్ (132) వీరోచిత శతకంతో టీమిండియా పరువు కాపాడాడు. 126 పరుగులకే 7 వికెట్లు కోల్పోయిన జురెల్ టెయిలెండర్లు కుల్దీప్ (20), సిరాజ్ (15) సహకారంతో టీమిండియాకు గౌరవప్రదమైన స్కోర్ అందించాడు. భారత్ ఇన్నింగ్స్‌లో సీని యర్లు కెఎల్ రాహుల్ (19), సాయి సుదర్శన్ (17), అభిమన్యు ఈశ్వరన్ (0), దేవదత్ పడిక్కల్ (5), రిషబ్ పంత్ (24) తక్కువ స్కోర్లకే ఔటయ్యారు. ఇక దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 221 పరుగులకు ఆలౌట్ కావడంతో భారత్ 34 పరుగుల ఆధిక్యంలోఉంది.

## హాంగ్‌కాంగ్ సిక్సస్ టోర్నీలో భారత్ చేతిలో పాకిస్థాన్‌కు పరాభవం



**న్యూఢిల్లీ:** భారత్ చేతిలో పాకిస్థాన్‌కు మరోసారి పరాభవం ఎదురైంది. హాంగ్‌కాంగ్ సిక్సస్ టోర్నీలో పాకిస్థాన్‌పై భారత్ డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 2 పరుగుల తేడాతో విజయం సాధించింది. మాంగ్ కాక్ వేదికగా శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ తొలుత బ్యాటింగ్ చేసి నిర్ణీత 6 ఓవర్లలో 4 వికెట్లు నష్టానికి 86 పరుగులు చేసింది. ఓపెనర్లు రాబిన్ ఊతప్ప (28), భరత్ చిప్లి (24) ఒక మాదిరిగా ఆడారు. ఆఖర్లో కెప్టెన్ దినేశ్ కార్తిక్ (17 నాటౌట్) సైతం బ్యాట్‌కు పనిచెప్పాడు. భారత్ ఇన్నింగ్స్‌లో స్టువర్ట్ బిన్ని 4, మిథున్ 6 పరుగులు చేశారు. పాక్ బౌలర్లలో మహమ్మద్ షెహజాద్ 2, అబ్దుల్ సమద్ ఒక వికెట్ తీశారు. అనంతరం పాకిస్థాన్ 87 పరుగుల లక్ష్య ఛేదనలో వరుణుడు అడ్డు పడ్డాడు. దీంతో పాక్ స్కోర్ 41/1 (3 ఓవర్లు) వద్ద ఉండగా వర్షం మొదలైంది. ఎంతకీ తగ్గకపోవడంతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం భారత్‌ను విజేతగా ప్రకటించారు. మ్యాచ్ ముగిసే సమయానికి ఖ్వాజా సఫీ (18 నాటౌట్), అబ్దుల్ సమద్ (16 నాటౌట్) క్రీజులో ఉన్నారు. మాజ్ సదాఖత్ (7) ఔట్ కాగా, సదాఖత్ వికెట్ స్టువర్ట్ బిన్నికి దక్కింది. ఈ టోర్నీలో భారత్ తమ తదుపరి మ్యాచ్ కువైట్‌తో తలపడనుంది.

# స్టాక్ మార్కెట్లకు మూడో రోజూ తప్పని నష్టాలు




**ముంబయి, నవంబరు 7:** అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల ధోరణులు, విదేశీ ఇన్వెస్టర్లు అమ్మకాలకే ఎక్కువ ఆసక్తిచూపించడంతో భారత స్టాక్ సూచీలు మూడోరోజు కూడా నష్టాల్లోనే ముగిసాయి. ఉదయంనుంచే నష్టాలతోట్రేడింగ్ ప్రారంభం అయింది. పిఎస్‌యు బ్యాంకుల్లో కొనుగోళ్ల మద్దతుతో ఒకదశలో లాభాల్లోకి వచ్చి మళ్లీ నష్టాల్లోకి జారుకున్నాయి. దీనితో వారాంతంలో సూచీలకు భారీ నష్టాలకు కొంత బ్రేక్‌పడింది. నిఫ్టీ 25,500 దిగువన ట్రేడింగ్ ముగించింది. సెన్సెక్స్ 83,150.15 పాయింట్ల వద్ద ప్రారంభం అయి ఇంట్రాడేలో 82,670.95వద్ద కనిష్టస్థాయికి వెళ్లింది. ఆ తర్వాత లాభాల్లోకి వచ్చిన సూచీ చివరికి 94.73 పాయింట్లవద్ద నష్టంతో ముగిసింది. 83,216.28వద్దముగిసింది. నిఫ్టీకూడా 17.40 పాయింట్ల నష్టంతో 25,492.30వద్ద స్థిరపడింది. డాలరుతోరూపాయి మారకం విలువలు 88.65గా నడిచింది. సెన్సెక్స్ సూచీల్లో బ్లాక్‌డీల్ తో ఎయిర్‌టెల్ సుమారు 4శాతం నష్టపోయింది. 0.8శాతం వాటాను సింగ్‌టెల్ విక్రయించడంతో ఎయిర్‌టెల్‌షేర్లు ఒత్తిడిలో ముగిసాయి. టెక్‌మహీంద్ర, ట్రెంట్, రిలయన్స్, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ షేర్లు నష్టాల్లోముగిసాయి. బజాజ్‌ఫైనాన్స్, టాటా స్టీల్, మహీంద్ర అండ్ మహీంద్ర, బజాజ్ ఫిన్‌సెర్వ్, ఐసిఐసిఐబ్యాంకు షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ ముడిచమురుబ్యారెల్‌కు 64 డాలర్లవద్ద కొనసాగితే ఔన్స్ బంగా రంధరలు 4004 డాలర్లవద్ద ట్రేడ్ అయింది.

# రిటైల్‌ద్రవ్యోల్బణం 0.6% అంచనా

## రేటింగ్ సంస్థల ఆర్థికవేత్తల విశ్లేషణ



**న్యూఢిల్లీ, నవంబరు 7:** దేశంలో రిటైల్‌ద్రవ్యోల్బణం రికార్డుస్థాయికి అక్టోబరులో నమోదు అయింది. కూరగాయల ధరలు తగ్గడమే ఇందుకుకారణం. జిఎస్టీ, సేవలరంగ పన్నులు తగ్గింపు కూడా ఒకింత కారణం అయింది. రిజర్వుబ్యాంకు అంచనాలు కూడా ద్రవ్యోల్బణం పరంగా తగ్గించింది. మార్కెట్ నిపుణులు ఎక్కువశాతం 0.2నుంచి 0.6శాతంగా రిటైల్‌ద్రవ్యోల్బణం ఉంటుందని వెల్లడించారు. సెప్టెంబరులో నమోదయిన 1.5శాతంతో పోలిస్తే తగ్గుతుందని అంచనావేసారు. ఆర్‌బిఐ కూడా తన ఎంపిసి సమీక్షలో ఈ ఆర్థికసంవత్సరం రిటైల్‌ద్రవ్యోల్బణం 2.6శాతం మించకపోవచ్చని వెల్లడించింది. బ్యాంక్ ఆఫ్ బరోడా అంచనాలు చూస్తే 0.4నుంచి మైనస్ 0.6శాతంగా ఉండవచ్చని వెల్లడించింది. జిఎస్టీ రేట్ క్రమబద్ధీకరణ ఇందుకు దోహదంచేస్తుందని బీవోబీ అంచనావేసింది. ఇక్రా అంచనాలనుచూస్తే అక్టోబరులో రిటైల్‌ద్రవ్యోల్బణం 0.5శాతంగా ఉంది. ఎంపిసి కమిటీ డిసెంబరులో మళ్లీ సమావేశం కానుంది. అప్పటికి సగతున 2026లో రిటైల్ ద్రవ్యోల్బణం ప్రస్తుతం ఉన్న 2.6శాతంనుంచి 2.6శాతంగా ఉండవచ్చని ఇక్రా ఆర్థికవేత్త అదితినాయర్ అన్నారు. డిబిఎస్ బ్యాంకు ఆర్థికవేత్త రాధికా రావు మాట్లాడుతూ రిటైల్‌ద్రవ్యోల్బణం మరింత తగ్గుతుందని వెల్లడించారు. వార్షికపద్ధతిలోచూస్తే ద్రవ్యోల్బణం 0.2శాతం తగ్గుతుందని వెల్లడించారు.

# రూ.2 లక్షలకు చేరువకానున్న వెండి

## పెరుగుతున్న పెట్టుబడులే కారణమంటున్న రేటింగ్ సంస్థలు



**న్యూఢిల్లీ, నవంబరు 7:** అమెరికా, భారత్‌లమధ్య జరుగుతున్న వాణిజ్యచర్చలు కొలిక్కివచ్చేలోపే వెండి బంగారంధరలపై ఈ ప్రభావం ఎక్కువ చూపిస్తోంది. భారతదేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న బంగారం, వెండి ధరలకు ఈ చర్చలు కొలిక్కివస్తే బ్రేక్ వేసే అవకాశం ఉంది. దేశ ఫ్యూచర్స్ మార్కెట్లో బంగారం ధరలు వాటి గరిష్ట స్థాయి నుండి 10 శాతానికి పైగా తగ్గాయి. ఇంతలో వెండి ధరలు వాటి గరిష్ట స్థాయి నుండి దాదాపు 14 శాతం తగ్గాయి. అంటే బంగారం,వెండి ధరలు ఇప్పటికే ఒక నెల రోజుల్లో గణనీయమైన దిద్దుబాటును చూశాయి. అంతర్జాతీయ మార్కెట్లో వెండి ప్రస్తుతం ఔన్సుకు 48 డాలర్లనుండి 50డాలర్ల వరకు ఉంది. ప్రస్తుత సంవత్సరం చివరి వరకు వెండి ధరలు ఈ శ్రేణిలో ఉండవచ్చని నిపుణులు భావిస్తున్నారు. ఇంకా వచ్చే ఏడాది మధ్య నాటికి, వెండి ధరలు ఔన్సుకు 60 నుండి 75డాలర్ల వరకు చేరుకోవచ్చు. చైనా, భారతదేశంతో సహా ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థలు పూర్తిగా తిరిగి తెరిచినందున నిపుణులు వెండి ధరలపై గణనీయమైన పందెం వేస్తున్నారు. ఈనేపథ్యంలో కిలో వెండి రెండులక్షలరూపాయలు దాటినా ఆశ్చర్యపోనవసరం లేదని రేటింగ్ సంస్థలు పేర్కొంటున్నాయి. ఎలక్ట్రిక్ వాహనాలు, సౌర ఫలకాల ఉత్పత్తి పెరుగుతోంది. చైనా, యునైటెడ్ స్టేట్స్ మధ్య వాణిజ్య ఒప్పందం ఖరారు కావడం వల్ల చైనా పరిశ్రమలు గణనీయమైన వృద్ధికి దారి తీస్తాయి. తత్ఫలితంగా వెండికి పారిశ్రామిక డిమాండ్ పెరుగుతుందని భావిస్తున్నారు.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.